

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



మెట్రో చార్జీలు పెంపు

కనిష్ఠంగా రూ.2, గరిష్ఠంగా రూ.16 వరకు

11 కొత్త ధరలు 17 నుంచి అమలులోకి

మెట్రోరైలు చార్జీలను పెంచడం ఇదే తొలిసారి

ఎఫ్‌ఎఫ్‌సీ సిఫారసుల ప్రకారమే..: ఎల్ అండ్ టీ

శుక్రవారం | 16-5-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 47

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, బహుళపక్షం, తిథి: చవితి తె.5:14 తదుపరి పంచమి, నక్షత్రం: మూల సా.4:08 తదుపరి పూర్వాషాఢ, వర్జ్యం: ప.2:23-4:08, రా.2:22-4:04, దుర్ముహూర్తం: ఉ.8:20-9:11, మ.12:37-1:28, అమృతఘడియలు: ఉ.9:11-10:55, రాహుకాలం: ఉ.10:30-12:00, సూర్యోదయం: 5:46, సూర్యాస్తమయం: 6:36 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



కాళేశ్వరం వద్ద పుష్కర స్నానం చేస్తున్న సీఎం రేవంత్, పొంగులేటి, శ్రీధర్‌బాబు, పొన్నం

కాళేశ్వరానికి మాస్టర్ ప్లాన్ 9

ఆలయ అభివృద్ధికి రూ.200 కోట్లు.. గోదావరి పుష్కరాల్లో శాశ్వత పనులు

సరస్వతీ పుష్కరాల్లో సీఎం రేవంత్

పుష్కర స్నానమాచరించి ముక్తీశ్వరుడికి పూజలు

వైభవంగా సరస్వతీ పుష్కరాలు ప్రారంభం

తొలిరోజు 20 వేల మంది పుణ్యస్నానాలు



యాదగిరిగుట్టలో మిస్‌వరల్డ్ పోటీదార్లు

యాదగిరీశుడి చెంతన..

స్వామి వారి దర్శనానికి మిస్ వరల్డ్ పోటీదారులు.. ప్రత్యేక పూజలు

సుందరీమణుల మనసు దోచిన చేనేత, ఇక్కత్ చీరలు

పోచంపల్లిలో ప్రత్యేక ఆకర్షణగా చేనేత వస్త్రాల ప్రదర్శన 13

'తెలంగాణ జరూర్ ఆనా' అంటూ అందగత్తెల నినాదాలు

రాష్ట్రపతికి సుప్రీంకోర్టు గడువు

విధించడమా?

రాజ్యాంగంలోనే అటువంటి నిబంధన లేనప్పుడు తీర్పు ఎలా ఇస్తారు?.. అది ఎలా చెల్లుబాటు?

200, 201 అధికరణాల కింద గవర్నర్, రాష్ట్రపతికి బిల్లుల ఆమోదం విషయంలో అధికారాలుంటాయి

కాలపరిమితిపై రాజ్యాంగం గడువు విధించలేదు

అలాంటప్పుడు సుప్రీం కోర్టు ఎలా విధిస్తుంది?

14 ప్రశ్నలు సంధించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ఆర్టికల్ 143(1) కింద సుప్రీం కోర్టును వివరణ కోరిన రాష్ట్రపతి



న్యూఢిల్లీ, మే 15: రాష్ట్రాల బిల్లులు ఆమోదించే విషయంలో గవర్నర్, రాష్ట్రపతికి గడువు విధిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశ్నించారు. శాసనసభలు ఆమోదించిన బిల్లులకు గవర్నర్లు ఆమోదం తెలపకుండా కాలయాపన చేయడం, రాష్ట్రపతి పరిశీలనలో ఉన్నవీ తీవ్ర జాప్యానికి గురికావడంపై సుప్రీంకోర్టు గత నెల 8న సంచలన తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇలాంటి అంశాలపై 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలంటూ గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించింది. ఈ తీర్పును రాష్ట్రపతి ప్రశ్నించారు. రాజ్యాంగంలో అలాంటి నిబంధనేదీ లేనప్పుడు.. సుప్రీంకోర్టు తీర్పు ఎలా ఇచ్చిందని? అది ఎలా చెల్లుబాటు అవుతుందని ముర్ము అడిగారు. రాజ్యాంగంలోని 143(1) అధికరణం ప్రకారం తనకున్న ప్రత్యేక అధికారాలను ఉపయోగించుకొన్న రాష్ట్రపతి ముర్ము.. ఈ మేరకు సుప్రీంకోర్టును వివరణ కోరారు. రాజ్యాంగంలోని 200 అధికరణం కింద బిల్లులకు ఆమోదం తెలపడం, నిలిపి ఉంచడం, రాష్ట్రపతి పరిశీలనకు పంపే ప్రక్రియలో గవర్నర్లకు కొన్ని అధికారాలు ఉంటాయి. అదేసమయంలో ఈ ప్రక్రియకు గడువు కూడా ఏమీ లేదు. అలాగే 201 అధికరణం ప్రకారం రాష్ట్రపతికి కూడా అధికారాలు ఉంటాయి. ఆ అధికరణంలో కూడా గడువు విధించలేదు. ఈ నేపథ్యంలోనే బిల్లుల ఆమోదానికి గవర్నర్, రాష్ట్రపతికి సుప్రీంకోర్టు గడువు విధించడంపై ముర్ము 14 ప్రశ్నలు సంధించారు. ఈ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలని సుప్రీంకోర్టును కోరారు. ఈ అంశంపై స్పందించేందుకు సుప్రీంకోర్టు నూతన సీజేగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ బీఆర్ గవాయ్ త్వరలోనే రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేసే అవకాశం

మిగతా 2వ పేజీలో...

సుప్రీంకోర్టును రాష్ట్రపతి వివరణ కోరడమా?

ఇది సుప్రీంను సవాల్ చేయడమే

బీజేపీయేతర రాష్ట్రాల అసెంబ్లీలను స్తంభింపజేయాలని కేంద్రం యోచనా?

తమిళనాడు సీఎం స్టాలిన్ ధ్వజం

చట్టసభలు ఆమోదించిన బిల్లులపై మీకు అభ్యంతరం ఏమిటి!? 2

కేంద్రాన్ని నిలదీసిన వామపక్షాలు



వారాంతంలో చెట్లు నరకడంలో ఆంతర్యమేంటి?

ముందస్తు ప్రణాళికతోనే చేసినట్లు ఉంది

అధికార్ల చర్యల్ని సమర్థించాలనుకోవద్దు

అడవిని ఎలా పునరుద్ధరిస్తారో చెప్పండి

లేకపోతే, సీఎస్ సహా అధికార్లంతా జైలుకే

కంచ గచ్చిబౌలి భూముల కేసులో మరోసారి సుప్రీంకోర్టు ఆగ్రహం

ఆ భూముల్లో అటవీ పునరుద్ధరణ చర్యలు చేపట్టాం: ప్రభుత్వ న్యాయవాది సింఘ్వీ

తదుపరి విచారణ జూలై 23కు వాయిదా

న్యూఢిల్లీ, మే 15 (ఆంధ్రజ్యోతి): "వీకెండ్ చూసి (వారాంతంలో) చెట్లు నరకడంలో ఆంతర్యమేంటి? డజను బుల్డోజర్లతో 1000 చెట్లను నరికేశారు. దీనిని ముందస్తు ప్రణాళికతోనే చేసినట్లు ప్రాథమికంగా కనిపిస్తోంది. అక్కడ చెట్ల నరికివేతకు పర్యావరణ అనుమతులు తీసుకున్నారా? లేదా? అధికారుల చర్యలను సమర్థించాలని చూడొద్దు" అంటూ కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో తెలంగాణ ప్రభుత్వంపై సర్వోన్నత న్యాయస్థానం మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. హైదరాబాద్ యూనివర్సిటీ పరిసరాల్లో అడవిని

మిగతా 14వ పేజీలో...

14

అటవీ ప్రాంతంగా కంచ గచ్చిబౌలి భూములు

నిర్వహణను అటవీ శాఖకు అప్పగించాలి

వన్యప్రాణి రక్షణ చట్టం కిందకు తేవాలి

నిపుణుల కమిటీని పునర్వ్యవస్థీకరించాలి

సుప్రీంకోర్టుకు సీఈసీ తుది నివేదిక

మాకు కావాల్సిన ఉగ్రవాదుల చిట్టా పాక్ వద్ద ఉంది!

» ఉగ్రవాదంపై పాక్ చర్యలు తీసుకునేదాకా సింధు జలాల ఒప్పందం రద్దే: జైశంకర్ వెల్లడి

న్యూఢిల్లీ, మే 15: 'ఆపరేషన్ సిందూర్' ద్వారా అనుకున్న లక్ష్యాన్ని సాధించామని విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. భారత్‌కు అప్పగించాల్సిన ఉగ్రవాదుల చిట్టా ఇప్పటికే పాకిస్థాన్ వద్ద ఉందన్నారు. ఉగ్రవాదంపై ఆ దేశం చర్యలు తీసుకునేదాకా సింధు జలాల ఒప్పందం రద్దు కొనసాగుతుందని స్పష్టంచేశారు. దేశాల మధ్య లబ్ధి అనేది ద్వైపాక్షిక చర్చలతోనే సాధ్యమని, పాకిస్థాన్‌తో తమకు చర్చలంటూ ఉంటే అది పీవోకేను తిరిగి అప్పగించడంపైనే అని ప్రధాని మోదీ చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. కాల్పుల విరమణ ఒప్పందంపై మాట్లాడుతూ.. ఏ దేశం ఆ చర్యను కోరుకుందో అందరికీ స్పష్టంగా తెలుసునన్నారు.

'టీఆర్ఎఫ్'ను ఉగ్ర సంస్థగా ప్రకటించాలని భారత్ యత్నం

ఆపరేషన్ సిందూర్ తర్వాత లష్కరే తాయిబా అనుబంధ గ్రూపు ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్)ను ప్రపంచ ఉగ్ర సంస్థగా ప్రకటించేలా భారత్ ఐక్యరాజ్యసమితిలో ప్రయత్నాలు చేస్తోంది. ఈ మేరకు భారత బృందం యూఎన్ భద్రతా మండలి ప్యానెల్‌కు టీఆర్ఎఫ్ కార్యకలాపాల గురించి వివరించింది. ఆంక్షల కమిటీ పర్యవేక్షణ బృందంతో పాటు ఐరాస భాగస్వామ్య దేశాలతోనూ చర్చించింది. అలాగే యూఎన్ ఆఫీస్ ఆఫ్ కౌంటర్ టెర్రరిజం, కౌంటర్ టెర్రరిజం కమిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరేట్ ఉన్నతాధికారులతోనూ భారత బృందం భేటీ అయింది.

ధూర్త పాక్ చేతిలో అణ్వాయుధాలు క్షేమం కాదు

» వాటిని ఐఏఈఏ పరిధిలోకి తేవాలి: రాజ్‌నాథ్ సింగ్

శ్రీనగర్, మే 15: పాకిస్థాన్ వంటి బాధ్యతారహితమైన, ధూర్త దేశం చేతిలో అణ్వాయుధాలు ఉండడం సురక్షితం కాదని, వాటిని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ) పరిధిలోకి తెచ్చి, పర్యవేక్షించాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. పాక్‌తో చర్చలంటూ జరిగితే అది ఉగ్రవాదం నిర్మూలన, పాక్ ఆక్రమిత కశ్మీర్ అంశాలపైనే జరుగుతాయని స్పష్టం చేశారు. భారత్ సాయుధ దళాల సాయంతో త్వరలో ఉగ్రవాదాన్ని నిర్మూలిస్తుందన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి గురువారం రాజ్‌నాథ్ జమ్మూ కశ్మీర్ పర్యటనకు వచ్చారు. శ్రీనగర్‌లోని బాదామి బాగ్ కంటోన్మెంట్‌లో సైనికులను కలిసి మాట్లాడారు. వారి ధైర్య సాహసాలను కొనియాడారు. పాకిస్థాన్ అణు బెదిరింపులను ఏమాత్రం లెక్క చేయకుండా ఉగ్ర స్థావరాలపై దాడులు చేశామని, ఇదే భారత్ సంకల్ప బలానికి నిదర్శనమని చెప్పారు.

మన బలగాల ధైర్యసాహసాలు భేష్: ఆర్మీ చీఫ్

శ్రీనగర్/జమ్మూ మే 15: జమ్మూ కశ్మీర్ బారాముల్లా జిల్లాలోని సరిహద్దు ప్రాంతాలను ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది గురువారం సందర్శించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో, పీవోకేలోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేయడంలో ఎల్‌వోసీ వెంబడి అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించిన బలగాలను ప్రశంసించారు. శత్రువుల నుంచి ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని సూచించారు. చినార్ కార్ప్స్‌కు చెందిన డాగర్ విభాగాన్ని ఆర్మీ స్టాఫ్ చీఫ్ (సీవోఏఎస్) సందర్శించారని 'ఎక్స్'లో చేసిన పోస్టులో సైన్యం తెలిపింది. కాగా, ఆపరేషన్ సిందూర్ ద్వారా పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకున్నందుకు సాయుధ దళాలను చూసి దేశం గర్విస్తోందని జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా పేర్కొన్నారు.

మళ్లీ యుద్ధానికి దిగితే జాగ్రత్త!

» మోదీకి పాక్ ప్రధాని హెచ్చరిక.. ఆపై చర్చలకు ఆహ్వానం

» కశ్మీరు, సింధు జలాలపై మాట్లాడుకుందామని వ్యాఖ్య

ఇస్లామాబాద్, మే 15: 'ఆపరేషన్ సిందూర్'లో భారత్ చేతిలో చావు దెబ్బ తిన్నా పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ యుద్ధ నినాదాలు చేస్తూనే ఉన్నారు. ఇండియా మరోసారి తమపై యుద్ధానికే దిగితే సర్వస్వం కోల్పోతుందని హెచ్చరించారు. బుధవారం తమ సియాల్‌కోట్ వైమానిక స్థావరానికి వెళ్లి సిబ్బందితో మాట్లాడారు. తాజా ఆపరేషన్‌లో భారత్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి పాక్‌కు చెందిన 11 ఎయిర్‌బేస్‌లను నేలమట్టం చేసినప్పటికీ.. 1971 నాటి ఓటమికి పగతీర్చుకున్నామని షరీఫ్ అనడం గమనార్హం. మోదీ పేరెత్తుతూ యుద్ధానికి సన్నద్ధంగా ఉన్నామని చెప్పారు. మరోసారి తమపై దాడికి దిగితే అన్నీ కోల్పోతారని బెదిరించారు. అయితే యుద్ధానికి, చర్చలకు కూడా తాము సిద్ధమన్నారు. కశ్మీరు మంటను చల్లార్చుదామని.. అదే సమయంలో సింధు జలాల ఒప్పందంపై చర్చిద్దామని ఆహ్వానించారు. 'ఏది ఎంచుకుంటారో ఇక మీ ఇష్టం. సింధు జలాలపై మమ్మల్ని ఆదేశించే ప్రయత్నాలు చేయొద్దు. అదే మనకు లక్ష్మణ రేఖ. ఆ నీటిని మళ్లించాలన్న యోచనే వద్దు. నెత్తురు, నీరు కలిసి ప్రవహించలేవన్నది వాస్తవం' అని ఆయన పేర్కొన్నారు. కాగా.. సింధు జలాల ఒప్పందాన్ని సస్పెండ్ చేస్తూ భారత్ నిర్ణయం తీసుకున్న మూడు వారాల తర్వాత పాక్ అధికారికంగా స్పందించింది. ఈ అంశంపై చర్చలకు సిద్ధంగా ఉన్నామని ఆ దేశ జలవనరుల కార్యదర్శి సయ్యద్ అలీ ముర్తాజా భారత జలశక్తి కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీకి లేఖ రాశారు.

పాక్‌లో రేడియేషన్ లీక్ అవ్వలేదు: ఐఏఈఏ

న్యూఢిల్లీ, మే 15: పాకిస్థాన్‌లోని అణ్వాయుధ నిల్వల నుంచి ఎలాంటి అణుధార్మికత(రేడియేషన్) లీక్ అవ్వలేదని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ(ఐఏఈఏ) స్పష్టం చేసింది. భారత్ 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా నిర్వహించిన దాడుల్లో పాకిస్థాన్‌లోని కిరానా హిల్స్‌లో ఉన్న స్థావరాలకు నష్టం వాటిల్లినట్లు వస్తున్న వార్తలను ఐఏఈఏ పరోక్షంగా ఖండించింది. తమకున్న సమాచారం మేరకు పాక్‌లోని న్యూక్లియర్ కేంద్రాల వద్ద ఎలాంటి లీకేజీ లేదని పేర్కొంది. అటు భారత వైమానిక అధికారి, ఎయిర్ మార్షల్ ఏకే భారతి కూడా తాము కిరానా హిల్స్‌ను టార్గెట్‌గా చేసుకోలేదని ఇంతకు ముందే ప్రకటించిన విషయం తెలిసిందే..!

కాల్పుల విరమణ కొనసాగింపు

» ఈ నెల 18న మళ్లీ భారత్, పాక్‌ల డీజీఎంవోల భేటీ!

న్యూఢిల్లీ, మే 15: భారత్-పాక్‌ల మధ్య కాల్పుల విరమణను కొనసాగించాలని నిర్ణయించినట్లు భారత మిలటరీ ఆపరేషన్ల డైరెక్టర్ జనరల్ (డీజీఎంవో) వర్గాలు తెలిపాయి. ఈ నెల 10న ఇరు దేశాల డీజీఎంవోల మధ్య హాట్‌లైన్‌లో జరిగిన సమావేశంలో కాల్పుల విరమణకు నిర్ణయించిన విషయం తెలిసిందే..! వీరి మధ్య ఈ నెల 18న మరోమారు సమావేశం జరగనున్నట్లు తెలుస్తోంది. తదుపరి నిర్ణయం వెలువడే వరకు.. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఉంటుందని భారత వర్గాలు తెలిపాయి.

కర్నల్ సోఫియాకు క్షమాపణలు కోరండి

» ఎంపీ మంత్రి విజయ్ షాకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, మే 15: ఆపరేషన్ సిందూర్‌లో కీలకంగా వ్యవహరించిన కర్నల్ సోఫియా ఖురేషీ పట్ల అవమానకర వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షా (బీజేపీ) పట్ల గురువారం సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆమెకు క్షమాపణలు చెప్పాలని ఆదేశించింది. హైకోర్టుకు స్వయంగా వెళ్లి క్షమాపణలు అందజేయాలని సూచించింది. కర్నల్ సోఫియాను 'ఉగ్రవాదుల సోదరి' అని మంత్రి అభివర్ణించడంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయ్ షాపై మధ్యప్రదేశ్‌లో క్రిమినల్ కేసు నమోదు కాగా, దానిపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. అరెస్టు చేయకుండా అడ్డుకోవాలని కోరుతూ సుప్రీంకోర్టులో అప్పీలు చేయగా 'ఒక్క రోజులో ఏమీ జరిగిపోదు, మీరెవరో మీకు తెలుసు' అని సీజేఐ వ్యాఖ్యానించారు.

ఆ వ్యాఖ్యలు నా వ్యక్తిగతం: శశిథరూర్

న్యూఢిల్లీ, మే 15: ఆపరేషన్ సిందూర్ సమయంలో తాను చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగతమని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ స్పష్టం చేశారు. పార్టీ నేతలు లక్ష్మణరేఖను దాటారని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ వ్యాఖ్యానించిన నేపథ్యంలో శశిథరూర్ స్పందించారు. తాను పార్టీకి అధికార ప్రతినిధిని కాదని, అదే సమయంలో ప్రభుత్వ ప్రతినిధిని కూడా కాదన్నారు. తాను ఓ భారతీయుడిలా మాత్రమే స్పందించానని ఆయన పేర్కొన్నారు.

22కోట్ల ఏళ్ల నాటి రాక్షసబల్లి అవశేషాలు

» ప్రాణహిత-గోదావరి లోయలో గుర్తింపు

» అన్నారం వద్ద 1980లలోనే అవశేషాల సేకరణ

» అప్పటి నుంచి కొనసాగిన పరిశోధనలు

» తాజాగా ఆ డైనోసార్ వయసు నిర్ధారణ

» రాక్షసబల్లికి 'మలేరీరాపర్ట్ కుట్టీ' అని నామకరణ



న్యూఢిల్లీ, మే 15: మంచు యుగం.. రాతి యుగం నాటి చరిత్రకు సంబంధించిన ఆనవాళ్లు లభ్యమైన తెలంగాణ ఇప్పుడు మరో ప్రాచీన యుగానికి నిలయమని తేలింది. అంటే.. 26 లక్షల సంవత్సరాల క్రితం నాటి మంచు యుగాని కంటే ముందే.. ట్రయాసిక్ యుగంలోని తొలి భాగం(జురాసిక్ యుగం– 20-25 కోట్ల సంవత్సరాల క్రితం)లోనూ తెలంగాణ చరిత్రకు సంబంధించిన ఆధారాలు నిర్ధారణ అయ్యాయి. 1980లలో జయశంకర్-భూపాలపల్లి జిల్లాలో.. ప్రాణహిత-గోదావరి లోయలోని అన్నారం అనే గ్రామానికి దక్షిణాన కిలోమీటరు దూరంలో శాస్త్రవేత్తలు ఓ రాక్షసబల్లి(డైనోసార్) అవశేషాలను గుర్తించారు. అప్పటి నుంచి కొనసాగిన పరిశోధనలు తాజాగా పూర్తయ్యాయి. ఈ పరిశోధనల్లో ఆ రాక్షసబల్లి వయసు 22.9-23.3 కోట్ల సంవత్సరాల మధ్య ఉంటుందని నిర్ధారణ అయ్యింది. ఆ అవశేషాలు ట్రయాసిక్ యుగంలో జీవించిన హరేరాసారియా వర్గానికి చెందినది శాస్త్రవేత్తలు తేల్చారు. ఇది మాంసాహార డైనోసార్. దక్షిణ అమెరికా వెలుపల ఈ జాతి రాక్షస బల్లిని కనుక్కోవడం ఇదే మొదటి సారి. ఈ డైనోసార్‌కు శాస్త్రవేత్తలు 'మలేరీరాప్టర్ కుట్టీ' అని పేరు పెట్టారు. ప్రాణహిత-గోదావరి లోయల్లోని మలేరీ ఘాట్ల వద్ద ఈ డైనోసార్ అవశేషాలు లభించడంతో ఆ ప్రాంతం పేరును.. తొలిసారి దీన్ని కనుగొన్న శాస్త్రవేత్త తారావత్ కుట్టీ పేరును కలిపి.. దీనికి 'మలేరి రాప్టర్ కుట్టీ' అని నామకరణం చేశారు. రాతి యుగానికి ముందు మంచు యుగం.. అంతకు ముందు ఉష్ణయుగం ఉన్నట్లు చరిత్రకారులు చెబుతుంటారు. ట్రయాసిక్ యుగంలోనూ వేడి ఎక్కువగా ఉండేదని చెబుతారు. అప్పటి వాతావరణ మార్పులకు అనుగుణంగా డైనోసార్లు ఎలా అభివృద్ధి చెందాయనే పరిశోధనలు ఇంకా సాగుతున్నాయి. తెలంగాణలో లభించిన డైనోసార్ అవశేషాలతో.. ఈ పరిశోధనల్లో మరింత వేగం పుంజుకోనున్నట్లు తెలుస్తోంది.

రాష్ట్రపతికి సుప్రీంకోర్టు గడువు

విధించడమా?

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నట్లు సమాచారం.



రాష్ట్రపతి సుప్రీంకోర్టును అడిగిన ప్రశ్నలివే..

1. గవర్నర్ వద్దకు బిల్లులు వచ్చినప్పుడు ఆర్టికల్ 200 కింద ఆయనకు ఉండే రాజ్యాంగపరమైన అవకాశాలు ఏంటి?
2. ఆ అవకాశాల విషయంలో మంత్రివర్గం సలహాలకు గవర్నర్ కట్టుబడి ఉండాలా?
3. ఆర్టికల్ 200 కింద గవర్నర్ విచక్షణ మేరకు తీసుకునే నిర్ణయంపై న్యాయ సమీక్ష చేయొచ్చా?
4. ఆర్టికల్ 200 కింద గవర్నర్ తీసుకునే నిర్ణయాలపై న్యాయ పరిశీలన చేయకుండా ఆర్టికల్ 361 ప్రకారం పూర్తిగా నిషేధించవచ్చా?
5. ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్లకు అధికారాలు ఉండగా.. రాజ్యాంగపరంగా ఎలాంటి గడువూ విధించకపోయినా.. బిల్లుల ఆమోద ప్రక్రియలో వారికి కోర్టులు గడువులు విధించవచ్చా? ఏ ప్రక్రియను అనుసరించాలనే విషయాన్ని సూచించవచ్చా?
6. ఆర్టికల్ 201 కింద రాష్ట్రపతి విచక్షణాధికారాలపై న్యాయ సమీక్ష చేయొచ్చా?
7. రాష్ట్రపతికి కోర్టులు గడువు విధించవచ్చా? ఆర్టికల్ 201 ప్రకారం విచక్షణాధికారాల వినియోగానికి సంబంధించిన ప్రక్రియను సూచించవచ్చా?
8. గవర్నర్ రిజర్వ్ చేసిన బిల్లులపై నిర్ణయం తీసుకునే విషయంలో రాష్ట్రపతి తప్పనిసరిగా ఆర్టికల్ 143 ప్రకారం సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని తీసుకోవాలా?
9. అధికారికంగా చట్టం అమల్లోకి రాకముందు.. ఆర్టికల్ 200, 201 కింద గవర్నర్, రాష్ట్రపతి తీసుకునే నిర్ణయాలు న్యాయబద్ధమేనా?
10. ఆర్టికల్ 142 ద్వారా రాష్ట్రపతి లేదా గవర్నర్‌కు సంక్రమించిన రాజ్యాంగపరమైన అధికారాలను మార్చడం లేదా నిరాకరించడం న్యాయ వ్యవస్థకు సాధ్యమా?
11. ఆర్టికల్ 200 కింద గవర్నర్ ఆమోదం లేకుండానే రాష్ట్రంలో చట్టం అమల్లోకి వస్తుందా?
12. రాజ్యాంగ వివరణకు సంబంధించిన అంశాలున్న కేసుల్లో తీర్పులు ఇచ్చే ముందు ఆర్టికల్ 145(3) కింద కనీసం ఐదుగురు సభ్యులున్న విస్తృత ధర్మాసనానికి సిఫారసు చేయాల్సిన బాధ్యత సుప్రీం ధర్మాసనానికి ఉండదా?
13. ఆర్టికల్ 142 కింద విధానపరమైన అంశాల్లో చట్టపరమైన, రాజ్యాంగపరమైన నిబంధనలకు విరుద్ధంగా ఆదేశాలు ఇచ్చే అధికారం సుప్రీంకోర్టుకు ఉందా?
14. కేంద్రం, రాష్ట్రాల మధ్య వివాదాలు తలెత్తినప్పుడు ఆర్టికల్ 131 పరిధిలో కాకుండా, వాటిని పరిష్కరించే అధికారాన్ని రాజ్యాంగం సుప్రీంకోర్టుకు కల్పించిందా?

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఇదే..

తమిళనాడు శాసనసభ ఆమోదించిన 10 బిల్లులను ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవి ఆమోదించకుండా తన వద్దే ఉంచుకోవడం సరికాదని ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. దీనికి సంబంధించి 415 పేజీల తీర్పు వెలువరించింది. రాష్ట్రాలు పంపే బిల్లులను రాష్ట్రపతి/గవర్నర్ గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని నిర్దేశించింది. బిల్లులను వెనక్కి పంపితే అందుకు గల కారణాలనూ తెలపాలని స్పష్టం చేసింది. ఈ తీర్పు తర్వాత కూడా గవర్నర్లు బిల్లులపై జాప్యం చేస్తుంటే సర్వోన్నత న్యాయస్థానాన్ని నేరుగా ఆశ్రయించవచ్చని, గవర్నర్ల నిష్క్రియాపరత్వం న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని తేల్చిచెప్పింది. రాజ్యాంగంలోని 142వ అధికరణం ద్వారా అటువంటి సంపూర్ణ అధికారం సుప్రీంకోర్టుకు ఉందని తెలిపింది.

లోకం తీరు



సుప్రీంకోర్టును రాష్ట్రపతి వివరణ కోరడమా?: స్టాలిన్

చెన్నై, మే 15 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ఆమోదించిన బిల్లులను ఆమోదించకుండా తమిళనాడు గవర్నర్ ఏళ్లతరబడి పెండింగ్‌లో ఉంచడాన్ని తప్పుబడుతూ తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టును రాష్ట్రపతి ద్వారా కేంద్రం వివరణ కోరటంపై తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం తీసుకున్న ఈ చర్య ద్వారా రాష్ట్ర గవర్నర్ బీజేపీ ప్రోద్బలంతోనే ప్రజాస్వామయుతంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కించపరిచేలా వ్యూహరించినట్టు సుస్పష్టమవుతోందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇది రాజ్యాంగానికి వ్యతిరేకంగా వెలువడే చర్యలను తనకున్న విచక్షణాధికారం ద్వారా అడ్డుకునే సమర్థత కలిగిన సర్వోన్నత న్యాయస్థానానికి ప్రత్యక్ష సవాలు విసరటమే తప్ప మరొకటి కాదన్నారు. 'బిల్లుల ఆమోదంలో నిరవధిక జాప్యాన్ని అనుమతించడం ద్వారా గవర్నర్ ఆటంకాలను కేంద్రప్రభుత్వం చట్టబద్ధం చేయాలనుకుంటోం దా? బీజేపీయేతర రాష్ట్రాల శాసనసభలను స్తంభింపజేయాలని అనుకుంటోందా?' అని ఆయన ప్రశ్నించారు.

మీకు అభ్యంతరం ఏమిటి!?: లెఫ్ట్

న్యూఢిల్లీ, మే 15: బిల్లుల ఆమోదానికి గవర్నర్లకు డెడ్‌లైన్ విధిస్తూ ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై రాష్ట్రపతి ద్వారా వివరణ కోరే మార్గాన్ని కేంద్ర ప్రభుత్వం ఎంచుకోవడాన్ని వామపక్షాలు తప్పుబట్టాయి. ఈ చర్యను తమ పార్టీ ఖండిస్తోందని సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ స్పష్టం చేశారు. ఇదే అంశంపై తమిళనాడు సీఎం స్టాలిన్ పోస్టును ప్రస్తావిస్తూ ఆయన ఎక్స్‌లో స్పందించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన చట్టసభలు రెండు సార్లు ఆమోదించి పంపిన చట్టాలను ఆమోదించడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వచ్చిన అభ్యంతరం ఏమిటని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా నిలదీశారు.

భారత్ సూపర్ ఆఫర్!

» అమెరికా సరుకులపై సుంకాలు ఎత్తేస్తానని ముందుకొచ్చింది

» ట్రంప్ మరో సంచలన ప్రకటన



దోహా, మే 15: అమెరికాకు చెందిన సరుకులపై అన్ని రకాల సుంకాలను ఉపసంహరించుకోవటానికి సిద్ధంగా ఉన్నట్లు భారత్ తమకు తెలిపిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో బాంబు పేల్చారు. ఖతార్ పర్యటనలో ఉన్న ట్రంప్ ఆ దేశ రాజధాని దోహాలో గురువారం జరిగిన ఓ వాణిజ్య సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ సంచలన ప్రకటన చేశారు. ఎటువంటి సుంకాలు లేని ఒప్పందానికి సిద్ధంగా ఉన్నట్లు భారత్ నుంచి ప్రతిపాదన వచ్చిందన్నారు. ట్రంప్ ప్రకటనపై భారత విదేశాంగమంత్రి జైశంకర్ స్పందిస్తూ.. 'భారత్ అమెరికా మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయి. అవి సంక్లిష్టమైనవి. అన్నింటిపైనా స్పష్టత వచ్చే వరకూ నిర్ణయం తీసుకోవటం అంటూ ఉండదు. ఏ వాణిజ్య ఒప్పందమైనా ఇరుదేశాలకు లబ్ధి చేకూర్చాలి. దీనిపై ముందే తీర్పులు ప్రకటించేయటం అపరిపక్వత అవుతుంది' అని పేర్కొన్నారు. కాగా, భారత్ సుంకాలు వేయబోనని చెప్పిందన్న ట్రంప్ ప్రకటనపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్‌లో పలు ప్రశ్నలు సంధించారు. 'కేంద్ర వాణిజ్యమంత్రి ప్రస్తుతం అమెరికాలో ఉన్నారు. ట్రంపేమో దోహా నుంచి మరో భారీ ప్రకటన చేశారు. ప్రధాన మంత్రి ఈ వ్యవహారంపై ఏమీ మాట్లాడటం లేదు. ఇంతకూ ఆయన (మోదీ) దేనికి అంగీకరించారు? ఆపరేషన్ సిందూర్ నిలిపివేతకు ట్రంప్ ప్రకటనకు మధ్య ఏమైనా సంబంధం ఉందా?' అని పేర్కొన్నారు. మరోవైపు, అమెరికాతో వాణిజ్య ఒప్పందం ఖరారు కోసం చర్చలు జరిపేందుకు కేంద్ర వాణిజ్యమంత్రి పీయూష్ గోయల్ ప్రస్తుతం అమెరికాలో ఉన్నారు. భారత ఉత్పత్తుల మీద ట్రంప్ ఇటీవల 26% సుంకం విధించి, ఆ తర్వాత 90 రోజుల తాత్కాలిక మినహాయింపు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ గడువు ముగియకముందే ఇరుదేశాల వాణిజ్య ఒప్పందాన్ని ఒక కొలిక్కి తీసుకురావాలని భారత్ ప్రయత్నిస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

అమెరికాలో ఐఫోన్ ప్లాంట్లను పెట్టండి

దోహా వాణిజ్య సదస్సులో ట్రంప్ మరో వివాదాస్పద ప్రకటన చేశారు. చైనా నుంచి భారత్‌కు ఐఫోన్ ప్లాంట్లను భారీ ఎత్తున తరలిస్తున్న ఆపిల్ కంపెనీకి ఆ పని చేయవద్దని ట్రంప్ సూచించారు. ఆపిల్ సీఈఓ టిమ్‌కుక్‌తో అంతకుముందు రోజు జరిగిన సంభాషణ వివరాలను ఈ మేరకు వెల్లడించారు. భారత్‌లో నిర్మించేబదులు అమెరికాలో ఐఫోన్ తయారీ ప్లాంట్లను నిర్మించాలని టిమ్‌కు సూచించానని, భారత్ తన అవసరాలు తాను చూసుకోగలదని చెప్పానన్నారు. ఇక మీదట అమెరికాలో యాపిల్ కంపెనీల్లో ఉత్పత్తి పెరగనుందన్నారు. అయితే, భారత్‌లో పెట్టుబడులకు సంబంధించి తమ ప్రణాళికలపై ట్రంప్ ప్రకటన ప్రభావం ఉండబోదని యాపిల్ కంపెనీ ఉన్నతాధికారులు స్పష్టం చేసినట్లు కేంద్రప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. కాగా, భారత్-పాక్‌ల మధ్య యుద్ధాన్ని తానే ఆపినట్లుగా పలుమార్లు చెప్పుకున్న ట్రంప్ తాజాగా కాస్త తగ్గారు. ఇరుదేశాల సమస్యను తానే మొత్తంగా పరిష్కరించకపోయినా, పరిష్కరించేందుకు సాయపడ్డానని తెలిపారు.

తుర్కియే సంస్థ 'సెలెబి'పై వేటు..

» విమానాశ్రయాల్లో భద్రతా సేవల అనుమతుల రద్దు

» జాతీయ భద్రత దృష్ట్యా తక్షణమే అమల్లోకి..: బీసీఏఎస్

న్యూఢిల్లీ, మే 15: శత్రు దేశం పాకిస్థాన్‌కు వెన్నుదన్నుగా నిలుస్తున్న తుర్కియేపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో.. కేంద్రం కూడా చర్యలకు ఉపక్రమించింది. దేశంలోని ప్రధాన విమానాశ్రయాల్లో భద్రతాపరమైన సేవలను అందిస్తున్న తుర్కియేకు చెందిన సెలెబి ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ ఇండియాపై వేటు వేసింది. ఆ సంస్థ సెక్యూరిటీ క్లియరెన్స్ (భద్రతా అనుమతుల)ను రద్దు చేస్తున్నట్లు బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) గురువారం ప్రకటించింది. జాతీయ భద్రత దృష్ట్యా తక్షణమే ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని పేర్కొంది. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, కొచ్చి, అహ్మదాబాద్, గోవా, కన్నూర్ విమానాశ్రయాల్లో ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ ఇండియా గ్రౌండ్ హ్యాండ్లింగ్ సేవలను అందిస్తోంది. ఇక తుర్కియేతో పాటు పాక్‌కు మద్దతుగా అజర్‌బైజాన్‌లతో పర్యాటకం, వాణిజ్యం సహా వివిధ రంగాల్లో సంబంధాలను తెగదెంపులు చేసుకోవాలని కేంద్రం యోచిస్తోంది. రాబోయే రోజుల్లో ఆ రెండు దేశాలకు వెళ్లే వారి సంఖ్య, అక్కడ సినిమాల చిత్రీకరణలు గణనీయంగా తగ్గిపోవచ్చంటూ అధికార వర్గాలు చెబుతున్నాయి. 'భారత్ నుంచి యేటా లక్షలాది మంది ఆ రెండు దేశాలను సందర్శిస్తున్నారు. డెస్టినేషన్ వెడ్డింగ్‌లు, సినిమా చిత్రీకరణలకు కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఆ దేశాలకు భారీగా ఆదాయం సమకూరుతోంది. రాబోయే రోజుల్లో ఆ దేశాల పర్యటనలకు ప్రభుత్వం సహకరించకపోవచ్చు.. సినిమా షూటింగ్‌లు తదితరాలకు మద్దతు ఉండకపోవచ్చు' అంటూ సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే తుర్కియే, అజర్‌బైజాన్ ఉత్పత్తులు, ఆ దేశాల పర్యటనలను బహిష్కరించాలంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు వెల్లువెత్తుతున్నాయి.

విదేశీ లాయర్లపై కఠిన ఆంక్షలు

» వస్తున్నట్టు ముందుగా బార్ కౌన్సిల్‌కు చెప్పాలి

» కక్షిదారు వివరాలివ్వాలి.. కొత్త నిబంధనలు జారీ

న్యూఢిల్లీ, మే 15: భారత్‌లోని కక్షిదారుల తరఫున వాదనలు వినిపించేందుకు వచ్చే విదేశీ న్యాయవాదుల విషయంలో కఠిన నిబంధనలు జారీ అయ్యాయి. గతంలో విదేశీ లాయర్లు వచ్చి వాదనలు వినిపించేందుకు 'ఫ్లై ఇన్.. ఫ్లై అవుట్' విధానం అమలయ్యేది. వారు వచ్చి కేవలం వాదనలు వినిపించి వెళ్లిపోయేవారు. 2023లో తీసుకొచ్చిన నిబంధనల ప్రకారం విదేశీ, అంతర్జాతీయ చట్టాలకు సంబంధించిన కేసులు, కార్పొరేట్ చట్టం కేసులు వాదించేందుకు కార్యాలయాలు తెరవవచ్చు. ప్రస్తుతం కార్యాలయాలు తెరవకుండా కేవలం వాదనలు వినిపించేందుకు వచ్చే విదేశీ లాయర్లకు కొన్ని పరిమితులు పెడుతూ తాజాగా నిబంధనలు విడుదలయ్యాయి. దీని ప్రకారం వాదనలు నిమిత్తం భారత్ వచ్చే లాయర్లు ఆ విషయాన్ని ముందుగా బార్ కౌన్సిల్‌కు తెలియజేయాలి. క్లయింట్ సమాచారం, కాంటాక్టు వివరాలు ఇవ్వాలి. ఈ సమాచారంతో డిక్లరేషన్ అందజేయాలి. 12 నెలల్లో 60 రోజులకు మించి భారత్‌లో ఉండడానికి వీల్లేదు. అందువల్ల చేసే పని, ఎంత కాలం ఉండదలచుకున్నారనే విషయాలను ముందుగానే వెల్లడించాలి. దీనిని కొందరు న్యాయవాదులు వ్యతిరేకిస్తున్నారు. సరళీకరణ పేరుతో మరిన్ని ఆంక్షలు పెట్టారని వ్యాఖ్యానిస్తున్నారు. విదేశీ స్టాక్ లిస్టింగ్ కేసులు ఎక్కువ సమ యం తీసుకుంటాయని, అలాంటప్పుడు 60 రోజుల వ్యవధి సరిపోదని అంటున్నారు. తప్పనిసరిగా కార్యాలయాలు ప్రారంభించాలనడం, బార్ కౌన్సిల్‌కు సమాచారం ఇవ్వాలనడం సరికాదని చెబుతున్నారు. కార్యాలయాలు ఏర్పాటు చేయకుండానే వాదనలు వినిపించేందుకు అవకాశం ఇవ్వడం వల్ల ఎక్కువ మంది విదేశీ లాయర్లు వచ్చే అవకాశం ఉందని ఇంకొందరు భావిస్తున్నారు. స్థానికులకు నష్టం జరుగుతుందన్న కారణంతో విదేశీ లాయర్ల రాకను మొదటి నుంచీ బార్ కౌన్సిల్ వ్యతిరేకిస్తోంది.

2035 నాటికి కొత్తగా వచ్చే కార్లన్నీ డ్రైవర్ లెస్సే!

» టెస్లా ఏఐ సాఫ్ట్‌వేర్ విభాగం వైస్ ప్రెసిడెంట్ అశోక్ ఎల్లుస్వామి

న్యూఢిల్లీ, మే 15: 2035 నాటికి డ్రైవర్ లెస్ కార్లు మాత్రమే తయారవుతాయని ఎలక్ట్రిక్ కార్ల సంస్థ టెస్లాలో ఏఐ సాఫ్ట్‌వేర్ విభాగం వైస్ ప్రెసిడెంట్‌గా పని చేస్తున్న అశోక్ ఎల్లుస్వామి అన్నారు. డ్రైవర్ రహిత కార్లదే భవిష్యత్తు అని పేర్కొన్నారు. భారత సంతతికి చెందిన అశోక్ ఎల్లుస్వామి ఓ పాడ్‌కాస్ట్‌లో ఈ మేరకు మాట్లాడారు. "2035 నాటికి అన్నీ సెల్ఫ్ డ్రైవింగ్ కార్లే తయారవుతాయి. భవిష్యత్తులో ఎవరైనా సరదాగా కారు నడపుదామని అనుకుంటే పాత మోడల్ కారు కొనుగోలు చేయాల్సిందే. డ్రైవర్ లెస్ కార్లదే భవిష్యత్తు" అని అన్నారు. అలాగే, అమెరికాలోని కొన్ని నగరాల్లో డ్రైవర్ లెస్ కార్లను అందుబాటులోకి తీసుకురావాలని టెస్లా ప్రయత్నాలు చేస్తోందని అశోక్ ఎల్లుస్వామి వెల్లడించారు.

సముద్రపు నీటి డీశాలినేషన్‌లో ముందడుగు

» స్వదేశీ సాంకేతికతను అభివృద్ధి చేసిన డీఆర్‌డీవో

» ఐసీజీ నౌకలోని ప్లాంట్‌లో విజయవంతంగా పరీక్ష

న్యూఢిల్లీ/అల్వాల్, మే 15 (ఆంధ్రజ్యోతి): సముద్రపు నీటిని మంచినీటిగా మార్చే ప్రక్రియను అభివృద్ధి చేయడంలో డీఆర్‌డీవో కీలక విజయం సాధించింది. అధిక పీడనం కలిగిన సముద్రపు నీటి డీశాలినేషన్ కోసం స్వదేశీ నానోపోరస్ మల్టీలేయర్డ్ పాలిమెరిక్ మెంబ్రేన్‌ను అభివృద్ధి చేసింది. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా భారత తీర రక్షక దళం(ఐసీజీ) అవసరాల కోసం కాన్పూర్‌లోని డీఆర్‌డీవో ల్యాబ్ అయిన డిఫెన్స్ మెటీరియల్స్ స్టోర్స్ అండ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ (డీఎంఎస్ఆర్‌డీఈ)లో ఈ సాంకేతికతను రికార్డు స్థాయిలో 8నెలల్లో అభివృద్ధి చేసినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఐసీజీకి చెందిన ఆఫ్‌షోర్ పెట్రోలింగ్ నౌకలోని డీశాలినేషన్ ప్లాంట్‌లో డీఎంఎస్ఆర్‌డీఈ నిర్వహించిన ప్రారంభ సాంకేతిక పరీక్షలు విజయవంతమైనట్లు పేర్కొంది. ఇప్పటి వరకూ జరిపిన పరీక్షలు సంతృప్తికరమైన ఫలితాలను ఇచ్చాయి. 500గంటల పాటు పరీక్షించిన తర్వాత దీనికి ఐసీజీ తుది ఆమోదం జారీ చేయనుంది. స్వల్ప మార్పుల అనంతరం తీర ప్రాంతాల్లో సముద్రపు నీటి డీశాలినేషన్ ప్రక్రియకు ఈ సాంకేతికత దోహదం చేస్తుందని భావిస్తున్నారు.

హాంకాంగ్, సింగపూర్‌లో కొవిడ్ అలజడి..!

» ఆసియా అంతటా పెరుగుతున్న కరోనా కేసులు

న్యూఢిల్లీ, మే 15: ఐదేళ్ల క్రితం యావత్ ప్రపంచాన్ని గడగడలాడించిన కొవిడ్-19 ఆసియాలో మళ్లీ అలజడి రేపుతోంది. జనసాంద్రత ఎక్కువగా ఉండే హాంకాంగ్, సింగపూర్‌లలో కొవిడ్ కేసులు పెరుగుతున్నాయని ఆరోగ్యశాఖ అధికారులు హెచ్చరించారు. ముఖ్యంగా హాంకాంగ్‌లో ఈ వారంలో కరోనా వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉందని స్థానిక ఆరోగ్యశాఖ అధికారి ఒకరు వెల్లడించారు. ఈ నెల 3 నుంచి ఇక్కడ కొవిడ్ పాజిటివ్ కేసుల తీవ్రత పెరిగిందని, అలాగే కొన్ని మరణాలు కూడా నమోదయ్యాయని ఆయన పేర్కొన్నారు. మరోవైపు సింగపూర్‌లో కూడా కొవిడ్ అలజడి కనిపిస్తోంది. ఈ నెల 3వ తేదీ తర్వాత ఏడు రోజుల్లోనే కేసుల సంఖ్య దాదాపు 28 శాతం పెరిగిందని స్థానిక ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు జైషే ఉగ్రవాదుల హతం

శ్రీనగర్/ ట్రాల్, మే 15: జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నిషేధిత జైషే మహ్మద్ సంస్థకు చెందిన ముగ్గురు కరుడుగట్టిన ఉగ్రవాదులు హతమయ్యారని పోలీసులు తెలిపారు. పుల్వామా జిల్లా అవంతిపొరాలోని ట్రాల్ పట్టణానికి సమీపంలోని నాదిర్ గ్రామంలో ఉగ్రవాదులున్నారని నిఘా వర్గాలకు ఉప్పందింది. దీంతో ఉగ్రవాదులు దాక్కున్న ఆ గ్రామాన్ని భద్రతాదళాలు చుట్టుముట్టి గాలింపు చేపట్టాయి. నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో దాక్కున్న ఉగ్రవాదులు భద్రతాబలగాలను చూసిన ఉగ్రవాదులు కాల్పులకు దిగినట్లు డ్రోన్ చిత్రీకరించిన వీడియోలో కనిపిస్తోంది. దీంతో భద్రతాదళాలు ఆత్మరక్షణార్థం జరిపిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు మరణించారు. వారిని జైషే మహ్మద్ సంస్థ ఉగ్రవాదులు ఆసిఫ్ అహ్మద్ షేక్, అమీర్ నజీర్ వనీ, యవార్ అహ్మద్ భట్‌గా గుర్తించిన భద్రతా దళాలు.. ఆ ముగ్గురూ పుల్వామా జిల్లా వాసులేనని తెలిపాయి.

PennState University

MBU MOHAN BABU UNIVERSITY

DREAM. BELIEVE. ACHIEVE

Mohan Babu University, India
Penn State University, USA

Comes Together to Offer
India's First Joint Degree Programs with a QS Top 100 Global University.



PLACEMENT HIGHLIGHTS

110+ Multinational Corporations visited in 2023-24 with **1800+** offers

20% Growth in highest package with the highest being **60 Lakhs**

Students got offers from Google at a package of **60 Lakhs** & a package of **44 Lakhs** from amazon & YugaByte

45% students placed in MNCs with a package above **6 Lakhs**

RANKINGS AND ACCREDITATIONS*

- nirf 2024 – Ranked 201-300 Band
- nirf-Innovation – Ranked 51-100 Band 2023
- NAAC A+
- QS I-GAUGE
- NBA Accredited Programs
- AICTE-CII Survey Platinum Category
- SII GREEN RANKINGS 2023 – Listed in Top 20 Universities of India
- DIAMOND BAND – MHW RANKINGS 2023
- Institution's Innovation Council – RANKED 3.5 STAR

PENN STATE RANKINGS#

QS World University Rankings – Ranked 89
- 10th in Mineral and Mining Engineering
- 14th in Sports-Related Subjects
- 23rd in Hospitality and Leisure Management
- 31st in Education
- 43rd in Mechanical, Aeronautical, and Manufacturing Engineering

Times Higher Education – Ranked 100

Admissions Open 2025-26

B.Tech. 2+2 Yrs.
2 years at MBU + 2 years at Penn State

B.Tech.+MS 4+1 Yrs.
4 years at MBU + 1 year Master's at Penn State

MBA/MCA + MS 1+1 Yrs.
1 year at MBU + 1 year at Penn State

For admissions 946 9465 946 or visit www.mbu.asia Tirupati, India admissions@mbu.asia

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అగ్నిశ్వాసలు

నైరుతి ఋతుపవనాలు ముందుగానే వచ్చేస్తున్నాయని భారత వాతావరణ శాఖ ప్రకటించింది. వర్షాగమనం ఆనందప్రదమే, గ్రీష్మతాపం నుంచి ఉపశమనం ఉల్లాసకరమే అయినా ప్రకృతి నుంచి ఎదురవుతున్న ఒక ఉపద్రవాన్ని ఉపేక్షించకూడదు. విషమిస్తున్న వేడిగాడ్పులే ఆ ముప్పు. నిజానికి ఈ ఏడాది ఋతుపవనాలే కాదు, వేసవి సైతం ముందుగానే ప్రవేశించింది. ఇది ప్రస్తుత సంవత్సరంలోనే కాదు, సుదీర్ఘకాలం ఏటా పునరావృతమయ్యే పరిణామమని వాతావరణ నిపుణులు చెప్పుతున్నారు. 'న్యాయ ధర్మములు బీడులు కాగా/ ఎండాకాలం ఎగసి మండినది' అని వాతావరణ మార్పు ప్రభావాలపై ప్రపంచం దృష్టిపెట్టని కాలంలోనే తెలుగు కవి ఒకరు ఆక్రోశిస్తే ఉగ్రమవుతున్న ఉష్ణోగ్రతలు ప్రజల డీఎన్ఏలో రసాయనిక మార్పులకు కారణమై అకాల వృద్ధాప్యానికి దారితీయవచ్చని అమెరికన్ శాస్త్రవేత్తలు ఇటీవల హెచ్చరించారు. కవి హృదయం, వైజ్ఞానిక మేధ మనిషి శ్రేయస్సుకు ఆరాటపడ్డాయి, సమస్త లోకులకు జీవనానందాన్ని ఆకాంక్షించాయి. మరి ప్రజల నుంచి అధికారాన్ని పొందిన పెద్ద మనుషులు 'పగళ్లన్నీ పగిలిపోయీ, నిశీథాలూ విశీర్ణిల్లు'తున్న వేసవిరోజుల్లో సామాన్యుల, శ్రామికుల ఆరోగ్యాలను, జీవనాధారాలను కాపాడేందుకు చిత్తశుద్ధితో శ్రద్ధ చూపుతున్నారా?

పనిప్రదేశాల్లో తీవ్ర వేడిగాడ్పులకు గురవుతున్న వారిలో దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలవారు అత్యధిక శాతంలో ఉంటున్నట్టు పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నివేదికలు వెల్లడిస్తున్నాయి. కాయకష్టంతో జీవనోపాధి పొందేవారు ప్రధానంగా ఈ సామాజిక వర్గాలవారే. వ్యవసాయం, నిర్మాణ రంగం జీవనాధారాలుగా ఉన్న ఈ సామాజికులు పని ప్రదేశాలలోనే కాకుండా అధ్వాన్న గృహవసతుల కారణంగా కూడా 'ఉష్ణ అన్యాయం' (థర్మల్ ఇన్జస్టిస్)కు గురవుతున్నారు. అనారోగ్యం బారిన పడి ఆదాయాన్ని, జీవన భద్రతను కోల్పోతున్నారు. ప్రపంచ శ్రామిక జనావళి (240 కోట్లు)లో 70 శాతం మంది తీవ్ర వేడిగాడ్పుల మూలంగా ఆరోగ్య, ఆర్థిక సమస్యలకు లోనవుతున్నారని ఐక్యరాజ్యసమితి నిర్ధారించింది. వేడి గాడ్పుల వైపరీత్యాలలో జెండర్ కోణాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవలసి ఉంది. అమెరికా, భారత్, నైజీరియాలలోని కార్మిక జనాభాపై వేడిగాడ్పుల ప్రభావానికి సంబంధించి నిర్వహించిన ఒక అధ్యయనంలో ఈ దేశాలలో ఏటా రెండు లక్షల మందికి పైగా మహిళలు మరణిస్తున్నట్టు వెల్లడయింది. మన దేశంలో వడదెబ్బ మరణాల సంఖ్యను ప్రభుత్వం కచ్చితంగా నమోదు చేయడం లేదు. గత వేసవిలో 17 రాష్ట్రాలలో 733 మంది చండ్రగాడ్పుల మూలంగా చనిపోయినట్టు 'హీట్ వాచ్' నివేదిక పేర్కొనగా, ప్రభుత్వ గణాంకాలు అంతకంటే తక్కువగా ఉన్నాయి. తీవ్ర వేడిగాలుల ప్రభావం గర్భిణీ స్త్రీలపైన, నవజాత శిశువులపైన తీవ్రంగా ఉంటోంది. మన దేశంలో వేడిగాడ్పుల ప్రభావిత అనారోగ్యాలతో మరణించేవారి సంఖ్య 2050 సంవత్సరం నాటికి వేల సంఖ్యలో పెరిగిపోతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వేడిగాడ్పులతో అసంఘటిత రంగంలోని శ్రామిక జనావళి ఆరోగ్యం, జీవనాధారాలకు ఏర్పడుతున్న ముప్పు కారణంగా భారత్ స్థూల దేశీయోత్పత్తికి 4.5 శాతం మేరకు నష్టం వాటిల్లవచ్చని గత ఏడాది రిజర్వ్‌బ్యాంక్ అంచనా వేసింది.

పట్టణ నగర ప్రాంతాలలో ప్రాణాంతక వేడిగాడ్పుల నెదుర్కొనేందుకు పలు నగరాలలో హీట్ యాక్షన్ ప్లాన్‌లను అమలుపరుస్తున్నారు. అయితే అవి లోపభూయిష్టంగా ఉండడంతో అసంఘటిత రంగ కార్మికులు కనీస ప్రయోజనం పొందలేకపోతున్నారు. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని ఆ శ్రమ జీవుల సంక్షేమమే లక్ష్యంగా వేడిగాడ్పుల ఉపశమన ప్రణాళికలను రూపొందించి అమలు పరచాలి. ఈ విషయంలో తమిళనాడు ప్రభుత్వం గ్రీన్ తమిళనాడు మిషన్ ద్వారా చేస్తున్న కృషి పథనిర్దేశకమైనదిగా చెప్పవచ్చు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వడదెబ్బ మృతులకు చెల్లించే ఎక్స్‌గ్రేషియాను రూ.50 వేల నుంచి రూ.4 లక్షలకు పెంచడం అభినందనీయం. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ వేడిగాడ్పులను ఒక వ్యవస్థీకృత ముప్పుగా కాకుండా ఒక వార్షిక ఇబ్బందిగా మాత్రమే పరిగణిస్తున్నట్టుగా కనిపిస్తోంది. ఉగ్రవాదంతో జాతీయ భద్రతకు సంభవిస్తున్న ప్రమాదాన్ని అరికట్టేందుకు ఎట్టకేలకు ఒక నిర్ణయాత్మక విధానానికి అంకురార్పణ చేసిన విధంగానే జాతి జనుల ఆరోగ్యానికి, ఆర్థికాభివృద్ధికి ఆటంకమవుతోన్న ఉగ్ర ఉష్ణోగ్రతలను నిరోధించేందుకు జరూరుగా ఒక సమగ్ర విధానాన్ని రూపొందించాలి.

ముగిసిన యుద్ధం, మిగిలిన ప్రశ్నలు!

'మన తోబుట్టువుల, కుమార్తెల సిందూరాన్ని తుడిచివేసిన పర్యవసానమేమిటో నేడు ప్రతి ఉగ్రవాదికి, ప్రతి ఉగ్రవాద సంస్థకు తెలిసివచ్చింది. ఆపరేషన్ సిందూర్ కేవలం ఒక పేరు కాదు, కోట్లాది భారతీయుల మనోభావాలకు ప్రతిబింబం'... ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోమవారం రాత్రి జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలోని మాటలవి. భారత్, పాకిస్థాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఆపరేషన్ సిందూర్‌లో ఒక విరామం మాత్రమేనని దేశ ప్రజలు విశ్వసించేలా చేసేందుకు ఆయన ప్రయత్నించారు. మోదీ స్వాభావిక వాక్చాతుర్యం, శ్రోతలను సమ్మోగ్ధం చేసే మాటకారితనం ఆ ప్రసంగంలో బాగా కనిపించాయి. ఉగ్రవాదులకు, వారికి మద్దతిస్తున్న పాకిస్థాన్‌కు భారీ నష్టాన్ని కలిగించడంలో ఆపరేషన్ సిందూర్ సఫలమయిందని మోదీ అన్నారు. తాత్కాలిక కాల్పుల విరమణ ప్రాతిపదికన కొత్త లక్ష్మణ రేఖలు నిర్దేశిస్తూ పాకిస్థాన్ ప్రభుత్వంతో చర్చలు ఉగ్రవాదం, ఆక్రమిత కశ్మీర్‌పైన మాత్రమే జరుగుతాయని ప్రధానమంత్రి ప్రకటించారు. ఇస్లామాబాద్ పాలకులు అణ్వస్త్రాల బూచిని చూపుతూ పాల్పడుతున్న బ్లాక్ మెయిల్‌కు భారత్ బెదరదు, జడవదు అని, మళ్లీ రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తే కఠినంగా ప్రతిస్పందించేందుకు భారత సైన్యం సదా యుద్ధ సన్నద్ధమై ఉందని నరేంద్రమోదీ హెచ్చరించారు.

ఒకపక్క, ఇక్కడ, ఇలా, భారత రాజకీయాల శక్తిమంతుడు తాను పాకిస్థాన్‌ను కాళ్లబేరానికి రప్పించా కనే కాల్పుల విరమణ జరిగిందంటూ టీవీలో ప్రసంగిస్తుండగానే అక్కడ వేలమైళ్ళ దూరంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈ కథనానికి వరుస తూట్లుపొడిచాడు. తాను, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో తీవ్ర ప్రయత్నాలు చేసి దక్షిణ ఆసియాలోని రెండు అణ్వస్త్ర రాజ్యాలను కాల్పుల విరమణకు ఒప్పించామని ట్రంప్ పేర్కొన్నారు. ప్రపంచ మీడియా పతాక శీర్షికల్లో ఉండేందుకు మోదీ కంటే ఎక్కువగా ట్రంప్ ఆరాటపడడం గత కొద్ది రోజుల్లో ఇది మూడోసారి. కాల్పుల విరమణకు అంగీకరించినట్టు భారత్, పాకిస్థాన్ ప్రభుత్వాలు ప్రకటించకముందే ట్రంప్ ఆ విషయాన్ని తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో వెల్లడించారు. మరి కొద్ది గంటల్లోనే, భారత్, పాకిస్థాన్‌లకు నచ్చచెప్పేందుకు అమెరికా ప్రభుత్వం రాత్రికి రాత్రి చేసిన ప్రయత్నాల గురించి సవివరంగా ట్వీట్ చేశారు. కశ్మీర్ వివాదాన్ని పరిష్కరించేందుకు తాను మధ్యవర్తిత్వం నెరపుతానని కూడా ఆయన ప్రతిపాదించారు.

మే 12న వైట్ హౌజ్‌లో మీడియా రోజువారీ గోష్ఠిలో ట్రంప్ ఆశువుగా చేసిన వ్యాఖ్యలు ఇంటా బయటా అసాధారణ వ్యక్తిలా వ్యవహరించే ప్రధాని మోదీని చిన్నబుచ్చేవిగా ఉన్నాయి. భారత్, పాకిస్థాన్‌లతో వాణిజ్య సంబంధాలను పూర్తిగా నిలిపివేస్తామని ఉభయ దేశాల ప్రధానమంత్రులకు గద్దించి చెప్పడం ద్వారా ఈ ఘర్షణ నుంచి విరమించుకునేలా చేశామని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇలా ట్రంప్ తనను వెంటాడడం కొనసాగుతుండడంతో సర్వత్రా తనకు ప్రచారాన్ని, ప్రాధాన్యాన్ని పొందడంలో అనితరసాధ్యుడైన మోదీ, ఇప్పుడు ఆ విషయంలో ఇబ్బందుల్లో పడ్డారు!



> ఆకస్మికంగా, అనూహ్యంగా అమలు జరిగిన కాల్పుల విరమణను యుద్ధోన్మాదులు హర్షించలేకపోయారు. యుద్ధం చుట్టూ బీజేపీ నిర్మిస్తూవచ్చిన దేశభక్తియుత, ఉద్వేగపూరిత వాతావరణాన్ని ఒక్కసారిగా ఛిద్రంచేసిన నిర్ణయమది. పాకిస్థాన్‌ను చావు దెబ్బకొట్టే అవకాశం వచ్చినా కూడా, అంతలోగానే అమెరికా ఒత్తిడికి మోదీ ప్రభుత్వం లొంగిపోయి కాల్పుల విరమణకు అంగీకరించిందనే అభిప్రాయం ప్రజలకు కలిగింది.

భారత్ పాకిస్థాన్‌ల మధ్య సైనిక ఘర్షణలు తమ ప్రయత్నాల వల్లనే నిలిచిపోయానని అమెరికా ఘనంగా చెప్పుకున్న అంశాన్ని, కశ్మీర్ వివాదాన్ని పరిష్కరించేందుకు తాను మధ్యవర్తిత్వం నెరపుతానన్న ట్రంప్ ప్రతిపాదనను ప్రధాని మోదీ తన ప్రసంగంలో మాట మాత్రంగానైనా స్పృశించకుండా యథావిధిగా తన ఉద్వేగపూరితమైన ప్రసంగంలో ప్రజలను ముంచెత్తారు. పాకిస్థాన్ నాయకులు తమ ప్రసంగాల్లో అమెరికా అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలుపగా, అమెరికా ఉనికిని భారత్ కనీసమాత్రంగానైనా అంగీకరించలేదు. భారతీయ ఆడపడుచుల నుదుటి 'సిందూరం'ను ఉగ్రవాదులు తుడిచేశారని మోదీ తన ప్రసంగంలో పదే పదే ప్రస్తావించడం ద్వారా ప్రజల్లో భావోద్వేగాలను పురిగొల్పారు.

అమెరికా వ్యాఖ్యలు, వాటిపై నరేంద్ర మోదీ మౌనం వహించడం ప్రతిపక్షాలకు ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించేందుకు వీలు కల్పించింది. ప్రధానమంత్రిని 'విశ్వగురు'గా ఆరాధిస్తున్న భారతీయ జనతా పార్టీ శ్రేణులను ఈ పరిణామం కలవరపరుస్తోంది. మోదీ తన విదేశీ పర్యటనలలోను లేదా భారత్ పర్యటనకు వచ్చిన అంతర్జాతీయ నాయకులను ప్రేమపూర్వకంగా ఆలింగనం చేసుకోవడం లేదా అభినందనపూర్వకంగా వారి వెన్నుచరచడం పరిపాటి. అలాంటిది ఇప్పుడు ట్రంప్ ఆయన్ను, పాకిస్థాన్ ప్రధానమంత్రిని సమరీతిలో గౌరవించడం, ఇరువురినీ ఒకే నాణేనికి బొమ్మా బొరుసులాగా పేర్కొనడం ద్వారా మోదీని తీవ్ర ఇబ్బందికి లోను చేశారు. ట్రంప్ తీరుతో మోదీ ప్రతిష్ఠ దెబ్బతిన్నది. విధేయ మీడియా, సామాజిక మాధ్యమాల శ్రేణులు ఎంతగా ప్రయత్నించినప్పటికీ జరిగిన నష్టాన్ని భర్తీచేయడం అసాధ్యంగా ఉన్నది.

ఆకస్మికంగా, అనూహ్యంగా అమలు జరిగిన కాల్పుల విరమణను యుద్ధోన్మాదులు హర్షించలేకపోయారు. యుద్ధం చుట్టూ బీజేపీ నిర్మిస్తూవచ్చిన దేశభక్తియుత, ఉద్వేగపూరిత వాతావరణాన్ని ఒక్కసారిగా ఛిద్రంచేసిన నిర్ణయమది. పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పే అవకాశం వ్యర్థమయిందని వారి బాధ. ఉభయ దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింతగా తీవ్రమయ్యేందుకు వారు ఎంతగా ప్రయత్నించినప్పటికీ అది సాధ్యం కాలేదు. పహల్గాం ఊచకోతలకు ప్రతీకారంగా భారత్, పాకిస్థాన్‌ల మధ్య రగుల్కొనే సైనిక ఘర్షణల గురించి ఈ యుద్ధోన్మాదులు అసాధారణ ఊహలు చేశారు. భారత సైనిక దళాలు పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకుంటాయని, బంగ్లాదేశ్‌ను విముక్తం చేసినట్టుగానే బలూచిస్థాన్‌ను పాకిస్థాన్ శృంఖలాల నుంచి విడిపిస్తాయని వారు ఆశించారు. కానీ, ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్‌కు భారీ నష్టాలు వాటిల్లాయని నిరూపించే గట్టి సాక్ష్యాధారాలు ఏవీ ప్రజల దృష్టికి రాలేదు. పైగా పాకిస్థాన్‌ను చావుదెబ్బకొట్టే అవకాశం వచ్చినా కూడా, అంతలోగానే అమెరికా ఒత్తిడికి మోదీ ప్రభుత్వం లొంగిపోయి కాల్పుల విరమణకు అంగీకరించిందనే అభిప్రాయం ప్రజలకు కలిగింది. ప్రధానమంత్రి వ్యవహరించిన తీరుపట్ల అసంతృప్తితో సామాజిక మాధ్యమాలలో ట్వీట్లు వెల్లువెత్తాయి. కాల్పుల విరమణను ప్రకటించిన విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి, ఆయన కుటుంబ సభ్యులకు వ్యతిరేకంగా కూడా పోకిరీ వ్యాఖ్యలు వెల్లువెత్తాయి. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా పవిత్ర యుద్ధాన్ని ప్రారంభించాలని సంఖ్యానేకులు డిమాండ్ చేశారు. ఈ ధోరణులకు వ్యతిరేకంగా మే 13 రాత్రి మోదీ చాలా కఠినంగా మాట్లాడినప్పటికీ, ఆయన మాటలు వారి ఆవేశాన్ని తగ్గించలేకపోవచ్చు.

కశ్మీర్‌పై పాకిస్థాన్‌తో ఘర్షించడంలో ముందుకు సాగడంపై తమ మద్దతుదారుల ఆకాంక్షలు, అంచనాలను సహేతుకంగా ఉండేలా చేయడంలో ప్రధాన మంత్రి, పాలక బీజేపీ చాలా కృషి చేయవలసిన అవసరమున్నది. తీవ్ర జాతీయవాద ఉన్మాదం లేదా దేశీయ రాజకీయాలలో తన ప్రభావ ప్రాబల్యాలు నిర్దేశించే విధానాలను అనుసరించడం వల్ల ఎదురయ్యే ప్రమాదాల గురించి ప్రధాని మోదీకి కచ్చితంగా తెలుసు.

పాకిస్థాన్ సమీప భవిష్యత్తులో ఉగ్రవాద, సైనిక దుస్సాహసాలకు పాల్పడే అవకాశం లేదు కనుక భారత్‌కు తక్షణ సవాళ్లు దౌత్య రంగంలోనే ఎదురవుతాయి. అణుయుద్ధం కొద్దిలో తప్పిపోయిందని చెప్పడం ద్వారా కశ్మీర్ వివాదాన్ని అంతర్జాతీయ సమస్యగా చేసేందుకు ఇస్లామాబాద్ ప్రయత్నించి, సఫలమయ్యే అవకాశమున్నది. మే 7 అనంతరం చోటుచేసుకున్న పరిణామాలు స్పష్టం చేస్తున్న ప్రధానాంశం ఒకటి ఉన్నది. అది: అమెరికా అధ్యక్షుడుగా డొనాల్డ్ ట్రంప్ ఉన్నందున పాత వ్యూహాత్మక నిశ్చితాలు ఏవీ ఇక చెల్లుబాటు కావు. అంతర్జాతీయ వ్యవహారాలలో తనను తాను ఒక స్వతంత్ర శక్తిగా పరిగణించుకుంటున్న ఇండియా తాత్కాలికంగా ప్రతికూలతలను ఎదుర్కోవలసి రావడం తప్పనిసరి. కశ్మీర్ వివాదంలో అంతర్జాతీయ మధ్యవర్తిత్వాన్ని పాకిస్థాన్ మొదటి నుంచీ అంగీకరిస్తున్న దృష్ట్యా భారత్ సంక్లిష్ట సవాళ్లను ఎదుర్కోవలిసి ఉంటుంది. ఈ వాస్తవాల దృష్ట్యా భారత్ దౌత్య వ్యూహాలు పటిష్ఠంగా ఉండాలి. అంతర్జాతీయ వేదికలపై పాకిస్థాన్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రధానమంత్రి స్వయంగా చొరవ తీసుకోవాలి.

■ అజయ్ బోస్
సీనియర్ పాత్రికేయుడు

(ది క్వింట్)

సిక్కిం విలీనానికి ఏభై ఏళ్ళు

స్వతంత్ర భారత చరిత్రలో సిక్కిం విలీనం ఒక ప్రధాన ఘట్టం. మే 16, 1975న జరిగిన ఈ చారిత్రక ఘట్టానికి ఏభై ఏళ్ళు నిండినందున నాటి గొలుసుకట్టు సంఘటనలు, రాజకీయ పరిస్థితులు, ఇందిరాగాంధీ దూరదృష్టి వంటి అంశాలను సింహావలోకనం చేసుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. భారతదేశానికి ఈశాన్య సరిహద్దులో నేపాల్, భూటాన్‌ల నడుమ ఒక రాష్ట్రం సిక్కిం. వైశాల్యంలో గోవాకు ఒక మెట్టు పైన ఉండే సిక్కిం, జనాభా పరంగా అతి చిన్న రాష్ట్రం. ప్రకృతి సౌందర్యానికి, ప్రశాంతతకు నెలవై, హిమాలయాల పర్వతశ్రేణి ఒడిలో ఒదిగి 500 సంవత్సరాలుగా మనుగడ సాగిస్తున్న దీని చరిత్ర ఆద్యంతం ఆసక్తికరమైనదే.

ఎనిమిదవ శతాబ్దంలో పద్మసంభవ (టిబెటన్ భాషలో గురు రింపోచే) అనే బౌద్ధ గురువు టిబెట్‌తో పాటు సిక్కింకు వజ్రయాన బౌద్ధాన్ని పరిచయం చేయగా, కొన్ని శతాబ్దాల తరువాత రాజ వంశీకులు (చొగ్యాల్) దానిని అవలంబించారు. ఇరుగు పొరుగు రాజ్యాలైన నేపాల్, భూటాన్‌ల దాడులకు గురైనప్పుడల్లా సిక్కింను టిబెట్ కాపాడేది. 18వ శతాబ్దపు చివర్లో చైనాకు చెందిన క్వింగ్ రాజులు కొన్నాళ్ళు పాలించగా, 1853లో ఈస్ట్ ఇండియా కంపెనీ (బ్రిటిష్) పరమైంది. ఎన్నో మలుపులు తిరిగిన తరువాత 1918లో బ్రిటిష్ ప్రభుత్వం... రక్షణ, విదేశీ వ్యవహారాలు మినహా సిక్కింకు అంతర్గత వ్యవహారాలలో పూర్తి స్వేచ్ఛనిచ్చింది. సిక్కిం స్టేట్ కాంగ్రెస్ 1948లో రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించడం ప్రారంభించింది. సిక్కిం రాజు– భారత ప్రధాని నెహ్రూ సహాయం కోరగా, భారత్ ఒక దివాన్‌ను, కొంత భద్రతా బలగాన్ని అక్కడకు పంపించింది. అప్పుడు ఉత్పన్నమైన విలీన ప్రతిపాదనను "చిన్నదైన ఒక సార్వభౌమ దేశాన్ని కబళించామన్న అపప్రథ తమకు అక్కర లేదని, పైగా ఆ విలీనం చైనాను రెచ్చగొట్టేదిగా కనిపిస్తుంది" అంటూ తిరస్కరించారు నెహ్రూ. 1950లో భారత రక్షణలో మెసిలే రాజ్యంగా సిక్కిం అవతరించింది.



> ఏభై ఏళ్లలో సిక్కిం ఒక ప్రగతిశీల రాష్ట్రంగా రూపుదిద్దుకుంది. వంద శాతం సేంద్రీయ వ్యవసాయాన్ని కొనసాగిస్తోంది. తలసరి ఆదాయంలో భారత్‌లో ప్రథమ స్థానాన్ని అందుకుంది. ఎటువంటి వేర్పాటు ఉద్యమాలు లేని ఈశాన్య రాష్ట్రంగా సిక్కిం ప్రపంచ పరిశీలకులను ఆశ్చర్యపరిచింది.

1962లో జరిగిన చైనా–భారత్ యుద్ధం భారత రక్షణ వ్యవస్థలో పెను మార్పులకు దారి తీసింది. రక్షణ విషయంలో లాల్ బహదూర్ శాస్త్రి, తరువాత ఇందిరా గాంధీ కొన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. 1967లో సిక్కిం–చైనా సరిహద్దుల్లో గల నాథులా, చోలా కనుమల వద్ద ఇనుప కంచె వేస్తున్న భారత సరిహద్దు దళాల సైనికులను చైనా సైనికులు వెనక్కు జరగమన్నారు. అయినా భారత దళాలు వెనుకడుగు వేయలేదు. ఫలితంగా ఘర్షణ జరిగింది. నాథులా కనుమ వద్ద సెప్టెంబర్‌లో, చోలాలో అక్టోబర్‌లో జరిగిన ఘర్షణలలో ఇరువైపులా ప్రాణ నష్టం జరిగింది. భారత శక్తిని తక్కువ అంచనా వేసిన చైనా దళాలు, మన సైనికుల తెగువతో వెనుదిరిగారు. నాటి ప్రధాని ఇందిరాగాంధీ సిక్కిం భౌగోళిక, వ్యూహాత్మక ప్రాముఖ్యతపై దృష్టి సారించి, దీర్ఘకాలిక ప్రణాళికా రచనలో నిమగ్నమయ్యారు. సిక్కిం ఉత్తరాన ఉన్న చుంబి లోయపై చైనా కన్నువేసిందని ఆమెకు స్పష్టమైన సంకేతాలు అందాయి. సిక్కిం విషయంలో ఒక బలమైన నిర్ణయం తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని గ్రహించి, వెంటనే పావులు కదిపారు.

1973లో జరిగిన ప్రజా ఉద్యమం ధాటికి చొగ్యాల్ (సిక్కిం చక్రవర్తిని చొగ్యాల్‌గా పిలిచేవారు) భారత ప్రభుత్వ సహాయాన్ని అర్థించగా, భారత్ 1200 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లను పంపి ఉద్యమాన్ని నియంత్రించింది. అయినా 1974లో సిక్కిం ప్రధానమంత్రి కాజీ లెండుప్ దర్జీ, సిక్కింను భారత్‌లో విలీనం చేయమని ఇందిరా గాంధీకి విజ్ఞప్తి చేయగా, ఆ ప్రక్రియకు అంకురార్పణ జరిగింది. విలీనం రెఫరెండం ద్వారా జరగాలని నిర్ణయించి, భారత ప్రభుత్వ బలగాల పర్యవేక్షణలో సిక్కిం ఎలక్షన్ కమిషన్‌కు ఆ పని అప్పజెప్పారు. ఏప్రిల్ 6న భారత్ భద్రతా సైనికులు రాజప్రాసాదంలోకి ప్రవేశించి 243 మంది సిక్కిం సైనికులను నిరాయుధులను చేశారు. దురదృష్టవశాత్తు ఒక సైనికుడు మరణించాడు. రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా, విలీనానికి మద్దతుగా 59,637 ఓట్లు రాగా, వ్యతిరేకంగా కేవలం 1,496 ఓట్లు పడ్డాయి. ఈ రెఫరెండం ప్రక్రియ మోసపూరితంగా భారత భద్రతా దళాల తుపాకుల కనుసన్నలలో జరిగిందని చైనా, పాకిస్తాన్‌లు విమర్శించాయి. దీనిని తిప్పికొడుతూ ఆజాద్ కశ్మీర్, టిబెట్‌ల చైనాలను ఇందిరాగాంధీ ఉదహరించారు. సిక్కిం విద్యార్థుల నిరసనను మన దళాలు సునాయాసంగా అణచివేశాయి. ఆండ్రూ డఫ్ అనే ఆంగ్ల పాత్రికేయుడు తన 'Sikkim: Requiem for a Himalayan Kingdom' గ్రంథంలో నాటి సంఘటనలు పూసగుచ్చినట్లు వర్ణించాడు.

1975, ఏప్రిల్ 11–16 మధ్య జరిగిన రెఫరెండం భారత్‌లో సిక్కిం విలీనానికి మార్గం సుగమం చేసింది. సిక్కిం భారత్‌లో విలీనానికి రాజకీయ పరిస్థితులకు, సాంస్కృతిక కారణాలు కూడా తోడయ్యాయి. అదే ఏడాది మే 16న పార్లమెంట్‌లో 35వ రాజ్యాంగ సవరణ ద్వారా సిక్కింను 22వ రాష్ట్రంగా భారత ప్రభుత్వం ప్రకటించింది. మొత్తానికి సిక్కిం విలీనం ద్వారా ఇందిరాగాంధీ తన రాజకీయ నైపుణ్యాన్ని, సామర్థ్యాన్ని మరొకసారి ప్రపంచానికి చాటి చెప్పారు. ఈ ఏభై ఏళ్లలో సిక్కిం ఒక ప్రగతిశీల రాష్ట్రంగా రూపుదిద్దుకుంది. వంద శాతం సేంద్రీయ వ్యవసాయాన్ని కొనసాగిస్తోంది. తలసరి ఆదాయంలో భారత్‌లో ప్రథమ స్థానాన్ని అందుకుంది. ఎటువంటి వేర్పాటు ఉద్యమాలు లేని ఈశాన్య రాష్ట్రంగా సిక్కిం ప్రపంచ పరిశీలకులను ఆశ్చర్యపరిచింది. పర్యాటకుల స్వర్గధామమైన ఈ రాష్ట్రం, భారత సరిహద్దులలో ప్రకాశించే మణిపూసగా అభివర్ధించవచ్చు.

○ కొట్టు శేఖర్
ప్రొఫెసర్, మిజోరాం యూనివర్సిటీ

బీసీ వాదం ఇప్పుడు వీస్తున్న గాలి!

అధికార పార్టీ సామాజిక కులగణన నిర్వహించిన తర్వాత ఎవరి శాతం ఎంతో తెలిసిపోయింది. ఆయా కులాలకు ఎవరి వాటా ఎంతో అవగతం అయింది. ఈ గాలి త్వరలో రాజకీయ తుఫానుగా మారే సంకేతాలను ఇస్తున్నది. వెనుకబడిన కులాలకు ఒక ఆశాకిరణంలా కనపడుతున్నది.

ఇప్పటిదాకా 'బడితె ఉన్నోడిదే బర్రె' అన్నట్టు అన్ని పార్టీలు తమ తమ కులాల ప్రాతిపదికన టికెట్లు ఇచ్చాయి. పైకి సామాజిక సమతూకం అంటూనే తీరా చూస్తే అధికార వర్గానికి అగ్ర తాంబూలం ఇచ్చాయి. అంతవరకు చెప్పిన మాటలన్నీ ఎన్నికల సమయానికి మర్చిపోయి బీసీలకు మొండి చేయి చూపించాయి. ఈ పరిస్థితిలో మంచికో చెడ్డకో, ఇష్టం ఉన్నా లేకున్నా, ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ తెలంగాణలో కులగణనకు శ్రీకారం చుట్టి పూర్తి చేసింది. ఈ చర్య క్రమంగా అన్ని రాజకీయ పార్టీలలో బహుజనులను ఏకం చేసే విధంగా సామాజిక విప్లవాత్మక మార్పుగా పరిణమించనున్నది.

ఇటీవల దేశంలో ఏర్పడిన కొన్ని పరిణామాల నేపథ్యంలో ప్రాంతీయ, జాతీయ స్థాయిలలో ఆయా పార్టీలు తమ మూల సిద్ధాంతాలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకోవలసిన అనివార్య పరిస్థితి ఏర్పడింది. రాహుల్‌గాంధీ దేశమంతా చేసిన పాదయాత్ర సామాజిక కులగణనను రాజకీయ పార్టీల ఎజెండా మీదికి బలవంతంగానైనా తెచ్చింది. దీని ప్రభావం గత ఏడాది పార్లమెంటు ఎన్నికల ఫలితాలపైన కనపడింది. అలాగే తెలంగాణలో ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడి వాక్చాతుర్యంపై, ఇచ్చిన వాగ్దానాలపై విశ్వాసంతో ఓటర్లు కాంగ్రెస్ వైపు మొగ్గుచూపారు. కాంగ్రెస్ తన హామీలలో ప్రధాన భాగమైన సామాజిక కులగణనను చేపట్టి పూర్తి చేసింది. మరోవైపు ఎస్సీ వర్గీకరణ బిల్లును శాసనసభలో ఆమోదించింది. దేశంలోనే ఎస్సీ వర్గీకరణను చట్టం ద్వారా అమలు చేసిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ ప్రభుత్వం ఖ్యాతిని ఆర్జించింది. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక సంస్థలలో వెనుకబడిన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు అధికారికంగా ఇవ్వడానికి సంకల్పించింది. ఈ విధంగా భవిష్యత్తులో జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలన్న ఉద్యమ రూపు దాల్చడానికి రోడ్డు క్లియర్ చేసింది. ఇన్నాళ్ళూ నివురుగప్పిన నిప్పులా ఉన్న వెనుకబడిన వర్గాలు త్వరలో తమ హక్కుల సాధన కోసం ప్రభుత్వంపై ముందెన్నడూ లేనంత ఒత్తిడి పెంచనున్నాయి.

– జూకంటి జగన్నాథం

ఆపరేషన్ సిందూర్: శత్రుదేశానికి గట్టి హెచ్చరిక

'ఆపరేషన్ సిందూర్ లక్ష్మణరేఖ – ఇంకోసారి దాడి చేస్తే చొరబడి మరీ అంతు చూస్తాం'... పాకిస్థాన్ సరిహద్దుకు దగ్గరగా, తాము నాశనం చేశామని పాకిస్థాన్ ప్రకటించుకున్న అదంపూర్ ఎయిర్‌బేస్ వేదికగా, పాకిస్థాన్‌కు భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేసిన హెచ్చరిక ఇది. ఓ వైపు పాకిస్థాన్ డ్రోన్లను, మిస్సైళ్లను నేలకూల్చిన S-400, మరోవైపు బ్రహ్మోస్‌తో పాకిస్థాన్ ఎయిర్‌బేస్‌లను పనికి రాకుండా చేసిన సుఖోయ్ యుద్ధ విమానం ఉండగా మోదీ ఈ హెచ్చరిక చేశారు. ధీరులైన సైనికులు పిడికిలి బిగించి చేసిన 'భారత్ మాతాకీ జై' అనే నినాదాలు సమీపంలోని పాకిస్థాన్‌లోనూ ప్రతిధ్వనించి ఉంటాయి. భారత్ సామర్థ్యం, బలం ప్రధాని మాటల్లో, చేతల్లో ప్రపంచం అంతా చూసింది. భారత సైన్యం పరాక్రమానికి ఆపరేషన్ సిందూర్ ప్రత్యక్ష సాక్షిగా నిలిచింది.

ప్రశాంతంగా ఉన్న కశ్మీర్ టూరిజం, పరిశ్రమల రాకతో ఆర్థికంగా అభివృద్ధి చెందితే ఉగ్రవాద జాడలేమీ మిగలవని భయపడిన పాకిస్థాన్ ఆర్మీ తన కుట్రలను అమలు చేసి తన నెత్తిమీదే చేయి పెట్టుకుంది. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ మునీర్ కశ్మీర్ ప్రజలకు తమ మద్దతు ఉంటుందని ప్రకటించిన వారానికే పహల్గాంలో టూరిస్టులను చంపేశారు. వెళ్లి మోదీకి చెప్పుకోవాలని పర్యాటకులకు సూచించారు. భారతీయుల జోలికి వచ్చినందుకు వారికి అప్పటికే డెత్ డేట్ ఖరారు అయిందని తర్వాత పరిణామాలు నిరూపించాయి. భారత్ దాడి చేస్తుందని ప్రపంచం అంతా తెలుసు, పాకిస్థాన్‌కూ తెలుసు. అయినా సరే, ఊహించని విధంగా ఆపరేషన్ సిందూర్‌ను ప్రధాని మోదీ నేతృత్వంలో అమలు చేశారు. తమ ఉగ్రవాద శిబిరాల జాడలు భారత్‌కు తెలియవని అనుకున్నారు. ప్రార్థనా మందిరాల్లో ఉన్నాయి కాబట్టి టెర్రరిస్టుల్ని కాపాడుకోవచ్చని అనుకున్నారు. కానీ ఆపరేషన్ సిందూర్ వంద మందికిపైగా కరుడుగట్టిన ఉగ్రవాదుల అంతం చూసింది.

ఉగ్రవాదుల అంత్యక్రియల్లో పాకిస్థాన్ ఆర్మీ, పాలకులు పాల్గొన్న సత్యాన్ని ప్రపంచానికంతటికీ భారత్ తెలియజెప్పింది. పాకిస్థాన్ పిచ్చిపట్టినట్టుగా భారత సరిహద్దుల్లో డ్రోన్ దాడులు చేస్తే, వాటిని కూల్చివేసి, నేరుగా పాక్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలకు గురిపెట్టింది. తీవ్రంగా దెబ్బతిన్న పాకిస్థాన్... టర్కీ నుంచి తెచ్చుకున్న డ్రోన్లు, చైనా ఇచ్చిన హతాఫ్ క్షిపణులతో దాడికి ప్రయత్నించినా, అన్నింటినీ భారత్ నేలమట్టం చేసింది. భారత్ కొట్టిన దెబ్బకు పాకిస్థాన్‌కు ఉనికి సమస్య వచ్చేసింది, అందుకే కాళ్ల బేరానికి వచ్చింది.

'ఆపరేషన్ సిందూర్'లో మన సైన్యం ధ్వంసం చేసిన ఎయిర్ బేస్‌లలో అత్యంత ముఖ్యమైనది రావల్పిండిలోని నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్. ఇది పాకిస్థాన్ ఎయిర్‌ఫోర్స్ లాజిస్టిక్, కమాండ్ హబ్. ఇక్కడ ఉన్న C-130 ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్, IL-78 రీఫ్యూయలింగ్ ట్యాంకర్స్, ఎర్లీ వార్నింగ్ సిస్టమ్స్‌ను భారత దళాలు ధ్వంసం చేశాయి. చక్వాల్‌లోని మురిద్ ఎయిర్‌బేస్ మీద భారత్ చేసిన దాడిలో డ్రోన్ సౌకర్యాలు, ఫైటర్ జెట్‌లు ధ్వంసమయ్యాయి. JF-17, మిరాజ్ ఫైటర్ జెట్ స్క్వాడ్రన్‌లను కలిగి ఉన్న రఫీకీ ఎయిర్‌బేస్‌నూ భారత దళాలు టార్గెట్ చేసి ధ్వంసం చేశాయి. రహీం యార్‌ఖాన్ ఎయిర్‌బేస్ రన్‌వేలో భారీ గొయ్యి పడేలా భారత దళాలు బాంబులు వేశాయి. సింధ్ ప్రావిన్స్‌లోని సుక్కూర్ ఎయిర్‌బేస్ రన్‌వే, సౌకర్యాలు దెబ్బతిన్నాయి. పంజాబ్‌లోని చునియన్ ఎయిర్‌బేస్ మీద చేసిన దాడిలో ఎయిర్ డిఫెన్స్ రాడార్లు ధ్వంసమయ్యాయి. సింధ్‌లోని భోలారీ ఎయిర్‌బేస్ హ్యాంగర్, రన్‌వేకు పెద్ద నష్టం వాటిల్లి, అక్కడ 50 మందికి పైగా మరణించారు. వీరిలో స్క్వాడ్రన్ లీడర్ ఉస్మాన్ యూసుఫ్, నలుగురు ఎయిర్‌మెన్ ఉన్నారు. ముషాఫ్ ఎయిర్‌బేస్‌పై భారత్ చేసిన దాడితో కిరనా హిల్స్‌లో భూగర్భ న్యూక్లియర్ నిల్వ స్థలాలకు సమస్యలు వచ్చాయని చెబుతున్నారు. ఈ దాడి పాకిస్థాన్‌లో ఆందోళనను రేకెత్తించింది. ఈ స్థావరం పాక్ ఆక్రమిత కశ్మీర్ సమీపంలో ఉంది. పాకిస్థాన్ సైన్యం లైన్ ఆఫ్ కంట్రోల్ వెంబడి 35–40 మంది సైనికులను కోల్పోయింది. ఎయిర్‌ఫోర్స్ అనేక హైటెక్ ఎయిర్ క్రాఫ్ట్‌లను కోల్పోయింది. ఈ దాడులు పాకిస్థాన్ రక్షణ సామర్థ్యాలను, ఆత్మస్థైర్యాన్ని బాగా దెబ్బతీశాయి. ఎంతగా అంటే భారత ప్రధాని అదంపూర్ ఎయిర్‌బేస్‌లో ప్రసంగిస్తే దానికి పోటీగా పాకిస్థాన్ ప్రధాని కూడా ఓ ఎయిర్‌బేస్‌కు వెళ్లారు. కానీ అక్కడ ఎయిర్ బేస్ లేదు. యుద్ధ ట్యాంక్‌పై నిలబడి మాట్లాడాల్సి వచ్చింది. మత మౌఢ్యంతో నిండిన టర్కీ.. భారత్‌పై వ్యతిరేకతను నరనరాన నింపుకున్న చైనా తప్ప, ఎవరూ పాకిస్థాన్‌కు మద్దతు ఇవ్వలేదు.



> ఆపరేషన్ సిందూర్‌తో భారత్ తన లక్ష్యాలను చాలావరకూ సాధించింది. వందమంది ఉగ్రవాదుల్ని మట్టుబెట్టింది. పాకిస్థాన్ సైన్యం సమీపకాలంలో కోలుకోలేని విధంగా దాని మౌలిక సదుపాయాల్ని దెబ్బతీసింది. భారత్ కొట్టిన దెబ్బకు పాకిస్థాన్‌కు ఉనికి సమస్య వచ్చేసింది. అందుకే కాళ్ల బేరానికి వచ్చింది. భారత్ సామర్థ్యం, బలం ప్రధాని మాటల్లో, చేతల్లో ప్రపంచం అంతా చూసింది. భారత సైన్యం పరాక్రమానికి ఈ ఆపరేషన్ ప్రత్యక్ష సాక్షి.

బ్రహ్మోస్ క్షిపణుల దెబ్బకు పాకిస్థాన్ కాళ్ల బేరానికి వచ్చింది. కాల్పులు ఆపాలంటూ పాక్ ఆర్మీనే మొదట ప్రతిపాదించింది. అప్పటికే భారత్ తన లక్ష్యాలను చాలావరకూ సాధించింది. వందమంది ఉగ్రవాదుల్ని మట్టుబెట్టింది. పాకిస్థాన్ సైన్యం సమీపకాలంలో కోలుకోలేని విధంగా దాని మౌలిక సదుపాయాల్ని దెబ్బతీసింది. మరొక్కరోజు ఘర్షణలు కొనసాగి ఉంటే కరాచీ పోర్టు నుంచి ఇస్లామాబాద్ ఎయిర్‌పోర్టు వరకూ ఏవీ మిగిలేవి కావు. భారత్ సాధించిన విజయం ఎంత పద్ధతిగా ఉందో చూసి ప్రపంచ దేశాలు ఆశ్చర్యపోతున్నాయి. మన బ్రహ్మోస్ క్షిపణి కోసం 17 దేశాలు ప్రతిపాదనలు పెట్టాయి.

యుద్ధం ఎలాంటిదైనా వినాశనమే. అందులో విజేతలు సాంకేతికంగా ఉంటారు కానీ.. యుద్ధం చేసిన వారంతా నష్టపోతారు. ఆ విషయమే ప్రధాని మోదీ చెప్పారు. ఇది యుద్ధాల యుగం కాదన్నారు. అదే సమయంలో ఉగ్రవాద యుగం కూడా కాదని స్పష్టం చేశారు. శత్రువును ఓడించడమే యుద్ధంలో విజయం కానీ.. చంపడం కాదు. చంపడం కన్నా.. ఓడించడం ద్వారా జీవితకాలం ఆ విజయం నిలుస్తుంది. ఈ యుద్ధనీతిని బాగా ఔపోసన పట్టిన నేత ప్రధాని నరేంద్రమోదీ. ఈ భరతమాత ముద్దుబిడ్డ మనదేశాన్ని ప్రపంచంలో అత్యున్నత శక్తిగా నిలబెట్టారు. ఆపరేషన్ సిందూర్ భారత చరిత్రలో ఓ విజయ పతాక.

• ఎస్. విష్ణువర్ధన్‌రెడ్డి
ఉపాధ్యక్షుడు, ఏపీ బీజేపీ

కళా విద్యను విస్మరిస్తున్న ప్రభుత్వం!

విద్యా వ్యవస్థపై ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి కొనసాగుతూ వస్తోంది. ఉమ్మడి రాష్ట్ర పాలకులపై దుమ్మెత్తి పోసిన స్వరాష్ట్ర పాలకులు కూడా వారినే అనుసరించారు. విద్యావ్యవస్థలో మార్పుల కోసం తెచ్చిన విద్యాహక్కు చట్టం, నూతన విద్యా విధానాల లక్ష్యం నెరవేరడం లేదు. మూడు దశాబ్దాలకు పైగా ఆర్ట్, క్రాఫ్ట్ విద్యలను విద్యార్థులకు దూరం చేశారు. విద్యార్థి దశలోనే కళా, వృత్తివిద్యలు అత్యంత అవసరమని 2009 విద్యాహక్కు చట్టం చెబుతోంది. భారతీయ సంప్రదాయ కళలతో పాటు నైపుణ్యాలను మెరుగుపరిచి మేకిన్ ఇండియాకు ఊపిరి పోయాలని నూతన విద్యా విధానం కోరుతోంది. అయినా దీని అమలులో గత ప్రభుత్వ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపించింది.

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే నూతన ఉపాధ్యాయుల నియామకాలలో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, మ్యూజిక్ ఉపాధ్యాయుల పోస్టులకు నియామకాలు చేపట్టకపోవడం విద్యా హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేయడమే. భారతీయ సంస్కృతులను సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించే విధంగా, విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించే విధంగా కళలు ఉపయోగపడతాయి. విద్యార్థికి అంతర్గత ఒత్తిడిని దూరం చేసి, మానసిక ప్రశాంతతను కలిగిస్తాయి.

విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి దోహదం చేసే కళలకు ప్రాణం పోయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. హైస్కూళ్లలో ఈ కళా ఉపాధ్యాయుల నియామకాలను చేపట్టకపోవడం బాధాకరమైన విషయం. ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, మ్యూజిక్ ఉపాధ్యాయుల కోర్సులను పూర్తి చేసి సుమారు మూడు లక్షల మంది నిరుద్యోగులు నియామకాల కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖా మాత్యులు స్పందించి తక్షణమే ఈ పోస్టులను మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌లో చేర్చి, భర్తీ చేయాలి.

– రావుల రాజేశం


త్రివేణి సంగమం వద్ద పుష్కరిణికి నమస్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి, పొన్నం, శ్రీధర్‌బాబు తదితరులు


ప్రధాన పుష్కర ఘాట్ వద్ద సీఎం రేవంత్ ఆవిష్కరించిన సరస్వతి మాత విగ్రహం

త్రివేణి సంగమ తీరంలో పుష్కర సందడి..

పుణ్య స్నానమాచరి స్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

'సరస్వతి' సంరంభం.. ఆరంభం

పుష్కర శోభితమైన కాళేశ్వరం త్రివేణి సంగమం

- అద్భుత ఘట్టాన్ని ప్రారంభించిన మాధవానంద సరస్వతి
- పుణ్యస్నానాలాచరించిన సీఎం రేవంత్, మంత్రులు
- ఆధ్యాత్మికతతో అలరారుతున్న ముక్తీశ్వర క్షేత్రం

7

అంతర్వాహిని.. సరస్వతీ సంరంభం ఆరంభమైంది. అరుణోదయ వేళ అద్భుత పుష్కర ఘట్టం ఆవిష్కృతమైంది. దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళేశ్వర ముక్తీశ్వర సన్నిధి ఆధ్యాత్మిక శోభితమైంది. పవిత్ర త్రివేణి సంగమం భక్త జనులతో సందడిగా మారింది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత జరుగుతున్న తొలి సరస్వతీ పుష్కరాలు కావడంతో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. 12రోజుల పాటు జరిగే ఈ పుష్కరోత్సవానికి లక్షలాది భక్తులు తరలివస్తారన్న అంచనాల మధ్య పటిష్ఠ ఏర్పాట్లు చేసింది. ఈ క్రమంలో గురువారం ఉదయం 5.44గంటలకు బృహస్పతి మిథున రాశిలో ప్రవేశించిన అనంతరం ప్రధాన పుష్కర ఘాట్‌లో శ్రీ గురుమదనానంద సరస్వతీ పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామీజీ పుష్కర సంరంభానికి అంకురార్పణ చేశారు. ఈ పూజల్లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ దంపతులు, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు. ఇక సాయంత్రం జరిగిన వేడుకలకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి సరస్వతీఘాట్ వద్ద పుణ్యస్నానం ఆచరించిన ఆయన.. అక్కడ ఏర్పాటు చేసిన 15 అడుగుల ఏకశిల సరస్వతి మాత విగ్రహాన్ని ఆవిష్కరించి, ముక్తీశ్వరుడిని దర్శించుకున్నారు. అనంతరం నవరత్న హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. దక్షిణ కాశీగా పేరొందిన కాళేశ్వరాన్ని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తామన్నారు.

- కాళేశ్వరం, ఆంధ్రజ్యోతి

పుష్కర జలాన్ని తలపై చల్లుకుంటున్న మంత్రి సురేఖ

పుష్కరమాతకు నవరత్న హారతి సమర్పిస్తున్న దృశ్యం

కాళేశ్వరంలోని ముక్తీశ్వర సన్నిధిలో భక్తుల రద్దీ

కాళేశ్వరాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

- అభివృద్ధికి గ్రీన్ చానల్ ద్వారా రూ.200కోట్లు కేటాయిస్తాం
- వచ్చే గోదావరి, కృష్ణ పుష్కరాలను ఘనంగా నిర్వహిస్తాం
- అభివృద్ధిలో నాడు పీవీ... నేడు శ్రీధర్‌బాబు కీలకం
- సరస్వతీ పుష్కర వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి

7

పుష్కరిణికి.. నవరత్న హారతి

- తొమ్మిది రకాల హారతులిచ్చిన కాశీ పండితులు
- వీక్షించిన సీఎం, మంత్రులు, ఉన్నతాధికారులు

నేడు ఉపముఖ్యమంత్రి రాక



గురువారం సరస్వతి పుష్కరాలు ప్రారంభమైన నేపథ్యంలో శుక్రవారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కాళేశ్వరం రానున్నారు. శుక్రవారం ఉదయం కాళేశ్వరం చేరుకోనున్న ఆయన పుష్కర స్నానాలు ఆచరించి కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకోనున్నారు.

పార్టీని మరింత బలోపేతం చేయాలి



- సంస్థాగత నిర్మాణంలో భాగస్వాములు కావాలి
- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- రెండేళ్లలో నియోజకవర్గానికి గోదావరి జలాలు
- సమర్థులనే మండల, గ్రామ అధ్యక్షులుగాఎంపిక చేయాలి : ఎమ్మెల్యే శ్రీహరి

6

వరంగల్ అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

గిర్మాజీపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. గురువారం వరంగల్ నగరంలోని కృష్ణకాలనీ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో రూ.5కోట్లతో చేపట్టిన 15 తరగతి గదులతో కూడిన మూడు అంతస్థుల భవన నిర్మాణానికి మంత్రి కొండా సురేఖ భూమి పూజ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శరద్మతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి సురేఖ మాట్లాడారు. కృష్ణకాలనీ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు నూతన భవనం కోసం అరవిందో ఫార్మా ఫౌండేషన్ రూ.5కోట్ల సీఎస్ఆర్ నిధులు మంజూరు చేసిందని చెప్పారు. ఈ నిధులతో మూడు అంతస్థులతో 15 గదులు, ఆడిటోరియం తరహాలో పెద్ద హాల్, 60 అధునాతన టాయిలెట్లు నిర్మించడంతో పాటుగా అధునాతన ఫర్నిచర్‌ను కూడా అరవిందో ఫార్మా ఫౌండేషన్ ఇస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా కళాశాలను అరవిందో ఫార్మా కృష్ణకాలనీ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలగా పేరు మార్చనున్నట్లు తెలిపారు. అలాగే కాలేజీ డ్రెయినేజీ నిర్మాణంపై త్వరలో మేయర్‌తోపాటు తాను రైల్వే జీఎంను కలిసి మాట్లాడి నిర్మాణం చేస్తామని అన్నారు. అలాగే కృష్ణకాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నూతన భవనాలను కూడా మరో కంపెనీ సహకారంతో కోటిన్నర రూపాయలతో పూర్తి చేసేందుకు కార్యాచరణ చేపట్టినట్లు మంత్రి సురేఖ చెప్పారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ నూతన భవనం, డ్రెయినేజీ నిర్మాణాల విషయంలో మహానగర పాలక సంస్థ నుంచి అన్నిరకాల సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్యశారద, అరవిందో ఫార్మా ఫౌండేషన్ సీఎస్ఆర్ హెడ్ ఎస్.సదానందరెడ్డి, స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్‌రాజు, మీసాల ప్రకాష్, జారతి రమేష్, కళాశాల అధ్యాపకులు ఎం.శ్రీనివాసశర్మ, హరికృష్ణ, రమణారెడ్డి, కరుణశ్రీ, వనమాల, కవిత, ప్రవళిక, మంజుల తదితరులు పాల్గొన్నారు.


కృష్ణకాలనీ ప్రభుత్వ జూనియర్ కాలేజీ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సురేఖ

ఫింగర్ ప్రింట్ విభాగం పాత్ర కీలకం

సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, మే 15 (ఆంధ్రజ్యోతి): నేరస్థులను పట్టుకోవడంలో ఫింగర్ ప్రింట్ విభాగం పాత్ర కీలకమని వరంగల్ పోలీస్ కమిషన్ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు రాష్ట్ర ఫింగర్ ప్రింట్ విభాగం తొలివిడతలో 9 పోలీస్‌స్టేషన్‌లకు మంజూరుచేసిన అత్యాధునిక పరికరాలను గురువారం సీపీ వివిధ స్టేషన్‌ల సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడాలేని విధంగా కొత్తగా అందుబాటులోకి తీసుకొచ్చిన టెక్నాలజీని వినియోగించడంలో సిబ్బంది, అధికారులు నిష్ణాతులు కావాలని సూచించారు. స్టేషన్ అధికారులు సేకరించే సమాచారం ద్వారా నిందితులను గుర్తించడం సులభతరం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ విభాగం ఇన్‌స్పెక్టర్లు రాజ్‌కుమార్, శ్రీధర్, రాజు పాల్గొన్నారు.


సిబ్బందికి ఫింగర్‌ప్రింట్ పరికరాలను అందజేస్తున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

పెళ్లి వేడుకలో విషాదం

డ్యాన్స్ చేస్తూ గుండెపోటుతో వృద్ధుడి మృతి

దుగ్గొండి, మే 15 (ఆంధ్రజ్యోతి): మనవరాలి వివాహ వేడుకలో డ్యాన్స్ చేస్తూ వృద్ధుడు గుండెపోటుకు గురై మృతిచెందాడు. ఈ సంఘటన గురువారం వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని తిమ్మంపేటలో వెలుగులోకి వచ్చింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. తిమ్మంపేటకు చెందిన ఓర్సు కొంరయ్య(60)- సమ్మక్క దంపతులు వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం గడుపుతారు. కొంరయ్య కుమారుడు కృష్ణ కుమార్తె వివాహం బుధవారం నిర్వహించారు. అదేరోజు రాత్రి గ్రామ ఊరేగింపు చేపట్టారు. మనవరాలు పెళ్లికి తాత కొంరయ్య ఊరేగింపులో సంతోషంగా డ్యాన్స్ చేస్తూ ఒక్కసారిగా కింద పడిపోయాడు. దీంతో బంధువులు కొంరయ్యను ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మృతి చెందాడు. కొంరయ్య మృతితో పెళ్లి కుటుంబంలో విషాదం చోటు చేసుకుంది.


కొంరయ్య (ఫైల్)

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన కలెక్టర్ ప్రావీణ్య

ఎల్కతుర్తి, మే 15 (ఆంధ్రజ్యోతి): ఎల్కతుర్తి మండలంలోని వీరనారాయణపూర్ గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద మొదటి విడతగా మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. గురువారం వీరనారాయణపూర్ గ్రామానికి చెందిన సౌందర్య, సుశీల ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఇంటి నిర్మాణానికి సంబంధించిన మెటీరియల్ ఎక్కడి నుంచి తెస్తున్నారు? ఇంటి నిర్మాణానికి ఎంత ఖర్చు అవుతుంది? ఇప్పటి వరకు ఎంత ఖర్చు చేశారు? నిర్దేశించిన రేటు ప్రకారం ఇళ్ల నిర్మాణం జరుగుతోందా? అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఎన్ని ఇళ్లు బేస్‌మెంట్ లెవల్‌కు వచ్చాయి, ఇంక మొదలు పెట్టని ఇండ్లు ఎన్ని? అని గృహ నిర్మాణ శాఖ డీఈ సిద్ధార్థ నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎల్కతుర్తిలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బేస్‌మెంట్ లెవల్ నిర్మాణం జరిగిన ఇళ్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసి బిల్లులు చెల్లించామన్నారు. వర్షకాలం సమీపిస్తున్నందున్న త్వరగా స్లాబులు వేసుకోవాలని సూచించారు. మహిళ వీవో గ్రూపుల ద్వారా లబ్ధిదారులు రుణాలు తీసుకుని బేస్‌మెంట్ లెవల్ పూర్తి చేసుకోవడానికి చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లు, విఎల్లుల ట్యాగింగ్, రైతుల ఖాతాలకు డబ్బులు జమ, గన్నీ సంచుల కొరత తదితర వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ చివరి దశకు చేరుకుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులకు రూ.150కోట్లు చెల్లించినట్లు పేర్కొన్నారు. రెండు వారాల్లో మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కలెక్టర్ మేన శ్రీను, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కొమురయ్య, సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, ఎంపీడీవో నందనం విజయ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


వీరనారాయణపూర్‌లో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య


ఎండలోనూ భక్తుల రాక



పుష్కర స్నానానికి తరలి వస్తున్న భక్తులు

కాళేశ్వరం, మే 15(ఆంధ్రజ్యోతి) : సరస్వతి నదీ పుష్కరాలకు భక్తులు ఎండ సైతం లెక్క చేయకుండా తరలివచ్చారు. మధ్యాహ్నం సమ యంలో కూడా పుష్కర స్నానాలు ఆచరించడా నికి భక్తులు నదికి రావడంతో జన సంద్రంగా మారింది. ఉదయం భక్తుల రద్దీ ఉండగా మధ్యాహ్నం వరకు కూడ భక్తుల రాక కొనసా గింది. ఎండకు వచ్చిన భక్తులు నదిలో ఏర్పా టు చేసిన చలువ పందిళ్ల వద్దకు చేరుకొని సేద తీరారు. పుష్కర స్నానాలకు వచ్చిన భక్తులు పలువురు ఎండకు డీహైడ్రేషన్‌కు గురయ్యారు. వీరిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అలాగే భద్రాచలం నుంచి పారిశుద్ధ్య పనుల నిర్వహ ణకు వచ్చిన కార్మికుడు వెంకటేష్ పుష్కరాల్లో గాయపడగా ఆయనకు ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అందించిన అనతరం ఆయన ను వంద పడకల ఆసుపత్రికి తరలించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మొత్తం రెండు వందల మందికి వైద్య సేవలు అందించినట్లు అధికారులు తెలిపారు.

అంధకారంలో ప్రధానఘాట్ రోడ్



ప్రధాన ఘాట్‌లో చీకటిగా ఉన్న రహదారి

కాళేశ్వరం, మే 15 (ఆంధ్రజ్యోతి) : సరస్వతీ ఘాట్ రోడ్డు నుంచి ఆలయానికి వచ్చే పూర్వపు రహదారి వెంబడి చిమ్మచీకట్లు కమ్ముకున్నాయి. ప్రధాన ఘాట్ నుంచి టెంట్‌సిటీ వరకు.. అక్కడి నుంచి కాళేశ్వరం వచ్చే వరకు, ప్రధాన ఘాట్ నుంచి వీఐపీ ఘాట్‌కు వెళ్ళే లింకు రోడ్డులోను ఎలాంటి లైట్లు లేవు. దీంతో ఆ దారులన్ని చిమ్మచీకట్లు చిమ్ముకోవడం అధికారుల నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యంగా మారింది. హంగులు ఆర్భాటాలపైనే అధికారులు దృష్టిసారించారని.. మిగతామార్గాల్లో ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడం పట్ల భక్తుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది.

అందుబాటులో ఫైర్ వాహనాలు

కాళేశ్వరం (ఆంధ్రజ్యోతి): సరస్వతి పుష్కరాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అగ్నిమాపక శకటాలను అందుబాటులో ఉంచారు. నాలుగు ఫైర్ వాహనాలు, 2 ఓపీఎమ్ బోట్‌లు, 40 మంది సిబ్బంది, 2 రిమోట్ కంట్రోల్ బోట్‌లు 24గంటలు అందుబాటులో ఉండనున్నాయి. హెలీప్యాడ్, సరస్వతీ పుష్కర ఘాట్, టెంట్‌సిటీ, టెంపుల్ వద్ద ఈ ఫైర్ ఇంజన్ వాహనాలు, అగ్నిమాపకశాఖ యంత్రాంగం అందుబా టులో ఉంటుంది. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ప్రమాదాల నివార ణకు చర్యలు తీసుకుంటున్నారు.



అందుబాటులో ఉన్న ఫైర్ వాహనాలు

పార్టీని మరింత బలోపేతం చేయాలి

వరంగల్ ఎంపీ కడియం కావ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కావ్య

రఘునాథపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడానికి కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో పని చేయడంతో పాటు సంస్థాగత నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నిడిగొండలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగిన స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షత వహించగా, స్టేషన్‌ఘన్‌పూర్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ జంగా రాఘవ రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ పరిశీలకులు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, లింగంయాదవ్ హాజరై మాట్లాడారు. ఎంపీ మాట్లాడుతూ కాంగ్రెస్ తోనే అంబేద్కర్ ఆశయ సాధన, రాజ్యాంగ పరిరక్షణ సాధ్యమవుతుందని, రాహుల్‌గాంధీ ప్రధాన మంత్రి అయ్యే వరకు అందరూ సైనికుల్లా పనిచేయాలన్నారు.

ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. నియోజక అభివృద్ధికోసం సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో రూ.850 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరిగాయన్నారు. రెండేళ్లలో నియోజకవర్గంలోని రెండు పంటలకు గోదావరి జలాలు అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామ స్థాయి అధ్యక్షుల ఎంపికలో సీనియార్టీతో పాటు సమర్థతను గీటురాయిగా తీసుకోవాలని, వారితో పార్టీకి లాభం జరుగాలి తప్ప వారు పార్టీకి భారం కాకుండా చూసుకోవాలని పార్టీ పరిశీలకులకు సూచించారు. నీటి పారుదల, వైద్యం, విద్య, సంక్షేమ కార్యక్రమాల ఎజెండాతోనే ముందుకు వెళ్తున్నాని, అందులో భాగంగానే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రియాజ్, మారజోడు రాంబాబు, జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్, ఛైర్‌పర్సన్‌లు శివరాజ్ యాదవ్, లావణ్య, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీలు బొల్లం అజయ్ మణికంఠ, గుడి వంశీధర్ రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొనాసీ క్రాంతికుమార్, లింగాజీ, అమృతరావు, నరేందర్ రెడ్డి, కోళ్ల రవి, మేకల వరలక్ష్మి, నరేందర్, దిలీప్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎంపీ కడియం కావ్యను సన్మానిస్తున్న ట్రాన్స్‌జెండర్లు

ట్రాన్స్‌జెండర్ల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపడుతాం..

ఎంపీ డాక్టర్ కడియం కావ్య

కరీమాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌జెండర్ల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపడుతామని, ట్రాన్స్‌జెండర్లు ఆత్మగౌరవంతో జీవించేందుకు తనవంతు సంపూర్ణ సహకారం అందిస్తానని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. గురువారం వరంగల్ నగరంలోని ఉర్సుగుట్ట వద్ద గల నాని గార్డెన్స్‌లో ఓరుగల్లు శివశక్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన చౌదరి బిరుదాంకిత కార్యక్రమానికి కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ట్రాన్స్‌జెండర్ల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపడుతామని అన్నారు. వారి ఆరోగ్యంతోపాటు అందాల్సిన అన్ని రకాల సంక్షేమ పథకాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతామని తెలిపారు. ట్రాన్స్‌జెండర్లు సమాజంలో ఆత్మగౌరవంతో జీవించాలన్నారు. ఆధార్ కార్డులు లేని వారికి ఆధార్ కార్డులు జారీకి చర్యలతో పాటు పేరు మార్పులకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలని అన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఉమెన్ ఎంపవర్‌మెంట్ కార్యక్రమంలో మహిళా సమస్యలతో పాటు ట్రాన్స్‌జెండర్ల సమస్యలను ఛైర్మన్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలియజేశారు. భూమి మీద పుట్టిన ప్రతీ ఒక్కరికి సర్వ అధికారాలు, హక్కులు ఉంటాయని కడియం కావ్య అన్నారు. ఎక్కడైతే వెనుక బడుతామో అక్కడే గుర్తింపు పెంచుకోవాలని, ఆ ప్రక్రియతో ట్రాన్స్‌జెండర్ల సంఘానికి గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. ఎన్నికల్లో సైతం పోటీ చేయాలని, అప్పుడే తగిన గుర్తింపు ఉంటుందన్నారు. 2019లో ట్రాన్స్‌జెండర్ యాక్ట్ వచ్చిందని గుర్తుచేశారు. ట్రాన్స్‌జెండర్లకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పార్లమెంట్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కడియం కావ్య హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీ కడియం కావ్యను ట్రాన్స్‌జెండర్లు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వరంగల్, నల్లగొండ జిల్లాల జోగినిలు తదితరులు పాల్గొన్నారు.

25న యూపీఎస్సీ సివిల్ సర్వీస్ ప్రిలిమినరీ పరీక్ష

హనుమకొండ జిల్లాలో 10 పరీక్షా కేంద్రాలు

అధికారుల సమీక్షలో జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



హనుమకొండ కలెక్టరేట్, మ15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25వ తేదీన నిర్వహించే యూపీఎస్సీ సివిల్ సర్వీస్ ప్రిలిమినరీ పరీక్షకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో గురువారం యూపీఎస్సీ సివిల్ సర్వీస్ పరీక్ష నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. యూపీఎస్సీ పరీక్ష నిర్వహణ కోసం హనుమకొండ జిల్లా పరిధిలో 10 పరీక్షా కేంద్రాలను కేటాయించామన్నారు. పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ పరీక్షకు 4,141 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని, ఈ పరీక్ష రెండు సెషన్లలో ఉంటుందన్నారు. మొదటి 25వ తేదీన ఉదయం 9:30 నుంచి 11:30గంటల వరకు, రెండో సెషన్‌లో మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు ఉంటుందని, పరీక్ష రాసే అభ్యర్థులు కేటాయించబడిన పరీక్షాకేంద్రాలకు 30నిమిషాల ముందుగానే చేరుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఉదయం 9గంటల తర్వాత, మధ్యాహ్నం 2గంటల తర్వాత పరీక్షా కేంద్రంలోకి అనుమతించరని, అభ్యర్థులు అడ్మిట్ కార్డుతోపాటు గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్, హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, డీఈవో వాసంతి, తహసీల్దార్లు, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బార్‌షాప్‌లో గొడవపడిన వ్యక్తులపై కేసు

మడికొండ, మే 15(ఆంధ్రజ్యోతి): మడికొండలోని చీర్స్ బార్‌లో గొడవపడిన వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్సై పెగడ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మడికొండలోని చీర్స్ బార్‌లో బుధవారం పల్లపు యాదగిరి, పల్లపు మధు, దువ్వ వినయ్, పల్లపు రాజు అనే నలుగురు వ్యక్తులు మద్యం సేవించడానికి బార్‌కి వచ్చారు. మద్యం సేవిస్తూ బార్‌లో టేబుల్‌పై క్యారంబోర్డు పెట్టి ఆడుతుండగా బార్ షాపు సూపర్‌వైజర్ గోపనబోయిన రాజు వచ్చి పక్క టేబుల్ కస్టమర్లకు ఇబ్బందిగా ఉంది బార్‌లో క్యారం బోర్డు ఆట ఆడవద్దని చెప్పాడు. దీంతో అతడిని బూతులు తిడుతూ బెదిరించారు. సూపర్ వైజర్ ఫిర్యాదు మేరకు నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళలకు మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ

హసన్‌పర్తి, మే 15 (ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ హసన్‌పర్తి వారిచే నిరుద్యోగ యువతకు మగ్గం వర్క్సులో 31రోజుల పాటు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ రవి తెలిపారు. 18 నుంచి 45 ఏళ్ల వయస్సు కలిగిన వరంగల్, హనుమకొండ, జనగామ, భూపాలపల్లి, మహబూబాబాద్, ములుగు, జిల్లాలకు చెందిన నిరుద్యోగ మహిళలు అర్హులని తెలిపారు. అర్హులైన ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఎస్‌బీఐ ఆర్‌సేటీ సంస్కృతి విహార్, టీటీడీసీ కేంద్రం హసన్‌పర్తిలో జూన్ 8వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత శిక్షణతో పాటు భోజన, వసతి సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు సెల్ నెం.97040 56522, 98493 07873 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

పింగళి మహిళ డిగ్రీ కళాశాలకు రెండు కొత్త కోర్సులు

కేయూ క్యాంపస్ మే 15, (ఆంధ్రజ్యోతి): వడ్డెపల్లి పింగళి ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలకు ఈ ఏడాది రెండు కొత్త కోర్సులను రాష్ట్ర కాలేజ్ కమిషనరేట్ అధికారులు మంజూరు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.చంద్రమౌళి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా డిగ్రీ స్థాయిలో హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్, ఈ-కామర్స్ ఆపరేషన్‌లో 2025-26 ఏడాదికి అడ్మిషన్లు కల్పిస్తామని వెల్లడించారు. బీఎస్సీ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్‌లో అడ్మిషన్‌కు ఇంటర్ బైపీసీ, మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ, డైయిరీ సైన్స్ ఉత్తీర్ణత సాధించిన వారు, అలాగే బీకామ్ ఈ-కామర్స్‌లో అడ్మిషన్ పొందేందుకు ఇంటర్‌లో కామర్స్, సైన్స్ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. మూడేళ్ల కోర్సుల్లో రెండేళ్లు థియరీ, మరో ఏడాది స్టయిఫండరీ అప్రెంటిషిప్ అభ్యసించవలసి ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

దేశ భద్రతలో కృత్రిమమేధ కీలక భూమిక

నిట్‌లో ఇంటర్న్‌షిప్ ప్రారంభంలో సైంటిస్ట్ డాక్టర్ మల్లికార్జున రావు



జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ రతీష్ కుమార్

హనుమకొండ, మే 15 (ఆంధ్రజ్యోతి) : దేశ భద్రతా వ్యవస్థల్లో కృత్రిమ మేధ (ఏఐ) ప్రస్తుతం కీలక భూమిక పోషిస్తోందని ఇమారత్ రీసెర్చ్ సెంటర్ (ఆర్‌సీఐ-డీఆర్‌డీవో) సైంటిస్టు, టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ జి.మల్లికార్జునరావు, వరంగల్ ఎన్ఐటీలో 'ఏఐటీవోటీ (కృత్రిమ మేధ) - దాని అనవర్తనాలు' అనే అంశంపై జాతీయ ఇంటర్న్‌షిప్ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఎన్ఐటీలోని శిక్షణ, అభ్యాస కేంద్రం (సీటీఎల్) ఆధ్వర్యంలో నెలపాటు జరిగే ఈ జాతీయస్థాయి ఇంటర్న్‌షిప్ సమగ్ర శిక్షణా కార్యక్రమం జూన్ 15 వరకు కొనసాగుతుంది. ఈ కార్యక్రమాన్ని వరంగల్ నిట్ ప్రణాళిక, అభివృద్ధి డీన్ ప్రొఫెసర్ పి.రతీష్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ మల్లికార్జునరావు రక్షణ రంగంలో కృత్రిమ మేధస్సు పాత్రపై కీలక ప్రసంగం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏఐ ఆధారిత సాంకేతికతలు రక్షణ వ్యవస్థల్లో గణనీయమైన మార్పులు తీసుకువస్తున్నాయని అన్నారు. ఇవి నిర్ణయ ప్రక్రియను మెరుగుపరచడంలో, పని సామర్థ్యాన్ని పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయని అన్నారు. దేశ భద్రత కోసం కృత్రిమ మేధ వినియోగం తప్పనిసరిగా మారిందన్నారు. మరో ముఖ్య అతిథి సైంటిస్టు, ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ కనికే శ్రీనివాసులు మాట్లాడుతూ.. విద్యార్థులు ఏఐవోటీలోని విస్తృత అవకాశాలను అర్థం చేసుకొని రక్షణ, వ్యవసాయం, స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి రంగాల్లో తమ పాత్రను నిర్వర్తించాలని పిలుపు నిచ్చారు. ప్రొఫెసర్ రతీష్ కుమార్ ఈ ఇంటర్న్‌షిప్ కార్యక్రమం విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ప్రాక్టికల్ స్కిల్స్‌ను కూడా అందిస్తోందన్నారు. ఇటువంటి శిక్షణలతోనే విద్యార్థులను ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దవచ్చునని అన్నారు. ప్రొఫెసర్ టి.కిశోర్ ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ప్రముఖ విద్యా సంస్థల నుంచి కేవలం 5రోజుల్లోనే 120కిపైగా విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నా రన్నారని తెలిపారు. నిపుణలైన బోధనా సిబ్బంది ద్వారా లెక్చర్లతో పాటు ప్రాక్టికల్ సెషన్లు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమ నిర్వాహకులు, సీటీఎల్ ప్రొఫెసర్ టి.కిశోర్‌కుమార్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమం ఉద్దేశం, లక్ష్యాలను వివరించారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న గట్టు మహేశ్‌బాబు

కాళేశ్వరంలో ఆర్యవైశ్యులకు అన్నదానం

శ్రీవాసవి ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం ఉపాధ్యక్షుడు గట్టు మహేశ్‌బాబు

మట్టెవాడ, మే 15 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో జరిగే సరస్వతీ పుష్కరాలకు వచ్చే ఆర్యవైశ్య భక్తులకు ప్రతీరోజు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు కాళేశ్వరంలోని శ్రీవాసవి ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం ఉపాధ్యక్షుడు గట్టు మహేశ్‌బాబు తెలిపారు. గురువారం వరంగల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహేశ్‌బాబు మాట్లాడుతూ.. సర్వతీ పుష్కరాలకు వివిధ రాష్ట్రాల నుంచి కుటుంబ సభ్యులతో హాజరయ్యే ఆర్యవైశ్యుల కోసం ప్రతినిత్యం తమ ఆర్యవైశ్య సత్రం ఆధ్వర్యంలో విశేష అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో సత్రం అధ్యక్షుడు సోమ రామయ్య, ఉపాధ్యక్షులు గోరంటాల యాదగిరి, ఇరుకుల్ల రమేశ్, ఐత గోపినాథ్, గుముడవెల్లి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ 23వ స్నాతకోత్సవానికి రండి..

● గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ఆహ్వానించిన వీసీ ప్రతాప్‌రెడ్డి ● జూలై 7న క్యాంపస్‌లో నిర్వహణకు కసరత్తు



రాష్ట్ర గవర్నర్, కేయూ చాన్స్‌లర్ జిష్ణుదేవ్ వర్మను కలిసిన వీసీ ప్రతాప్‌రెడి

కేయూ క్యాంపస్ మే 15, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవానికి వర్సిటీ ఉన్నతాధికారులు కార్యాచరణను సిద్ధం చేశారు. జూలై 7న క్యాంపస్‌లో అట్టహాసంగా నిర్వహించనున్నారు. స్నాతకోత్సవ ఏర్పాట్లలో భాగంగా గురువారం హైదరాబాద్ రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్, కేయూ చాన్స్‌లర్ జిష్ణుదేవ్ వర్మను వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి కలిశారు. కేయూ స్నాతకోత్సవ వివరాలను గవర్నర్‌కు వివరించారు. జూలై మొదటి వారంలో వీలునుబట్టి చెబితే స్నాతకోత్సవాన్ని నిర్వహించుకుంటామని గవర్నర్‌కు విన్నవించారు. దీనికి రాష్ట్ర గవర్నర్ సానుకూలంగా స్పందించినట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు.

ఇదిలా ఉండగా, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ షెడ్యూల్ మేరకు గురువారం కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం నేతృత్వంలో స్నాతకోత్సవాన్ని నిర్వహించే కేయూ ఆడిటోరియాన్ని పరిశీలించారు. స్నాతకోత్సవ నిర్వహణకు కావాల్సిన మౌలిక సదుపాయలు, ఏసీలు, కుర్చీలు, బాత్‌రూమ్‌లు, తాగునీటి సౌకర్యంతోపాటు ఇతర సౌకర్యాలను పరిశీలించారు. స్నాతకోత్సవం వైభవంగా నిర్వహించేలా చూడాలని, అతిథులతో పాటు స్నాతకోత్సవానికి రానున్న విద్యార్థులకు, డాక్టరేట్లు అందుకునే అభ్యర్థులందరికీ ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు వహించాలని వీసీ ప్రతాప్‌రెడ్డి సూచించారు. 900మంది డాక్టరేట్ అభ్యర్థులతో పాటు, వివిధ విభాగాల్లో బంగారు పతకాలు అందుకునే అభ్యర్థులు, వారితో పాటు మరో 300మంది సిబ్బంది, స్నాతకోత్సవానికి హాజరుకానున్న అభ్యర్థుల కుటుంబ సభ్యులుంటారని అంచనాలు వేశారు. మార్చ్‌ఫాస్ట్, కాన్వకేషన్ డిక్లరేషన్ సంతకాలు, అతిథుల ఫొటో సెషన్ తదితర అంశాలను పకడ్బందీగా చర్చించి సన్నాహక ఏర్పాట్లను చూశారు. స్నాతకోత్సవ సమయంలో అనుకోకుండా విద్యుత్ అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై కసరత్తు చేశారు.

ఈ కార్యక్రమంలో దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఈసీ మెంబర్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, ఓఎస్‌డీ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, డీవో ప్రొఫెసర్ ఎస్.వాసుదేవారెడ్డి, తెలుగు విభాగాధిపతి డాక్టర్ మామిడి లింగయ్య, రాజనీతిశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్, జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ సంగాని మల్లేశ్వర్‌తో పాటు వివిధ విభాగాల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన గురుకుల కాలేజీ ప్రిన్సిపాల్ సస్పెన్షన్

● ముగ్గురు లెక్చరర్ల డిప్యుటేషన్లూ రద్దు ● అవతవకలపై విచారణ చేసి చర్యలు తీసుకున్న సెక్రెటరీ

హనుమకొండ, మే 15 (ఆంధ్రజ్యోతి): వరంగల్ యాకుత్‌పురలోని తెలంగాణ గిరిజన సంక్షేమ అప్‌గ్రేడెడ్ గురుకుల బాలుర జూనియర్ కళాశాల (టీజీడబ్ల్యుఆర్‌జేసీ) ప్రిన్సిపాల్ జి.రామ్మోహన్ సస్పెండ్ అయ్యారు. ఇదే క్రమంలో ఈకళాశాలలోనే పనిచేస్తున్న ముగ్గురు లెక్చరర్ల డిప్యూటేషన్లు కూడా రద్దయ్యాయి. రామోహ్మన్ స్థానంలో కొత్త ప్రిన్సిపాల్‌గా ఇదే కళాశాలలో పనిచేస్తున్న మధును నియమించారు. కళాశాల నిర్వహణలో పర్యవేక్షణ లోపం, నిధుల దుర్వినియోగం, ఇతర అవకతవకల కారణంగా రామ్మోహన్‌పై ఈ వేటు పడింది. తెలంగాణ గిరిజన సంక్షేమ ఆశ్రమ విద్యా సంస్థల సొసైటీ (గురుకుల) సెక్రెటరీ కె.సీతాలక్ష్మి ఈ మేరకు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు.

నిధుల దుర్వినియోగం

ప్రిన్సిపాల్ రామ్మోహన్ విధులకు సరిగా హాజరుకావడం లేదని, కళాశాల నిర్వహణలో అవకతవకలతో పాటు నిధుల దుర్వినియోగం జరుగుతున్నదని గత నెల లంబాడ హక్కుల పోరాట సమితి చేసిన ఫిర్యాదు మేరకు విజిలెన్స్ అధికారితో పాటు మరో ఇద్దరు టీజీటీడబ్ల్యుఆర్‌ఈఐ అధికారులు విచారణ జరిపి నివేదిక సమర్పించారు. ప్రిన్సిపాల్ విధులకు హాజరుకావడం లేదని, కాలేజీని పరిశుభ్రంగా ఉంచడం లేదని, కళాశాల ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించినట్లు ఖర్చు చూపించినా వాస్తవానికి అలాంటిదేమీ జరగలేదని, కళాశాల పర్యవేక్షణ సరిగా లేదని, హాజరుపట్టిలో చూపించినదానికన్నా విద్యార్థుల హాజరు తక్కువగా ఉందని, విద్యార్థుల అభ్యసనాన్ని సరిగా పట్టించుకోలేదని, సిబ్బందితో సమన్వయం లేదని, మెనూ సరిగా పాటించడం లేదని, నిధుల దుర్వినియోగం జరుగుతున్నదని, అధ్యాపకులు పాఠాలు చెప్పకపోయినా పెద్దగా పట్టించుకోవడం లేదని తదితర అవతకవకలను విచారణ నివేదికలో అధికారులు పేర్కొన్నారు. దీంతో రామ్మోహన్‌ను సస్పెండ్ చేస్తూ గత నెల 30న సెక్రెటరీ సీతాలక్ష్మీ ఉత్తర్వులు జారీ చేశారు. రామ్మోహన్ స్థానంలో ఇదే కళాశాలలో పని చేస్తున్న బోటనీ జూనియర్ లెక్చరర్ మధును ప్రిన్సిపాల్‌గా పూర్తి అదనపు బాధ్యతలతో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

డిప్యుటేషన్లు రద్దు

కళాశాల ప్రిన్సిపాల్ సస్పెండ్ అయిన క్రమంలోనే ఇక్కడే పని చేస్తున్న ముగ్గురు జూనియర్ లెక్చరర్లపై కూడా వేటు పడింది. వారి డిప్యూటేషన్లు గురుకులం సెక్రెటరీ రద్దు చేశారు. గణితం జేఎల్ సతీష్‌కుమార్ గుండాలలోని టీజీటీడబ్ల్యుఆర్‌జేసీ (బాలుర)కు, ఇంగ్లీష్ జేఎల్ కేబీజీ తిలక్‌ను ఖమ్మం టీజీటీడబ్ల్యుయుఆర్‌జేఎస్‌ఓఈ (బాలుర)కు, తెలుగు పీజీటీ ఎ.మహేశ్వరిని కొత్తగూడెం టీజీటీడబ్ల్యుయుఆర్‌జేసీ (బాలికలు)కు తిప్పి పంపించారు.

'సరస్వతీ' సంరంభం.. ఆరంభం

పుష్కర శోభితమైన కాళేశ్వరం త్రివేణి సంగమం

అద్భుత ఘట్టాన్ని ప్రారంభించిన మాధవానంద సరస్వతి
పుణ్య స్నానాలాచరించిన సీఎం, మంత్రులు
ఆధ్యాత్మికతతో అలరారుతున్న ముక్తీశ్వర క్షేత్రం

కాళేశ్వరం, మే 15 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళేశ్వర-ముక్తీశ్వరాలయ సన్నిధిలోని త్రివేణి సంగమంలో సరస్వతీ పుష్కర సంరంభం గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో తొలి సారి అధికారికంగా భారీ ఎత్తున 12రోజుల పాటు జరిగే అంతర్వాహిని సరస్వతీ నది పుష్కరాల అద్భుత ఘట్టం అరుణోదయ వేళ ఆవిష్కృతమైంది. కాళేశ్వర త్రివేణి సంగమంలో పన్నెండు రోజులపాటు సాగే సరస్వతీ పుష్కరాలను గురువారం ఉదయం 5.44గంటలకు బృహస్పతి మిధున రాశిలో ప్రవేశించిన అనంతరం ప్రధాన పుష్కర ఘాట్‌లో శ్రీ గురుమదనానంద సరస్వతీ పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామీజీ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ దంపతులు ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, వందలాది మంది భక్తుల సమక్షంలో త్రివేణి సంగమంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సరస్వతీ పుష్కరాలను లాంచనంగా ప్రారంభించారు. తెల్లవారుజామున 5.14గంటలకు కాళేశ్వర-ముక్తీశ్వర ఆలయం నుంచి మాధవానందసరస్వతి స్వామీజీ, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దంపతులు, దేవాదాయశాఖ కమిషనర్ వెంకట్రావు, ఆలయ అధికారులు, వేదపండితులు, ఆలయ అర్చకులు, భక్తులతో కలిసి మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల మధ్య త్రివేణిసంగమానికి వెళ్లి నదీమాతకు చీర , సారె, పసుపు, కంకుమ, పూలు, పండ్లు, పంచామృతాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేకపూజలతో పుష్కరాలను ప్రారంభించారు. నదిలో పుష్కరస్నానం చేసిన అనంతరం ప్రత్యేక కలశంలో త్రివేణి సంగమ జలాలను పట్టుకుని ఆలయానికి వచ్చి కాళేశ్వర- ముక్తీశ్వర స్వామికి మహన్యాసపూర్వక మహారుద్రాభిషేకం చేశారు. అనంతరం శుభానందదేవి, ప్రౌడ సరస్వతి మాత ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేదపండితులు, అధికారులు మాధవానంద సరస్వతి, మంత్రి శ్రీధర్‌బాబు దంపతులను, హైకోర్టు జడ్జి సూరపల్లి నందలను స్వామి శేషవస్త్రాలతో సత్కరించారు.

పుష్కర శోభతో విలసిల్లుతున్న కాళేశ్వరం

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత తొలిసారిగా జరగనున్న సరస్వతీ పుష్కరాల కోసం ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. పుష్కరాలను అంగరంగ వైభవంగా జరపడానికి విస్తృత ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వం రూ.40కోట్ల నిధులు మంజూరు చేయడంతో పలు పనులు చేపట్టారు. రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పుష్కరాల వేడుకలను ఘనంగా జరుపుకొనేలా పలుమార్లు సమీక్షలు చేసి క్షేత్రస్థాయిలో పర్యటించడంతో కాళేశ్వరాలయానికి, త్రివేణి సంగమానికి పుష్కర శోభ సంతరించుకుంది. ప్రధాన పుష్కరఘాట్‌లో నదిలోకి వెళ్లి పుణ్యస్నానాలు ఆచరించడానికి ఇబ్బందులు పడే భక్తుల కోసం జల్లు స్నానం చేసేలా షవర్లు ఏర్పాటు చేశారు. ప్రధాన ఘాట్‌పై సరస్వతీమాత విగ్రహం, జ్ఞానజ్యోతి తీర్థం ఏర్పాటు చేయడంతో భక్తులకు ఆధ్యాత్మిక ఆనందం కలగనుంది. ఎండల నుంచి భక్తులు సేదతీరేందుకు చలువపందిళ్లు ఏర్పాటు చేయగా భక్తుల వసతి కోసం టెంట్‌సిటీ నిర్మాణం చేశారు. శ్రీకాళేశ్వర-ముక్తీశ్వర ఆలయం ఆవరణలో పుష్కర శోభ సంతరించుకుంది. విద్యుత్ కాంతుల వెలుగులు నేత్రపర్వంగా మారింది. కాళేశ్వరంలో పుష్కరాల వేడుకలకు సంబంధించి, సీఎం రేవంత్‌రెడ్డి స్వాగతం కోసం ఏర్పాటు చేసిన పలు భారీ ఫ్లెక్సీలు కనిపిస్తున్నాయి. పుష్కరాలు జరిగే 1 2రోజుల పాటు హోమాలు నిర్వహించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. సరస్వతి పుష్కరాలను సమర్థవంతంగా, వైభవంగా జరపడానికి వేలాదిగా తరలివచ్చే భక్తులకు సౌకర్యాల కల్పనకు, ఇబ్బందులు లేకుండా చేయడానికి 19శాఖలకు చెందిన వేలాదిమంది అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారు.

పటిష్ఠ బందోబస్తు

పుష్కరాల తొలిరోజు సాయంత్రం జరిగిన కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి పాల్గొంటుండంతో పోలీసు, ఇతర శాఖల అధికారులు పటిష్ఠ ఏర్పాట్లు చేశారు. వేలాదిమంది పాల్గొనే అద్భుత ఘట్టంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన గంటలపాటు సాగనుండడంతో అధికారులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి నేతృత్వంలో పలువురు ఐపీఎస్‌లు, 3,500మంది పోలీస్ అధికారులు, సిబ్బంది సీఎంతో పాటు భక్తులకు ఇబ్బంది లేకుండా బందోబస్తు చర్యలు చేపడుతున్నారు.

వైభవంగా నవరత్న హారతి

తొమ్మిది రకాల హారతులను ఇచ్చిన కాశీ పండితులు

సరస్వతీ పుష్కరాలను పురస్కరించుకుని కాళేశ్వర త్రివేణి సంగమంలో గురువారం రాత్రి 8 గంటలకు ఏడుగురు కాశీపండితుల ఆధ్వర్యంలో నవరత్న హరతి కార్యక్రమాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. కాశీ గంగానది వద్ద నిర్వహించినట్టుగా కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద ఈ హారతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సమాజ హితం కోసం పలు రకాలుగా దోహదపడే విధంగా 12రోజుల పాటు నవరత్న హారతిని నిర్వహించడానికి దేవదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆధ్యాత్మిక సంగీతంతో ఓంకార, నాగ, పంచ, సూర్య, చంద్ర, నంది, సింహ, కుంభ, నక్షత్ర హారతుల తో కూడిన నవరత్న హారతిని పండితులు నదీమతల్లికి సమర్పించారు. ఓంకార హరతీని సర్వదోష నివారిణిగా, నాగహారతిని సర్పదోష పోగొట్టడానికి, పంచహారతిని ఆరోగ్యంగా ఉండేలా దీర్ఘాయుష్మ కోసం, సూర్యహారతీని రోగాలను నివారించడానికి, చంద్రహారతిని పాడిపంటలను మనశ్శాంతిని అందించడానికి, నంది హారతీని ధర్మబుద్ధి, శక్తిని, విద్యాబుద్ధిని అందించడానికి, సింహ హారతీని నాయకత్వ పటిమ, ధైర్యాన్ని ఇవ్వడానికి, కుంభహారతిని సంపదలు ఇవ్వడానికి, నక్షత్ర హారతిని నిర్మలమైన మనస్సును అందించడానికి ఏర్పాట్లు చేసినట్లు పండితులు, అధికారులు వెల్లడించారు. సుమారు గంటపాటు నిర్వహించిన నవరత్న హరతీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండ సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్‌లు ఆదిశ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు విజయరమణరావు, మక్కాన్ సింగ్ ఠాకూర్, నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు, ఐజీలు చంద్రశేఖర్ రెడ్డి, కార్తికేయ, టూరిజం ఎండీ ప్రకాశ్ రెడ్డి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజరామయ్యర్, కమిషనర్ వెంకట్రావులతో పాటు పలువురు ప్రముఖులు వీక్షించారు.

పుష్కర ఘాట్ వద్ద గజ ఈతగాళ్లు


నదిలో గస్తీ కాస్తున్న గజ ఈతగాళ్లు

కాళేశ్వరం, మే 15 (ఆంధ్రజ్యోతి) : సరస్వతి పుష్కరాల్లో భాగంగా పుష్కర ఘాట్ వద్ద ఎలాంటి ప్రమాదం జరగకుండా గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. మహాదేవపూర్, కాళేశ్వరానికి చెందిన సుమారు 50 మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. ఎన్డీఆర్ఎఫ్, వీరు రెండు విడుతలుగా అందుబాటులో ఉండనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే నదిలో భక్తులు లోతుకు వెళ్లకుండా మరో బృందం గస్తీ తిరుగుతూ భక్తులను అప్రమత్తం చేస్తున్నారు.


పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

తొలిరోజు సుమారు 20 వేల మంది రాక..

కాళేశ్వరం, మే 15(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం త్రివేణి సంగమం పుష్కరాల్లో తొలిరోజు సుమారు 20వేలకు పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారని అంచనా. సీఎం రాక సందర్భంగా కొద్ది సేపు అంతరాయం కలిగినా తిరిగి భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. గురువారం ఉదయం 5.44 గంటలకు ప్రారంభమైన పుష్కరస్నానాలు రాత్రి వరకు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ పుష్కర స్నానాల్లో వేద పండితులు 600 మంది వేద పండితులు పాల్గొన్నారు.


పుష్కరిణికి నమస్కరిస్తున్న భక్తురాలు




నవరత్న హారతి వేడుకను తిలకిస్తున్న భక్తులు


కాళేశ్వరాలయంలో భక్తుల క్యూ


మాధవానంద సరస్వతితో మాట్లాడుతున్న సీఎం


ముక్తీశ్వరుడి దర్శనానికి వచ్చిన భక్తులను అదుపు చేస్తున్న పోలీసులు



కాళేశ్వరాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

గ్రీన్ చానల్ ద్వారా రూ.200 కోట్లు కేటాయిస్తాం..

వచ్చే గోదావరి, కృష్ణ పుష్కరాలను ఘనంగా నిర్వహిస్తాం
నాడు పీవీ.. నేడు శ్రీధర్‌బాబు అభివృద్ధిలో కీలకం
సరస్వతి పుష్కర వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి


ప్రసంగిస్తున్న రేవంత్‌రెడ్డి

కాళేశ్వరం, మే 15 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న కాళేశ్వరాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని, ఇందుకోసం ఎన్ని నిధులైనా మంజూరు చేస్తామని, వెంటనే మాస్టర్ ప్లాన్ రూపొందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సరస్వతి పుష్కరాల తొలిరోజు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు గురువారం సాయంత్రం కాళేశ్వరం వచ్చిన ఆయన.. త్రివేణి సంగమం వద్ద పుష్కరిణిలో స్నానమాచరించారు. అనంతరం అక్కడ సరస్వతి మాత విగ్రహాన్ని ఆవిష్కరించి, కాళేశ్వర ముక్తీశ్వరుడిని దర్శించుకుని, నవరత్న హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సరస్వతి ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. కాళేశ్వరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు మంత్రి శ్రీధర్‌బాబు రూ.100కోట్లు అడిగారని, కానీ వచ్చే గోదావరి పుష్కరాలను మరింత ఘనంగా నిర్వహించడం కోసం రూ.200 కోట్లయినా గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు ఇచ్చి అభివృద్ధి చేస్తామన్నారు. అధికారులు వెంటనే మాస్టర్ ప్లాన్ తయారుచేసి సమర్పించాలని ఆదేశించారు. గోదావరి ఈ ప్రాంతానికి ఆశీర్వాదం లాంటిదని, మంచి తపనతో ముందుకెళ్లాలన్న ఉద్దేశ్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం సరస్వతీ పుష్కరాలను ఘనంగా నిర్వహించాలని తలపెట్టిందన్నారు. దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి శైలజారామయ్యర్‌తో పాటు ఇతర అధికారులు అనుకున్న దానికంటే అద్భుతంగా పనిచేశారని ప్రశంసించారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత సరస్వతీ పుష్కరాలతో పాటు గోదావరి, కృష్ణ, సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహించే అవకాశం రావడం తనకు దక్కిన అదృష్టమన్నారు. ఒకప్పుడు దేశ ఆర్థిక గతిని మార్చడంలో కీలక పాత్ర పోషించిన పీవీ నరసింహారావు లాగే ప్రస్తుతం తాము అధికార్మాలోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి రూ.3లక్షలకోట్ల పెట్టుబడులు తేవడంలో మంత్రి శ్రీధర్‌బాబు తనకు చేదోడు వాదోడుగా ఉన్నారని, ఆయన ఈ ప్రాంతం వ్యక్తి కావడం అదృష్టమన్నారు. దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ గతంలో ఆంధ్రాకే పరిమితమైన పుష్కరాలను తెలంగాణలో కూడా ఘనంగా నిర్వహించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం సరస్వతీ పుష్కరాలను నిర్వహిస్తోందని, అధికారులు అనుకున్న దానికంటే అద్భుతంగా సదుపాయాలు కల్పించారని ప్రశంసించారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజల ఆకాంక్షలను గ్రహించి అందుకు అనుగుణంగా సాధ్యమైనంత మేరకు కార్యక్రమాల అమలు చేస్తుందన్నారు. కార్యక్రమం అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి రోడ్డు మార్గం ద్వారా హైదరాబాద్ బయల్దూదేరారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసినా సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను కనివిందుచేశాయి. అంతేకాకుండా టపాసుల మోతలతో కాళేశ్వరం మార్మోగింది.

ప్రత్యేక పూజలు చేసిన సీఎం

పుణ్యస్నానం, సరస్వతీ మాత విగ్రహా ఆవిష్కరణ అనంతరం సీఎం రేవంత్ రెడ్డి కాళేశ్వర, ముక్తీశ్వర ఆలయంలో మహాదేవుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయవేద పండితులు, అర్చకులు వేద మంత్రోచ్చరణల నడుమ పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు,పూజలు చేశారు. అనంతరం శుభానంద దేవి ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ ముఖ్యమంత్రితో పాటు ఇతర మంత్రులను పట్టువస్త్రాలతో సత్కరించారు.

సీఎం పర్యటన సాగిందిలా..

సీఎం రేవంత్‌రెడ్డి అనుకున్న సమయానికి అరగంట ఆలస్యంగా కాళేశ్వరం చేరుకున్నారు. గురువారం సాయంత్రం 4.12గంటలకు హెలికాప్టర్‌లో కాళేశ్వరం చేరుకున్న ఆయన 4.17గంటలకు టెంట్ సిటీకి చేరుకుని.. 5.32గంటల వరకు విశ్రాంతి తీసుకున్నారు. 5.36గంటలకు సరస్వతీ పుష్కరఘాట్‌కు చేరుకుని అక్కడ నెలకొల్పిన 15 అడుగుల సరస్వతీ మాత ఏకశిల విగ్రహాన్ని ఆవిష్కరించారు. 5.50 గంటలకు త్రివేణీ సంగమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి పవిత్ర స్నానమాచరించి.. 6గంటలకు సారె సమర్పించారు. 6.45గంటలకు ఆలయానికి చేరకున్న సీఎంకు అధికారుల పూర్ణకుంభ స్వాగతం పలికారు. రాత్రి 7.29గంటల వరకు ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేసిన ఆయన 7.35గంటలకు సరస్వతీఘాట్‌కు చేరుకుని ప్రసంగించారు. అనంతరం 8గంటలకు నవరత్న హారతిని ప్రారంభించి.. 9గంటల వరకు కార్యక్రమాన్ని వీక్షించారు. 9.03గంటలకు కాళేశ్వరం నుంచి రోడ్డుమార్గాన కాన్వాయ్‌లో హైదరాబాద్ తిరుగుపయనమయ్యారు.

సీఎం పర్యటనలో సమన్వయలోపం

పుష్కర ఏర్పాట్లలో అధికార యంత్రాంగం విఫలం




సీఎంతో కరచాలనం చేస్తున్న స్థానిక నాయకులు

కాళేశ్వరం, మే 15 (ఆంధ్రజ్యోతి) : సరస్వతీ పుష్కరాల నిర్వహణలో అధికారుల సమన్వయలోపం మరోసారి బయటపడింది. సాయంత్రం 4.12గంటలకు కాళేశ్వరం చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేరుగా పుష్కరఘాట్ వద్ద ఏర్పాటు చేసిన టెంట్‌సిటీకి చేరుకున్నారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్న గుడారంలో నీటి కొరత ఏర్పడింది. నీటి కొరతతో పాటు గుడారంలో కొద్ది సేపు ఏసీ పనిచేయలేదు. ఒక్కసారిగా అధికారులంతా హైరాన పడ్డారు. టెంట్ నిర్వాహకులను పిలిచి మందలించారు. వెంటనే మళ్లీ ఏసీని అందుబాటులోకి తీసుకొచ్చారు.

రెండు వాహనాలు ఒకదానికొకటి తాకి..

టెంట్ సిటీ నుంచి పుష్కరఘాట్‌కు వెళ్తున్న సందర్భంలో దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజరామయ్యర్ వాహనాన్ని సీఎం కాన్వాయ్‌లోని ఒక వాహనం ఢీకొట్టింది. ఈఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగనప్పటికి వాహనం కొద్దిగా డ్యామేజీ అయ్యింది.

తాగునీటి కోసం తండ్లాట

ముఖ్యమంత్రి టెంట్‌సిటీకి చేరుకున్న సమయంలో ఆప్రాంతంలో తాగునీటికి అధికారులు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. దీంతో అక్కడున్నవారంతా తాగునీటికోసం ఇబ్బందులు పడ్డారు. కొద్దిసేపటికి వాటర్ బాటిళ్లు తీసుకువచ్చినప్పటికి అవి వేడిగా ఉండడంతో తాగలేకపోయారు. దీనిపై నిఘావర్గాల అధికారులు సంబంధిత అధికారులకు సూచించినా పట్టించుకోలేదనే విమర్శలు వచ్చాయి. కేవలం పుష్కరాల ఏర్పాట్లకు మాత్రమే అధికార యంత్రాంగం ప్రాధాన్యమిచ్చిందని.. మౌలిక వసతులైన తాగునీటితో పాటు ఎలాంటి ఇతర ఏర్పాట్లు చేయలేదని అక్కడున్నవారు చర్చించుకోవడం కనిపించింది.

స్థానిక నాయకులను ముఖ్యమంత్రికి పరిచయం చేసిన మంత్రి

టెంట్ సిటీలో సేదతీరిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిరిగి పుష్కరఘాట్‌కు వెళ్తున్న సమయంలో స్థానిక నాయకులు ముఖ్యమంత్రితో సెల్ఫీలు దిగారు. మంత్రి శ్రీధర్‌బాబు దగ్గరుండి స్థానిక నాయకులను ముఖ్యమంత్రికి పరిచయం చేస్తూ కరచాలనం చేయించారు. అనంతరం ముఖ్యమంత్రి పుష్కరఘాట్‌కు వెళ్లారు.

పోలీసుల ఓవర్‌యాక్షన్

ప్రధాన ఆలయం వద్ద విధుల్లో ఉన్న పలువురు పోలీసులు సాధారణ భక్తులు దర్శనాలకు వెళ్ళకుండా అడ్డుకోవడంతో భక్తులు, పోలీసులతో మధ్య వాగ్వివాదం ఏర్పడింది. పోలీసులు తమకు సంబంధించిన వారిని దర్శనాలకు పంపిస్తూ.. సాధారణ భక్తులను అడ్డుకోవడంతో పలువురు భక్తులు పోలీసుల తీరుపై అగ్రహం వ్యక్తం చేశారు.

అధికారుల సమన్వయలోపం.. భక్తులకు శాపం

సరస్వతి నదీమాత పుష్కరాల నేపథ్యంలో అధికారుల సమన్వయలోపం భక్తులకు శాపంగా మారింది. దేవాదాయ, పోలీసు శాఖల అధికారులు ప్రధాన ఆలయానికి తాళాలు వేసి ఇబ్బందులకు గురిచేశారు. సీఎం పర్యటన నేపథ్యంలో భద్రతా దృష్ట్యా ఆలయ పరిసరాలను తమ ఆధీనంలోకి తీసుకున్నా మని పోలీసులు ఆలయంలో పనిచేసే అర్చకులను సైతం బయటకు పంపించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దర్శనాలకు వచ్చిన వీఐపీ భక్తులను నేరుగా ఆలయంలోకి పంపించకుండా గుడిచుట్టూ ప్రదక్షిణాల తిప్పి చివరకు ఆలయంలోకి పంపించడం చర్చనీయాంశంగా మారింది.

పుష్కర స్నానం.. ఫుల్ కుష్

కాళేశ్వరం, మే 15 (ఆంధ్రజ్యోతి): త్రివేణి సంగమమైన సరస్వతీ పుష్కరనదిలో కుటుంబసమేతంగా వస్తున్న భక్తులు ఫుల్ కుషీగా పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. ముఖ్యంగా పిల్లలు కేరింతలు కొడుతూ.. ఒకరిపై ఒకరు నీరు చల్లుకుంటూ అల్లరి చేస్తున్నారు. రాష్ట్ర రాజధాని నుంచి ఓకే కుటుంబానికి చెందిన 20 మంది పుష్కర స్నానం ఆచరించారు. పుష్కరాల ఏర్పాట్ల పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు.


నదిలో కేరింతలు కొడుతున్న చిన్నారులు


పుష్కర స్నానం ఆచరిస్తున్న ఓ కుటుంబం


పుష్కర ఏర్పాట్లతో కళకళలాడుతున్న కాళేశ్వరంలోని సంగమ తీరం


పుష్కరాల సందర్భంగా త్రివేణి సంగమ తీరం బాణసంచా వెలుగు జిలుగులు

శిక్షణ సామర్థ్యాన్ని పెంచుతుంది : కలెక్టర్

వరంగల్ ఎడ్యుకేషన్, మే 15 (ఆంధ్రజ్యోతి): శిక్షణలు ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని పెంచుతాయని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. హనుమకొండ జిల్లాలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణను జిల్లా కలెక్టర్ గురువారం పరిశీలించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ఉపాధ్యాయులందరూ అధునాతన బోధన పద్ధతులతో పాటు, 21వ శతాబ్దపు బోధన మెళకువలను కలిగి ఉండాలని, దాని కోసం శిక్షణ అవసరమన్నారు. ప్రతీ ఉపాధ్యాయుడు ఇంటర్ యాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్‌ను ఉపయోగించి బోధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈవో వాసంతి, గుణాత్మక విద్య సమన్వయకుడు ఎ.శ్రీనివాస్, బద్దం సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య


సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాయిని, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- 10వ డివిజన్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

హనుమకొండ చౌరస్తా, మే 15 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పశ్చిమ నియోజవర్గ అభివృద్ధే తన ధ్యేయం అని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం హనుమకొండ 10డివిజన్ కాపువాడ వెంకటేశ్వర ఆలయం సమీపం నుంచి టీపీటీ పాఠశాల వరకు 15వ ఆర్థిక సంఘం రూ. 25 లక్షల నిధులతో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ఎమ్మెల్యే నాయిని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతీ డివిజన్, కాలనీలలో దీర్ఘకాలికంగా పేరుకుపోయిన సమస్యలను తన దృష్టికి తీసుకవస్తే త్వరితగతిన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిన డివిజన్‌లో ప్రభుత్వ భవనాన్ని కూల్చి వేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీచేశారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్, 10వ డివిజన్ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, మాజీ కార్పొరేటర్ నాసిమ్‌జాన్, కాంగ్రెస్ నాయకులు కుమార్‌యాదవ్, బొంత రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో స్విమ్మింగ్ పూల్

- రూ.3కోట్ల బల్దియా నిధులతో నిర్మాణం
- 2 మాసాల్లో ప్రజలకు అందుబాటులోకి..

వరంగల్ కార్పొరేషన్, మే 15 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగర ప్రజల ఆహ్లాదం, ఆనందం కోసం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ అధునాతన స్విమ్మింగ్ పూల్‌ను నిర్మిచేందుకు శ్రీకారం చుట్టింది. మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ప్రత్యేక శద్ధతో హైటెక్ హంగులతో ఈత కొలను నిర్మిస్తున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న ఈత కొలనుతో పాటు పక్కనే డ్రెస్సింగ్ రూమ్, మల్టీ జిమ్‌ను నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. బల్దియా ప్రధాన కార్యాలయం వెనుక ఇండోర్ స్టేడియంను ఆనుకుని నిర్మిస్తున్న స్విమ్మింగ్ పూల్ పనులను ఆక్వా టెక్నిక్ హైదరాబాద్ సంస్థ చేపట్టింది.


బల్దియా కార్యాలయం ఆవరణలో నిర్మిస్తున్న స్విమ్మింగ్ పూల్

రూ.3కోట్లతో పనులకు శ్రీకారం

బల్దియా కార్యాలయం ఆవరణలో 20 గుంటల స్థలంలో పూల్ నిర్మాణానికి ప్రణాళికలు వేశారు. వెంటనే బల్దియా నిధుల నుంచి కేటాయించారు. టెండర్లు పిలవగా హైదరాబాద్‌కు చెందిన ఆక్వాటెక్నిక్ అనే సంస్థ పనులను దక్కించుకుంది. ఈఈ రవికుమార్, డీఈ రాజ్‌కుమార్, ఏఈ రాగి శ్రీకాంత్‌ల పర్యవేక్షణలో పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. పూల్ నిర్మాణంలో పాటు ఎలక్ట్రికల్, ప్లంబింగ్, ఫిల్టరైజేషన్ ఎక్విప్‌మెంట్, క్లోరిన్‌గ్యాస్ భద్రత గది, డెస్సింగ్ రూమ్, మల్టీజిమ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మరో రెండు మాసాల్లో ప్రజలకు అందుబాటులో స్విమ్మింగ్ పూల్ వస్తుందని అధికారులు చెబుతున్నారు.

అందరికి అందుబాటులో స్విమ్మింగ్ పూల్


అశ్విని తానాజీ వాకడే, బల్దియా కమిషనర్

వరంగల్ నగర ప్రజలకు అందుబాటులో ఉండేందుకు రాష్ట్ర మంత్రులు, మేయర్ గుండు సుధారాణి ఆదేశాల మేరకు అంతర్జాతీయ ప్రమాణాలతో బల్దియా ఆవరణలో స్విమ్మింగ్ పూల్ నిర్మిస్తున్నాం. సామాన్య ప్రజలకు తక్కువ ఫీజుతో ఇక్కడ ఈత నేర్చుకోవచ్చు.

డిసిల్టేషన్ పనులు సమన్వయంతో చేయాలి

శానిటేషన్ అధికారులతో మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, మే 15 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శానిటేషన్ అధికారులు సమన్వయంతో డిసిల్టేషన్ పనుల ప్రక్రియ చేపట్టాలని మేయర్ గుండు సుధారాణి కోరారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలో శానిటేషన్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి తగు సూచనలు చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముంపు ప్రాంతాలు వరద నీటికి గురికాకుండా ఉండేందుకు ముందస్తుగా శానిటేషన్ పనులు పూర్తి చేయాలన్నారు. కాలనీలలో పాటు మెయిన్ రోడ్లపై స్పెషల్ డ్రైవ్ ద్వారా పనులు చేపట్టాలని చెప్పారు. 66 డివిజన్ పరిధిలోని 350 అంతర్గత డ్రైన్‌ల ద్వారా తీసిన మట్టికుప్పలను వెంటనే అక్కడి నుంచి తొలగించాలన్నారు. ఇంజనీరింగ్ అధికారులను సమన్వయం చేసుకుని శానిటేషన్ పనులు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ జోనా, సీఎం హెచ్‌వో డాక్టర్ రాజిరెడ్డి, ఇన్‌చార్జ్ సీపీ రవీందర్ రాడేకర్, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఏసీపీ రజిత, టీపీఎస్ ఇర్షాద్‌ఖాన్, శానిటరి సూపర్‌వైజర్ నరేంద్రవర్మ తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంగనర్, మే 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కేయూసీ సబ్‌స్టేషన్ పరిధిలోని కుడా కాలనీ, వాజ్‌పేయి కాలనీ, వికాస్‌నగర్, ప్రెసిడెన్సీ స్కూల్ ఏరియా, శ్రీకృష్ణ కాలనీ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, వడ్డెపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో పరిమళకాలనీ, సప్తగిరి కాలనీ, ఆర్టీసీ కాలనీ, పూరిగుట్ట, పోలీస్ కాలనీ ఏరియాలో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు, నక్కలగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలో నక్కలగుట్ట వాటర్ ట్యాంక్ బ్యాక్‌సైడ్, వినాయకనగర్, సర్క్యూట్ హౌస్‌రోడ్డు, కోర్టు బ్యాక్‌సైడ్ ఏరియా, కేఎల్‌ఎన్ రెడ్డి కాలనీ ఏరియాలో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు, కేయూసీ సబ్‌స్టేషన్ పరిధిలో నయీంనగర్, రంగ్‌బార్ ఏరియా, రాజాజీనగర్ ఏరియాలో ఉదయం 9 గంటల 10 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ తెలిపారు.

అమృత్‌ను పారదర్శకంగా నిర్వహించాలి

కమిషనర్లకు సీడీఎంఏ శ్రీదేవి సూచన

వరంగల్ కార్పొరేషన్, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే అమృత్ పనులు, యూఐడీఎఫ్ ప్రతిపాదనలపై రాష్ట్ర సీడీఎంఏ డాక్టర్ శ్రీదేవి రాష్ట్రంలోని మున్సిపల్ కమిషనర్లు, అధికారులతో కలిసి వర్చువల్ సమావేశాన్ని నిర్వహించారు. అమృత్ (అటల్ విషన్ ఫర్ రిజువెనేషన్, అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్), పనుల పురోగతిపై జూమ్ మీటింగ్ ద్వారా సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న అమృత్ ప్రాజెక్ట్ పురోగతిపై సంబంధిత కమిషనర్‌లను అడిగి తెలుసుకున్నారు. అమృత్ పనులు జిల్లాల వారిగా పారదర్శకంగా నిర్వహించాలని శ్రీదేవి సూచించారు. నగరాల్లో ఈ పథకం విజయవంతం కావడానికి సమన్వయ పూరిత ప్రణాళిక, సమయానుకూల నిర్వహణ, పారదర్శకత కీలకమన్నారు. రాష్ట్ర పట్టణ రూపాంతర లక్ష్యాల సాధనలో భాగస్వాములై అందరు కలిసికట్టుగా పని చేయాలని అన్నారు. వరంగల్ నగర పాలక సంస్థ నుంచి కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సీడీఎంతో మాట్లాడారు. ఇక్కడి స్థితిగతులపై వివరించారు.


వీసీలో సూచనలిస్తున్న సీడీఎంఏ శ్రీదేవి, పాల్గొన్న కమిషనర్ అశ్విని

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆల్ ట్రేడ్ యూనియన్ల నాయకులు

వరంగల్ మెడికల్, మే 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఇందిరా పార్కులో ఈనెల 20న నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని ఎన్‌హెచ్‌ఎం ఆల్ క్యాడర్స్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్‌ఖన్నా, ఏఐటీ యూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేశ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి పిలుపునిచ్చారు. గురువారం ఎంజీ ఎం ఆవరణలో సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నందున సమ్మె నిర్వ హిస్తున్నట్లు పేర్కొన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉద్యోగులకు కనీస వేతనాలు పెంపుదల చేయలేదని తెలిపారు. దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం ఆస్పత్రి ఉద్యోగులు రోహిణి, సింధూజ, ఆర్.భాగ్యలక్ష్మి, ఎం.కోమల, సంధ్య, వసంతరావు, ఆశ కార్యకర్త రాణి, ఏఐటీయూసీ నాయకుడు ఎండీ యాకూబ్, ఐతం నగేష్, సీఐటీయూ నాయకుడు మహబూబ్ పాషా పాల్గొన్నారు.

20న జరిగే సమ్మెకు మా మద్దతు లేదు..

రాంనగర్: ఈ నెల 20న కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన సమ్మెకు మద్దతు ఇవ్వడం లేదని అఖిల భారత విద్యుత్ మజ్దూర్ మహాసంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు మన్నె శశికుమార్ స్పష్టం చేశారు. దేశంలో అమలులో ఉన్న 29 కార్మికచట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం 4 కొత్త కార్మికచట్టాలను రూపొందించిందని, వాటిలో వేతనాల కోడ్ 2019, సామాజిక భద్రత కోడ్ 2020ని భారతీయ మజ్దూర్ సంఘ్ స్వాగతించిందన్నారు. మిగతా రెండు చట్టాలలో సవరణ చేయాలని భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని గుర్తు చేశారు.

కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

హనుమకొండ కలెక్టరేట్, మే 15 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయ పాత్రకు ఇవ్వొద్దని మధ్యాహ్న భోజన కార్మికులు గురువారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి, జిల్లా కార్యదర్శి ఆర్.ర మేష్‌తో పాటు పెద్ద సంఖ్యలో మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

నిషేధిత పొగాకు ఉత్పత్తుల పట్టివేత

వరంగల్ క్రైం, మే 15 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న ప్రభుత్వ నిషేధిత పొగాకు ఉత్పతులను టాస్క్‌ఫోర్స్ సీఐ రంజిత్ బృందం గురువారం హనుమకొండ పీఎస్ పరిధిలో పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. గుడిబండల్ ప్రాంతంలోని బింగి రమేశ్ కిరాణంలో సోదాలు చేయగా రూ.1,67,400 విలువ చేసే వివిధ కంపెనీలకు చెందిన పొగాకు ఉత్పత్తులు పట్టుబడ్డాయన్నారు. వాటిని స్వాధీనం చేసుకొని తదుపరి చర్యల నిమిత్తం హనుమకొండ పోలీసులకు అప్పగించినట్లు ఏసీపీ తెలిపారు.


స్వాధీనం చేసుకున్న పొగాకు ఉత్పత్తులతో పోలీసులు

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

వరంగల్ క్రైం, మే 15 (ఆంధ్రజ్యోతి): హంటర్‌రోడ్డులోని లోటస్ రెసిడెన్సీలో పేకాటడుతున్న 9మందిని గురువారం రాత్రి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని రూ.35,900 నగదు, 9 సెల్‌ఫోన్‌లు సీజ్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ సార్ల రాజు తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం సుబేదారి ఎస్సై ఫణికుమార్‌కు అప్పగించినట్లు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

హనుమకొండ, మే 15 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా పరిషత్ భవనంలోని వృద్ధుల డేకేర్ సెంటర్‌లో ఈనెల 16న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్ సేవలు, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు జరుగుతుంది. జిల్లా సంక్షేమ శాఖాధికారిణి బి.జయంతి ముఖ్య అతిథిగా హాజరయ్యే ఈ కార్యక్రమంలో హెల్పేజ్ ఇండియా రాష్ట్ర ప్రాజెక్టు కోఆర్డినేటర్ పి.శ్యామ్ కుమార్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేస్తారు. కార్యక్రమానికి సీనియర్ సిటిజన్లు అధిక సంఖ్యలో హాజరు కావాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హనుమకొండ శాఖ కార్యదర్శి తేరాల యుగేందర్ కోరారు.

కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్‌గా కృష్ణవేణి



కేయూ క్యాంపస్, మే 15 (ఆంధ్రజ్యోతి): కేయూ ఫార్మసీ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ జె. కృష్ణవేణి నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం కేయూ రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం ఉత్తర్వులు విడుదల చేయగా వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్యలు కృష్ణవేణికి అందచేసి అభినందనలు తెలిపారు. ఇప్పటి వరకు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ప్రొఫెసర్ ఎస్.ప్రసాద్ నుంచి కృష్ణవేణి బాధ్యతలు చేపట్టనున్నారు.

కేయూ హెల్త్ సెంటర్ మెంబర్ ఇన్‌చార్జిగా ప్రసాద్

కేయూ ఆరోగ్య కేంద్రం మెంబర్ ఇన్‌చార్జిగా ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ ఎస్.ప్రసాద్‌ను తిరిగి ఉత్తర్వులు వచ్చే వరకు కొనసాగిస్తూ గురువారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా ఉత్తర్వులను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ప్రొఫెసర్ బైరు వెంకట్రామిరెడ్డి, పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్రా రాజులు అందచేసి అభినందనలు తెలిపారు. అలాగే కేయూ ఆరోగ్య కేంద్రానికి ఇద్దరు కాంట్రాక్టు మెడికల్ ఆఫీసర్లను నియామిస్తూ గురువారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరు రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపికైన మెడికల్ ఆఫీసర్లలో డాక్టర్ అభినవ్‌కుమార్ దగిరి, డాక్టర్ లునావత్ అనూషలు నియమితులయ్యారు. వీరికి కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఉత్తర్వులు అందచేసి అభినందనలు తెలిపారు.

పీజీ పరీక్షలు వాయిదా వేయాలి

పరిపాలన భవనం ఎదుట విద్యార్థుల నిరసన

కేయూ క్యాంపస్, మే 15 (ఆంధ్రజ్యోతి): కాకతీయ వర్సిటీ పరిధిలో 20 నుంచి జరగాల్సిన పీజీ కోర్సుల పరీక్షలను వాయిదా వేయాలని కోరుతూ విద్యార్థులు గురువారం నిరసన ఆందోళనకు దిగారు. తమ పరీక్షలను వాయిదా వేయాలని నినాదాలు చేస్తూ నిరసన కేయూ పరిపాలన భవనం ఎదుట చేపట్టారు. రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం వెంటనే స్పందించి విద్యార్థుల వద్దకు వచ్చి మాట్లాడారు. ఇప్పటికే అకడమిక్ ఇయర్ ముగిసిందని, పరీక్షలు గత నెలలోనే నిర్వహించాల్సి ఉందని, విద్యార్థులు వాయిదా అడగడంతో అప్పుడు వాయిదా వేశామని నచ్చచెప్పారు. తీవ్రమైన ఎండలు, పోటీపరీక్షల నేపథ్యంలో పీజీ పరీక్షలు రాయలేమని, నెల తర్వాత నిర్వహించాలని రిజిస్ట్రార్ వల్లూరు రామచంద్రంకు విద్యార్థులు విన్నవించారు. అయితే పరీక్షలను ఎట్టి పరిస్థితుల్లో వాయిదా వేయలేమని నిర్దేశిత షెడ్యూల్ మేరకు జరుగుతాయని రిజిస్ట్రార్ విద్యార్థులకు స్పష్టం చేశారు. దీంతో విద్యార్థులు కొద్ది సేపు నిరసనను కొనసాగించారు. అలాగే కామన్ మెస్ నుంచి భోజనం తెచ్చుకుని పరిపాలన భవనం ఎదుట చెట్ల కింద భోజనాలు చేశారు. విద్యార్థుల నిరసన ఆందోళన విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

ఇదిలా ఉండగా, విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో కేయూ పరీక్షల నియంత్రణాధికారి కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు సౌజన్య, అసీం ఇక్బాల్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పీజీ నాన్ ప్రొఫెషనల్ నాలుగో సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేసేది లేదని, గతంలో ప్రకటించిన అన్ని పరీక్షలు యథావిధిగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఎంబీఏ, ఎంసీఏతో పాటు ఇతర పరీక్షలన్నీ జరుగుతాయని పేర్కొన్నారు. పరీక్ష వాయిదా ఆపోహలను నమ్మవద్దని విద్యార్థులకు సూచించారు.


పరిపాలన భవనం ఎదుట భోజనం చేస్తున్న విద్యార్థులు

వాటర్ బాటిళ్ల వితరణ

వడ్డెపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అల్లుడు విష్ణువర్ధన్‌రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం వడ్డెపల్లి చర్చి జంక్షన్ ప్రాంతంలోని ఒయాసిస్ అనాథ ఆశ్రమంలో జరిగాయి. తెలంగాణ ఫిషర్‌మెన్ కాంగ్రెస్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మండల సమ్మయ్య సమకూర్చిన కేక్ కట్ చేసి ఆశ్రమం పిల్లలకు వాటర్ బాటిళ్లు, టవల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి సమ్మయ్య, 58వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్లపల్లి సుధాకర్, జిల్లా నాయకులు కేతిడి దీపక్‌రెడ్డి, తాళ్లపల్లి రవీందర్, తాళ్లపల్లి విజయ్, జనగం శ్రీనివాస్‌గౌడ్, మేరీ, ఎండి.సాజిద్, కమల్ తదితరులు పాల్గొన్నారు.


ఆశ్రమం పిల్లలకు వాటర్ బాటిళ్లు పంపిణీ చేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అందని జీతాలు

పెండింగ్‌లో ఉన్న రెండు నెలల జీతం

వరంగల్ కార్పొరేషన్, మే 15 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో పనిచేసే శానిటేషన్ కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు రాలేదు. జీతాలు చెల్లించే సంస్థకు ఇప్పటివరకు చెక్కును ఇవ్వలేదు. వేతనాల మంజూరులో కొందరు కిందిస్థాయి అధికారులు, సిబ్బంది జాప్యం చేస్తున్నట్టు ఆరోపనలున్నాయి. గ్రేటర్ వరంగల్ కార్యాలయంతో పాటు కాజీపేట, కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయాలు, 12 వార్డు కార్యాలయాల పరిధిలో సుమారు 3వేల మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులు శానిటేషన్, ఎలక్ట్రిషన్, ఫిల్టర్‌బెడ్లలో పని చేస్తున్నారు. వీరికి ఏప్రిల్, మే నెలకు సంబంధించిన జీతాలు ఇప్పటికీ బ్యాంకులలో జమ కాలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతం తీసుకునే సమయం దాటి రెండు మాసాలు గడుస్తున్నా అధికారులలో చలనం లేదని మండిపడుతున్నారు. జీతం రాక గాసం లేక ఇబ్బందితో అయోమయానికి గురవుతున్నామని చెప్పుకొస్తున్నారు. కొందరు ఇంటి అద్దె, పిల్లల ఫీజులు, చిల్లర సామాను, నెలవారి చిట్టీలు కట్టలేక తీవ్ర మనోవేదనకు గురవుతున్నామని ఇదే, పరిస్థితి ఉంటే ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కమిషనర్ స్పందించి ఔట్‌సోర్సింగ్ కార్మికుల జీతాలు వెంటనే ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. లేదంటే బల్దియా కార్యాలయం ఎదుట నిరసనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు. దీనిపై బల్దియా అధికారిని వివరణ కోరగా.. ఇంకా చెక్కులపై ఉన్నతాదికారుల సంతకాలు కాలేదని తెలిపారు.





ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి

హసన్‌పర్తి, మే 15 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీ ధరలకే రైతులకు ఎరువులు, విత్తనాలు విక్రయించాలని హనుమకొండ డివిజన్ ఏడీఏ రాజ్‌కుమార్ అన్నారు. మండల వ్యవసాయ అధికారి అడ్లూరి అనురాధతో కలిసి గురువారం హసన్‌పర్తి మండల పరిధిలోని ఆయా గ్రామాలలో ఎరువుల షాపులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా షాపులలో నిల్వలను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వానకాలం సీజన్ ప్రారంభం అవుతున్నందున రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలను డీలర్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించాలని చూస్తే షాపులను సీజ్ చేయడమే కాకుండా షాపు నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులు తమ షాపులలో ఏది కొనుగోలు చేసినా వాటికి తగిన రశీదు ఇచ్చి రికార్డులలో నమోదు చేయాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా రైతులకు నకిలీ ఎరువులు, విత్తనాలతో పాటు ప్రభుత్వ అనుమతి లేని ఏ వస్తువులు విక్రయించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఏడీఏ వెంట మండల ఫర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లెక్కల పున్నంచందర్‌రెడ్డి, డీలర్లు రాంరెడ్డి, రాములు, తోట సతీష్, కామారపు ప్రకాష్, భూపతి కృష్ణమూర్తి, వెలగందుల పున్నంచందర్ తదితరులున్నారు.


ఎరువుల షాపులో రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

గీతాసారం

సమత్వ సాధనే మోక్ష మార్గం

అజ్ఞానంతో జీవించడం చీకట్లో జీవించడం లాంటిది. చీకట్లో తడుముకుంటూ, పడుతూ, లేస్తూ...మనల్ని మనం గాయపరుచుకుంటాం. తదుపరి స్థితి... కొన్ని వెలుగు రేఖలను అనుభూతి చెందడం లాంటిది. అప్పుడు కూడా క్షణకాలం పాటు అవగాహన పొంది, తిరిగి అజ్ఞానంలోకే జారిపోతాం. చివరి స్థితి సూర్యకాంతి లాంటి శాశ్వతమైన కాంతిని పొందడం. ఇక్కడ అవగాహన అత్యున్నత స్థాయికి చేరుకుంటుంది. అక్కడి నుంచి ఇక వెనక్కి తిరిగి రావడం అనేది ఉండదు. ఇటువంటి స్థితిని 'మోక్షం' అంటారు. ఇది 'నేను' (సంబంధిత వ్యక్తి) పొందే స్వేచ్ఛ కాదు, 'నేను' (అనే భావన) నుంచి స్వేచ్ఛ. ఎందుకంటే బాధలన్నిటికీ కారణం ఈ 'నేను' కనుక.

"ఎవరైతే తమ మనసును, బుద్ధిని ఆత్మలో స్థిరపరుచుకుంటారో... వారు జ్ఞాన సాధనతో పాపరహితులై, పునరావృతరహితమైన పరమగతిని (మోక్షాన్ని) పొందుతారు" అని 'భగవద్గీత'లో శ్రీకృష్ణుడు చెప్పాడు. మరి ఆ స్థితిని పొందాలంటే కావలసింది ఏమిటి? సమత్వం. విద్యాసంపన్నులైన ఉన్నత వర్ణాలవారి పట్ల, నిమ్న కులాల వారిపట్ల, అలాగే గోవు, ఏనుగు, శునకం లాంటి జంతు



వుల పట్ల జ్ఞానులు సమదృష్టిని కలిగి ఉంటారన్నాడు శ్రీకృష్ణుడు. ఈ 'సమత్వం' అనేది భగవద్గీతకు పునాదుల్లో ఒకటి. అందరిలోనూ స్వయాన్ని (తనను), స్వయంలో అందరినీ చూడగలగడం అనేది సమత్వానికి కేంద్రం లాంటిది. అంటే ఇతరులలో కూడా మనలాగే మంచి విషయాలు ఉన్నాయని, మనలో కూడా ఇతరుల మాదిరిగా చెడు విషయాలు ఉన్నాయని గుర్తించడం. కనిపించే వైరుధ్యాలను సమానంగా చూడడం, అజ్ఞానం నుంచి ఉద్భవించిన ద్వేషాల్ని, అయిష్టాల లాంటి వాటిని త్యజించడం తరువాతి స్థాయిలు. 'ఒకే కారణం వల్ల ఒకసారి లాభం కలగవచ్చు, మరోసారి నష్టం కలుగవచ్చని తెలుసుకొని... మనం నిమిత్రమాత్రులం' అని గ్రహించాలి. సమతుల్యత లేని మనసుతో చేసిన కర్మ దుఃఖాన్ని తీసుకువస్తుందని అర్థం చేసుకోవాలి. ఈ అవగాహన నుంచి సమత్వభావం ఉద్భవిస్తుంది. "వర్తమానంలో ఎవరైతే సమత్వ భావంలో స్థిరపడతారో... వారు నిష్పక్షపాతులవుతారు. లోపరహితులై... పరమాత్మతో ఏకత్వాన్ని పొంది, జీవన్ముక్తులవుతారు" అని శ్రీకృష్ణుడు చెబుతున్నాడు.



కె.శివప్రసాద్

పుష్కరాలు



మన దేశంలోని మహా నదుల్లో ఒకటైన సరస్వతి నదిని వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు అద్భుతంగా కీర్తించాయి. అయిదు వేల ఏళ్ళకు పూర్వమే ఆవిర్భవించిన ఈ నది... భూమిపై తన ప్రవాహశీలతను క్రమంగా కోల్పోయింది. ఇప్పుడు అంతర్వాహినిగా భక్తుల ఆరాధనలను అందుకుంటోంది.

జన హృదయాంతర్వాహిని

జలాన్ని చైతన్య దేవతగా 'చాందగ్యోపనిషత్తు' వర్ణించింది. భారతీయ జీవన విధానం నదులతో పెనవేసుకుంది. వాటిలో ఒకటైన సరస్వతి నది వేదకాలం నాటిది. 'అంబితమే... నదీతమే... దేవీతమే సరస్వతి' అని స్తుతించాయి వేదాలు. ఒకప్పుడు మహా ధారగా ప్రవహించిన ఈ నది కాలక్రమంలో వచ్చిన భౌగోళిక మార్పులతో ఒడుదొడుకులకు లోనై క్షీణించింది. మహా భారత కాలానికే ఈ స్థితి ఏర్పడినట్టు చరిత్ర చెబుతోంది. ఇంతకీ ఈ నది గురించి పురాణాలు ఏం చెబుతున్నాయి?

ఏడు రూపాలతో...

సరస్వతి నది ఆవిర్భావం గురించి ఎన్నో కథలు ఉన్నాయి. పరమ శివుడి ఆద్యంతాలు తెలుసుకున్నానని బ్రహ్మ అసత్యం పలుకగా, దాన్ని గుర్తించిన శివుడు... బ్రహ్మ వాక్కుకు మూలమైన సరస్వతిని "నదివి కమ్ము" అని శపించాడని, అలా సరస్వతి నదీ రూపాన్ని పొందిందని 'బ్రహ్మాండ పురాణం' చెబుతోంది. ఇక సరస్వతిని విష్ణుపత్నిగా 'బ్రహ్మవైవర్త పురాణం', 'దేవీ భాగవతం' పేర్కొన్నాయి. అసూయతో సరస్వతిని భూలోకంలో నదిగా జన్మించాలని గంగ శపించగా, గంగను కూడా అదే విధంగా సరస్వతి శపించినట్టు మరికొన్ని కథలు వెల్లడిస్తున్నాయి. కాగా... 'బ్రహ్మ చేతి నుంచి ఆయన కమండలం జారిపడి, అందులోని పవిత్రజలం సరస్సుగా మారింది. అదే బ్రహ్మ సరస్సు (పుష్కరతీర్థం)గా ప్రసిద్ధి పొందింది. దానిలోనుంచి సరస్వతి నది పుట్టింది' అనేది స్థలపురాణం. ఆ జలంతో బ్రహ్మ చేసిన యాగం వల్ల 'సుభద్ర', నైమిశారణ్యంలో చేపట్టిన సత్ర యాగం వల్ల 'కనకాక్షి', గయుడు చేసిన క్రతువు ద్వారా 'విశాల', ఉద్దాలకుడు నిర్వహించిన యాగం వల్ల 'సురతన్వి', వశిష్టుడు ఆచరించిన యజ్ఞం ద్వారా 'ఓఘమాల', బృహస్పతి చేసిన యాగం వల్ల 'సువేణి', బ్రహ్మ చేసిన మరో యాగం వల్ల 'విమలోదక' అనే పేర్లు పొందిన సరస్వతి... ఏడు రూపాలతో 'సప్త సారస్వతం'గా ప్రసిద్ధి చెందింది.

ఎన్నో చోట్ల... ఎన్నెన్నో పేర్లతో...

సరస్వతి నదీ తీరంలో నివసించిన రాజుల చరిత్రను, ఋషులు చేసిన ప్రస్తావనలను, ప్రజల విశ్వాసాలను గమనిస్తే అనేక విషయాలు తెలుస్తాయి. సరస్వతి నది హిమాలయాల్లో పుట్టి... వితస్తా (జీలం), అసిక్నీ (చీనాబ్), పరుష్ణి (రావి), శతద్రు (సట్లెజ్), విపాశ (బియాస్), సింధు నదులతో కలిసి... కశ్మీర్, పంజాబ్, ఉత్తర భారతం మీదుగా... ఈనాటి పాకిస్తాన్‌లోని పంజాబ్‌లో ప్రవహించి, అరేబియా నదిలో సంగమిస్తుంది. ఈ ఏడు నదులు ప్రవహించిన ప్రదేశమే 'సప్తసింధు' ప్రాంతంగా



పేరుపొందింది. నేటికీ ఈ నదిపట్ల ప్రజలలో విశ్వాసం సన్నగిల్లలేదు. దేశంలోని ఎన్నో ప్రదేశాలలో... ఈ నది అంతర్వాహినిగా ప్రవహిస్తోందనేది జనం నమ్మకం. ఈ నదిపై విశేషమైన పరిశోధనలు జరిగాయి. ఫ్రెంచి రచయిత మైఖేల్ దానినో ది 'లాస్ట్ రివర్' (లుప్త నది) అనే పేరుతో ఒక గ్రంథాన్నే రచించాడు. శివాలిక్ ప్రాంతంలో పుట్టిన సరస్వతి... కురుక్షేత్రంలో లుప్తమయిందనే పురాణ కథ కూడా ఉంది. ఇప్పటికీ అక్కడ ఒక నది ప్రవహిస్తోంది. దాన్ని 'గగ్గర్ నది'గా వ్యవహరిస్తారు. శ్రీకృష్ణుడు నిర్యాణం చెందిన ప్రభాస పట్టణంలోని నదిని 'ప్రభాస తీర్థం' అంటారు. పుష్కర తీర్థంలో పుట్టి కొంతదూరం ప్రవహించి, లవణా నదిలో కలిసే నదిని 'పుష్కర సరస్వతి' అంటారు. సరస్వతి నది లుప్తమైనప్పటికీ... భూగర్భంలో ప్రవహిస్తూ, బదరీనాథ్ ఆలయానికి సమీపంలోని మానా గ్రామంలో 'బిందు సరోవరం'గా దర్శనమిస్తుంది. దీన్ని 'సరస్వతీ కుండం'గా వ్యవహరిస్తారు. ఈ ప్రదేశాలన్నిటినీ పుష్కర సమయంలో వేలాది భక్తులు దర్శించి, పవిత్ర స్నానాలు ఆచరిస్తారు. అలాగే దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన తెలంగాణలోని కాళేశ్వరంలో గోదావరి, ప్రాణహిత, అంతర్వాహినిగా సరస్వతీ సంగమించే 'త్రివేణ సంగమ' ప్రదేశంలో... సరస్వతి పుష్కరాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. విశేషమేమిటంటే... ఈ మూడూ పుష్కర నదులే. ఈనెల 26వ తేదీవరకూ కొనసాగే పుష్కరాల్లో నదీ స్నానాలు, దాన ధర్మాలు, పితృకార్యాలు చేయడం వల్ల శుభ ఫలితాలు కలుగుతాయనేది పెద్దల మాట.

● ఆయపిళ్ళ రాజపాప

ఫొటోలు: వీరగోని హరీష్, మధు, వరంగల్

తెలుసుకుందాం

పాండవ పక్షాన కౌరవుడు



దుర్యోధనాది కౌరవుల గురించి అందరికీ తెలుసు. కానీ ధృతరాష్ట్రుడి మరో కుమారుడైన యుయుత్సుడిది కూడా మహా భారతంలో విశిష్టమైన పాత్రే. అతని తల్లి సుఖద అనే వైశ్య వనిత. యుయుత్సుడు మహా వీరుడు. అతిరథుల్లో ఒకడు. మొదటి నుంచీ దుర్యోధనుడితోనే కలిసి ఉండేవాడు. కౌరవ-పాండవ సమరం ప్రారంభమయ్యే సమయంలో "మేము అస్త్ర శస్త్రాలు పట్టింది ధర్మాన్ని రక్షించడానికి. మమ్మల్ని వ్యతిరేకించి, మమ్మల్ని ఎదిరించి పోరాడేవారందరూ ధర్మ విధ్వంసానికి పాల్పడేవారే. అలాకాకుండా ధర్మం వైపు నిలబడి ఎవరైనా పోరాడాలనుకుంటే వారికి స్వాగతం పలుకుతున్నాం" అని ధర్మరాజు చెప్పిన మాటలు యుయుత్సుణ్ణి ఆకర్షించాయి. ధర్మం పాండవులవైపే ఉందని గ్రహించాడు. తనవంతు సైన్యంతో సహా పాండవుల పక్షాన చేరి, కౌరవుల మీద యుద్ధం సాగించాడు. భారత యుద్ధం ముగిసింది. ధృతరాష్ట్రుడి కుమారుల్లో మిగిలినది యుయుత్సుడొక్కడే. "ధర్మానికి కట్టుబడిన యుయుత్సుణ్ణే కౌరవ సామ్రాజ్యానికి రాజును చేస్తాను. ఆ విధంగానైనా ధృతరాష్ట్రుడికి మనశ్శాంతి కలుగుతుంది" అని ధర్మరాజు ప్రకటిస్తాడు. అయితే ధర్మవేత్తలు దానికి అభ్యంతరం చెబుతూ... క్షత్రియ సంతతికి చెందని యుయుత్సుడు రాజు కావడానికి అనర్హుడని అంటారు. అప్పుడు పాండవ సామ్రాజ్యానికి సైన్యాధ్యక్షుడిగా యుయుత్సుణ్ణి ధర్మరాజు నియమిస్తాడు. ఆ తరువాత స్వర్గారోహణకు బయలుదేరిన పాండవులు... అభిమన్యుడి కుమారుడైన పరీక్షిత్తు సంరక్షణ బాధ్యతను యుయుత్సుడికే అప్పగిస్తారు. పాండవ పక్షాన నిలిచి పోరాడిన కౌరవుడైన యుయుత్సుడు... మహా భారతంలోని విలక్షణమైన పాత్రల్లో ఒకటి.

ఎల్‌ఆర్‌ఎస్ నిబంధనల్లో సవరణ

» ఉత్తర్వులు ఇచ్చిన ప్రభుత్వం

హైదరాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేని లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం 2020లో ఇచ్చిన ఎల్‌ఆర్‌ఎస్ నిబంధనల్లో మరికొన్ని సడలింపులు చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణకు రిజిస్టర్ సేల్‌డీడ్ ఉన్న వారికే అవకాశం ఉండేది. తాజా ఉత్తర్వుల ప్రకారం (జీవో 98) రిజిస్టర్ గిఫ్ట్‌డీడ్, రిజిస్టర్ ఎక్సేంజ్ డీడ్, వారసత్వ (సక్సెసన్) రిజిస్ట్రేషన్లున్న వారూ తమ ప్లాట్లను క్రమద్ధీకరించుకోవచ్చు. ఈ మేరకు వారికి అవకాశం కల్పిస్తూ పురపాలకశాఖ మెట్రోపాలిటిన్ కార్యదర్శి డాక్టర్ కె.ఇలంబర్తి గురువారం ఉత్తర్వులిచ్చారు. ప్రజల నుంచి వచ్చిన వినతుల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అనుమతులు లేని లేఅవుట్లలో చేతులు మారిన ప్లాట్లను కొనుగోలు చేసిన వాళ్లు కూడా ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. అనధికారిక లేఅవుట్లలో కొనుగోలు చేసినవారికి, వారసత్వంగా స్థలాలు పొందిన వారికి, గిఫ్ట్‌ద్వారా స్థలాలు స్వీకరించిన వారికి కొత్త మార్గదర్శకాల ప్రకారం లబ్ధి చేకూరనుంది.

పోడు రైతులకు.. ఇందిర సౌర గిరి జల వికాసం

» 18న అమ్రాబాద్‌లో ప్రారంభించనున్న సీఎం రేవంత్

పోడు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. రాష్ట్రంలో పోడు పట్టాలు పొందిన 2.10 లక్షల మంది రైతులకు చెందిన 6 లక్షల ఎకరాలకు 'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకం అమలు చేయనుంది. ఈ పథకం కోసం వచ్చే ఐదేళ్లలో(2025-26 నుంచి 2029-30) రూ.12,600 కోట్లను ఖర్చు చేయాలని నిర్ణయించింది. ప్రస్తుత సంవత్సరం(2025-26)లో రూ.600 కోట్లను ఖర్చు చేయనుండగా, తదుపరి నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.3వేల కోట్ల చొప్పున ఖర్చు చేయనున్నారు. పథకం అమలుకు ఎస్టీ ఎస్డీఎఫ్ నిధులను వినియోగించనున్నారు. ఈ మేరకు ఈ పథకం అమలుకు అనుమతులిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు(జీవో-15) జారీ చేసింది. ఈ పథకం కింద పోడు పట్టాలు పొందిన భూముల్లో బోర్లు వేయడం, వాటికి సోలార్ పంపుసెట్లు అందించడం సహా మౌలిక సౌకర్యాలను కల్పిస్తారు. 100% రాయితీతో ఈ పథకాన్ని గిరిజనులకు అందించనున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 18న అచ్చంపేట నియోజకవర్గంలోని అమ్రాబాద్ మండలం మాచారంలో పథకాన్ని ప్రారంభించనున్నారు.



పద్మేశ్ గుప్తాకు చెక్కును అందజేస్తున్న ఆర్‌సీ ప్లాస్టో డైరెక్టర్ నీలేశ్ అగర్వాల్

గోసంరక్షణకు 'ఆర్‌సీ ప్లాస్టో' సాయం

» గో విజ్ఞాన్ అనుసంధాన కేంద్రానికి అత్యాధునిక వెటర్నరీ అంబులెన్స్ విరాళం

నాగ్‌పూర్, మే 15 : నీటి నిర్వహణ, నిల్వకు సంబంధించిన పరికరాల తయారీలో పేరొందిన సంస్థ ఆర్‌సీ ప్లాస్టో ట్యాంక్స్ అండ్ పైప్స్ ప్రైవేట్ లిమిటెడ్. కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్‌ఆర్) కింద గోవుల సంరక్షణ కోసం నిధులు కేటాయించింది. నాగ్‌పూర్ జిల్లా దేవలాపర్‌లో ఉన్న గోవిజ్ఞాన్ అనుసంధాన కేంద్రానికి అత్యాధునిక వెటర్నరీ అంబులెన్స్‌ను విరాళంగా ఇచ్చింది. అంబులెన్స్ సమకూర్చుకునేందుకుగాను రూ.17 లక్షల చెక్కును గో విజ్ఞాన్ అనుసంధాన కేంద్రం అధ్యక్షుడు పద్మేశ్ గుప్తాకు ఆర్‌సీ ప్లాస్టో డైరెక్టర్ నీలేశ్ అగర్వాల్ అందజేశారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన, ఇతర కారణాల వల్ల జబ్బు పడిన ఆవులకు వైద్య సాయం సకాలంలో అందించేందు కు ఈ అత్యాధునిక అంబులెన్స్ ఎంతో ఉపయోగపడనుంది. వైద్య పరికరాలు, మందులు, ఆక్సిజన్ సిలిండర్‌తోపాటు గాయపడిన ఆవులను సులువుగా తరలించేందుకు అవసరమైన సదుపాయాలు ఈ అంబులెన్స్‌లో ఉంటాయి.





పుష్కర పూజలు నిర్వహిస్తున్న మాధవానంద సరస్వతి, పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు,తదితరులు.. పుష్కర స్నానం ఆచరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

కాళేశ్వరానికి మాస్టర్ ప్లాన్

ఆలయ అభివృద్ధికి రూ.200 కోట్లిస్తాం.. గోదావరి పుష్కరాల్లో భాగంగా శాశ్వత పనులు

» సరస్వతీ పుష్కరాల్లో సీఎం రేవంత్

» పుష్కర స్నానమాచరించి.. ముక్తీశ్వరుడికి పూజలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

దక్షిణ కాశీగా పేరొందిన కాళేశ్వరం అభివృద్ధికి ఎంత ఖర్చయినా నిధులు మంజూరు చేస్తామని, వెంటనే మాస్టర్ ప్లాన్ రూపొందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని త్రివేణీ సంగమం వద్ద గురువారం ప్రారంభమైన సరస్వతీ నదీ పుష్కరాలకు సీఎం హాజరయ్యారు. పుష్కర స్నానమాచరించి, ముక్తీశ్వరస్వామికి అభిషేకం చేయడంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ కాళేశ్వరం అభివృద్ధికి వెంటనే మాస్టర్ ప్లాన్ తయారుచేసి ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కాళేశ్వరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడం కోసం మంత్రి శ్రీధర్‌బాబు రూ.100 కోట్లు అడిగారని, రూ.200 కోట్లు అయినా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని, ఇక్కడ గోదావరి పుష్కరాల పనుల్లో భాగంగా ఆలయానికి సంబంధించి శాశ్వత అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. గోదావరి నది ఈ ప్రాంతానికి ఆశీర్వాదం లాంటిదన్నారు. పుష్కరాల్లో స్నానం చేయడం అంటే చేసిన తప్పులు కడుక్కోవడమేనని, తప్పులు చేసినా, చేయకున్నా పుష్కర స్నానం చేసి మంచి తపనతో ముందుకు వెళ్లాలన్నారు. ఒకప్పుడు దేశ ఆర్థిక గతిని మార్చడంలో కీలక పాత్ర పోషించిన పీవీ నరసింహారావులాగే ప్రస్తుతం తెలంగాణ అభివృద్ధి కోసం పెట్టుబడులు తేవడంలో తనకు చేదోడు వాదోడుగా ఉంటున్న మంత్రి శ్రీధర్‌బాబు ఈ ప్రాంతం వ్యక్తి కావడం అదృష్టమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ అభివృద్ధికి రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు తేవడంలో శ్రీధర్‌బాబు తనకు చేదోడు వాదోడుగా ఉన్నారని చెప్పారు. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు కూడా మాట్లాడారు. గురువారం సాయంత్రం 4.14 గంటలకు హెలికాప్టర్‌లో కాళేశ్వరం చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... నేరుగా ప్రధాన ఘాట్‌కు చేరుకుని 15 అడుగుల సరస్వతీ మాత ఏకశిలా విగ్రహాన్ని ఆవిష్కరించారు. కొత్తగా నిర్మించిన జ్ఞాన సరస్వతీ ఘాట్‌ను ప్రారంభించారు. వీఐపీ ఘాట్‌కు సరస్వతీ ఘాట్‌గా నామకరణం చేశారు. అనంతరం పుష్కర స్నానమాచరించి, సరస్వతీ మాతకు ప్రభుత్వం తరఫున చీర, సారెను సమర్పించారు. కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో మహాదేవుని దర్శించుకుని, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. సరస్వతి నదీ ఒడ్డుకు చేరుకుని మహానదీ హారతిలో పాల్గొన్నారు.



పుష్కరిణికి చీర, సారె సమర్పిస్తున్న సీఎం రేవంత్, మంత్రులు

సరస్వతీ పుష్కరాలకు వచ్చిన తొలి సీఎం రేవంత్

సరస్వతీ నది పుష్కర చరిత్రలో సీఎం పాల్గొనడం ఇదే తొలిసారి. 2013లో ఈ పుష్కరాల కోసం నాటి ప్రభుత్వం కేవలం రూ.14 లక్షలే కేటాయించింది. ప్రస్తుత పుష్కరాల కోసం సీఎం రేవంత్ 37 కోట్లు కేటాయించటంతో పాటు సరస్వతీ మాత ఏకశిలా విగ్రహం, పుస్తక ఆకృతి విగ్రహాన్ని గోదావరి నది ఒడ్డున ఏర్పాటు చేశారు. 2027లో జరిగే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని పుష్కర ఘాట్‌లను భారీ హంగులతో నిర్మించారు.

వైభవంగా సరస్వతీ పుష్కరాలు ప్రారంభం

సరస్వతీ నది పుష్కర సంరంభానికి గురువారం అంకురార్పణ జరిగింది. స్వామీ మాధవానంద సరస్వతి తెల్లవారు జామున 5.44 గంటలకు శ్రీకారం చుట్టారు. మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణల మధ్య సరస్వతీ నదికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, చీర, సారె, పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, పంచామృతాలు సమర్పించారు. నదిలో పుణ్యస్నానమాచరించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఆయన సతీమణి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ పూజలు నిర్వహించారు. పుష్కరాల్లో తొలిరోజు సుమారు 20 వేలకు పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారని అంచనా. 600 మంది వేద పండితులు పాల్గొన్నారు. గురువారం రాత్రి 8 గంటలకు కాశీ పండితులు నవరత్న హారతిని వైభవోపేతంగా నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం ఉదయం కాళేశ్వరం రానున్నారు.



పుష్కరాలకు అంకురార్పణ చేస్తున్న మాధవానంద సరస్వతి

దళితుడిని ప్రతిపక్ష నేతను చేయండి

కేసీఆర్ కుటుంబంలో ఎవరి నాయకత్వమైనా..

తేడా ఏముంటుంది..?: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మే 15(ఆంధ్రజ్యోతి): కేటీఆర్ నాయకత్వంలో పనిచేస్తానని హరీశ్‌రావు చెప్పడంలో అర్థం లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వారి కుటుంబంలో ఎవరి నాయకత్వమైనా తేడా ఏముంటుందని ప్రశ్నించారు. బిల్లా అయినా.. రంగా అయినా తేడా ఏమీ లేదన్నారు. అదే కొప్పుల ఈశ్వర్, రసమయి బాలకిషన్.. లేదా మరొకరి నాయకత్వంలోనో పనిచేస్తానని హరీశ్‌రావు చెబితే బాగుంటుందని తెలిపారు. బుధవారం రాత్రి జలసౌధలో సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష అనంతరం రేవంత్ మీడియాతో చిట్‌చాట్ చేశారు. తెలంగాణకు దళితుడిని సీఎం చేస్తానని చెప్పి మాట తప్పారు కాబట్టి.. ఇప్పుడు దళితుడికి నాయకత్వం ఇస్తే మేలని అన్నారు. కేసీఆర్ ఎలాగూ అసెంబ్లీకి రావట్లేదని, ఈ నేపథ్యంలో ఓ దళిత ఎమ్మెల్యేకు ప్రతిపక్ష నేత హోదా ఇస్తే బాగుంటుందని చెప్పారు. దళితులకు నాయకత్వం ఇవ్వడమే కాకుండా వారికి కేసీఆర్ కుటుంబం విధేయతతో ఉండాలని అన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడిగా మల్లికార్జున ఖర్గేను పెట్టిన తాము.. గాంధీ కుటుంబంతో సమానంగా ఆయనకు గౌరవం ఇస్తున్నామని రేవంత్ తెలిపారు.

చంచల్‌గూడ జైలులో ప్రత్యేక సౌకర్యాలు కుదరవు

» గాలి జనార్దన్ రెడ్డి వినతిని తిరస్కరించిన సీబీఐ ప్రత్యేక కోర్టు

హైదరాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఓబుళాపురం గనుల అక్రమ మైనింగ్ కేసులో కారాగార శిక్ష అనుభవిస్తున్న గాలి జనార్దన్ రెడ్డికి సీబీఐ కోర్టులో నిరాశ ఎదురయింది. ఓఎంసీ కేసులో ఏ2గా ఉన్న గాలి జనార్దన్ రెడ్డికి ఏడేళ్ల జైలు శిక్ష పడడంతో ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో ఉన్నారు. తనకు కారాగారంలో ప్రత్యేక వసతులు కల్పించాల్సిందిగా రెండ్రోజుల కిందట ఆయన సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గురువారం దానిని న్యాయస్థానం పరిశీలించింది. నేరం రుజువైనందున శిక్ష పడిందని, నేరస్థులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించడం కుదరదని పిటిషన్‌ను తిరస్కరించింది. ఆరోగ్య సమస్యలు, వయోభారంతో పాటు ప్రజాప్రతినిధి (కర్ణాటకలోని గంగావతి నియోజకవర్గ ఎమ్మెల్యే)ని అయినందున తనకు జైలులో 'ఏ' క్లాస్ సదుపాయాలు కల్పించాలని కోరారు. ఇందుకు కోర్టు నిరాకరించింది.

19న రాష్ట్ర క్యాబినెట్ సమావేశం?

హైదరాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రిమండలి సమావేశం ఈ నెల 19న జరిగే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో జూన్ 2న నిర్వహించే రాష్ట్ర అవతరణ దినోత్సవంపై మంత్రులు చర్చించనున్నారని సమాచారం. నిరుద్యోగ యువత కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద ఇప్పటికే దరఖాస్తులను స్వీకరించింది. వాటిని పరిశీలించి, అర్హులను ఎంపిక చేసే ప్రక్రియ కొనసాగుతోంది. పథకం కింద ఎంత మంది అర్హులవుతారు, ఎంతమేర నిధులు అవసరమవుతాయన్న వివరాలపై క్యాబినెట్ సమావేశంలో చర్చించే అవకాశాలున్నాయి. కంచ గచ్చిబౌలి భూముల విషయంపై కూడా మంత్రిమండలి చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం.









దాదాసాహెబ్ బయోపిక్‌లో

ఆమీర్‌ఖాన్



భారతీయ సినిమా పితామహుడు దాదా సాహెబ్ ఫాల్కే. ఆయన నిర్మించిన తొలి భారతీయ చిత్రం 'రాజా హరిశ్చంద్ర' 1913లో విడుదలైంది. ఆ తర్వాత 'లంకా దహన్', 'శ్రీ కృష్ణ జన్మ', 'కాళీయ మర్దన్' వంటి విజయవంతమైన చిత్రాలను ఆయన తెరకెక్కించారు. కళామతల్లికి దాదాసాహెబ్ చేసిన సేవలకు గాను ఆయన పేరుతో కేంద్ర ప్రభుత్వం జాతీయ అవార్డును నెలకొల్పి ఏటా అందజేస్తోంది. ఇప్పుడు ఆయన జీవిత విశేషాలతో ఓ చిత్రం రూపుదిద్దుకోనున్నది. ఇందులో బాలీవుడ్ నటుడు ఆమీర్‌ఖాన్ లీడ్ రోల్‌లో నటించనున్నారు. రాజ్‌కుమార్ హిరానీ తెరకెక్కించనున్నట్లు మేకర్స్ గురువారం అధికారికంగా ప్రకటించారు. 'త్రీ ఇడియట్స్', 'పీకే' వంటి బ్లాక్ బస్టర్ చిత్రాల తర్వాత ఆమీర్‌ఖాన్-రాజ్‌కుమార్ హిరానీ కాంబినేషన్‌లో వస్తున్న మూడో చిత్రమిది. కాగా, తెలుగు దర్శకుడు రాజమౌళి సమర్పణలో కూడా 'సాదాసాహెబ్ ఫాల్కే' బయోపిక్ తెరకెక్కనున్నదని, ఇందులో జూనియర్ ఎన్టీఆర్ ప్రధాన పాత్రలో నటించనున్నారని సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అయ్యాయి. అయితే ఈ ప్రాజెక్టు గురించి ఎలాంటి అధికారిక సమాచారం రాలేదు. అయితే ఈ రెండు వార్తలు ఒకే రోజున రావడం ఇండస్ట్రీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

ఊహించని కథతో మెప్పిస్తాం



\- అశ్విన్‌బాబు

హీరో అశ్విన్‌బాబు నటించిన తాజా చిత్రం 'వచ్చినవాడు గౌతమ్'. ఈ థ్రిల్లర్‌కు మామిడాల ఎం.ఆర్ కృష్ణ దర్శకుడు. టి. గణపతిరెడ్డి నిర్మిస్తున్నారు. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో దర్శకుడు శైలేశ్ కొలను, సంగీత దర్శకుడు తమన్ సినిమా టీజర్‌ను ఆవిష్కరించారు. మంచు మనోజ్ గంభీరమైన గొంతుతో మొదలైన టీజర్ యాక్షన్ మూడ్‌ను సెట్ చేసింది. అశ్విన్‌బాబు మాట్లాడుతూ 'ఎవరూ ఊహించని ఒక కొత్త పాయింట్‌తో ఈ చిత్రం తెరకెక్కింది. గణపతిరెడ్డి గారి వల్లే సినిమా గ్రాండియర్‌గా వచ్చింది. ఈ సినిమా ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తుంది' అన్నారు. చిత్రబృందం కృషివల్లే ఒక మంచి సినిమాను తెరకెక్కించగలిగాం అని కృష్ణ చెప్పారు. 'అశ్విన్ ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాడు, ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఉంది' అని గణపతిరెడ్డి చెప్పారు.

రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్



హాస్యం, రొమాన్స్, ఎమోషన్స్ అంశాలతో రూపుదిద్దుకున్న చిత్రం 'వర్జిన్ బాయ్స్'. యువతీయువకుల మధ్య ప్రస్తుతం ఉన్న రిలేషన్‌షిప్స్ గురించి వివరిస్తూ దయానంద్ దర్శకత్వంలో రాజా దరపునేని నిర్మించారు. గీతానంద్, మిత్రా శర్మ హీరోహీరోయిన్లుగా నటించిన ఈ చిత్రం టీజర్ విడుదలైంది. యూత్‌ఫుల్ వైబ్స్ కలర్‌ఫుల్ విజువల్స్‌తో టీజర్ ఆకట్టుకుంటోంది. చిత్రం గురించి నిర్మాత మాట్లాడుతూ 'యూత్‌కి కనెక్ట్ అయ్యేలా చిత్రాన్ని తీశాం. ఇంతకుముందు ఎన్నో యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్స్ వచ్చినా వాటిని మైమరిపించేలా సినిమా ఉంటుంది. ఈ సమ్మర్‌కు కచ్చితమైన సినిమా' అన్నారు. శ్రీహాన్, రోనిత్, జెన్నిఫర్, అన్షుల, సుజిత్‌కుమార్, అభిలాష్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు.

సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్ ఈశ్వర్

ఇక లేరు



ఐదు దశాబ్దాలుగా ఫిల్మ్ జర్నలిస్ట్‌గా తెలుగు చిత్రపరిశ్రమలో ఉంటూ వివాదరహితుడైన బి.కె. ఈశ్వర్ (76) బుధవారం రాత్రి అనారోగ్యంతో కన్ను మూశారు. ఆయన పూర్తి పేరు బైరపి కోటేశ్వరరావు. 'విజయచిత్ర' మాస పత్రికలో చాలా కాలం పని చేశారు. జర్నలిస్టుగా తన అనుభవాలను బి.కె.ఈశ్వర్ 'ఆంధ్రజ్యోతి' సంస్థకు చెందిన 'నవ్య' వారపత్రికలో 62 వారాల పాటు 'అనగా అనగా ఒకసారి' పేరుతో వ్యాసాలు రాశారు. జర్నలిజానికి మాత్రమే పరిమితం కాకుండా ఈశ్వర్ పలు సినిమాలకు మాటలు, పాటలు కూడా రాశారు. గురువారం ఆయన అంత్యక్రియలు జూబ్లీ హిల్స్ శ్మశాన వాటికలో జరిగాయి.

జూనియర్ వస్తున్నాడు



గాలి జనార్ధన్ రెడ్డి తనయుడు కిరీటిరెడ్డి కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'జూనియర్'. శ్రీలీల కథానాయిక. రాధాకృష్ణ దర్శకత్వంలో రజని కొర్రపాటి నిర్మించారు. జెనీలియా కీలకపాత్ర పోషించారు. చిత్రబృందం గురువారం విడుదల తేదీని ప్రకటించింది. జూలై 18న 'జూనియర్'ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు తెలిపింది. 'కుటుంబంతో కలసి సరదాగా చూసేలా ఈ చిత్రం ఉంటుంది, వినోదం, భావోద్వేగం కలబోతగా రూపొందించాం' అని యూనిట్ పేర్కొంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

ప్రచార పర్వం జోరుగా...



కమల్‌హాసన్ కథానాయకుడిగా మణిరత్నం తెరకెక్కించిన చిత్రం 'థగ్‌లైఫ్'. జూన్ 5న ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామా పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రమోషన్లను వేగవంతం చేస్తోంది టీమ్. ఈ నెల 17న ట్రైలర్‌ను విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. అలాగే, ఈనెల 24న హైదరాబాద్‌లో ఆడియో వేడుకను, 29న విశాఖపట్నంలో ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలుగులో శ్రేష్ఠ్ మూవీస్ ద్వారా ఎన్.సుధాకర్ రెడ్డి ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. శింబు, జయం రవి, త్రిష కీలక పాత్రలు పోషించారు. ఏ.ఆర్.రెహ్మాన్ సంగీతం అందించారు.

ఆంధ్రా కింగ్ తాలూకా



రామ్ పోతినేని కథానాయకుడిగా మహేశ్ బాబు పి. దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. మైత్రీ మూవీ మేకర్స్ బేనర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ఉపేంద్ర కీలకపాత్ర పోషిస్తున్నారు. గురువారం చిత్రబృందం టైటిల్‌ను ప్రకటించింది. 'ఆంధ్రా కింగ్ తాలూకా' అనే టైటిల్‌ను నిర్ణయించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన గ్లింప్స్‌లో రామ్ స్టైలిష్ లుక్‌లో ఆకట్టుకున్నారు. రావు రమేశ్, మురళీ శర్మ, రాహుల్ రామకృష్ణ కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: వివేక్ - మెర్విన్, సినిమాటోగ్రఫీ: సిద్ధార్థ నుని.

జంటగా మరోసారి



'బేబీ' సినిమాతో సూపర్ హిట్ కొట్టిన ఆనంద్ దేవరకొండ - వైష్ణవి చైతన్య కలసి మరోసారి ప్రేక్షకులను అలరించబోతున్నారు. వీరిద్దరు జంటగా ఆదిత్య హాసన్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కబోతోంది. ఈ సినిమా పూజా కార్యక్రమంతో ఘనంగా ప్రారంభమైంది. హీరోయిన్ రష్మిక మందన్న క్లాప్ కొట్టగా, నటుడు శివాజీ కెమెరా స్విచ్చాన్ చేశారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. జూన్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుందని మేకర్స్ తెలిపారు.

భర్తగా కాదు..

బంగారుగుడ్డు పెట్టే బాతులా చూశారు

\-హీరో రవి మోహన్



తన భార్య ఆర్తిపై తమిళ హీరో రవి మోహన్ సంచలన ఆరోపణలు చేశారు. తనను ఓ భర్తగా కాకుండా బంగారుగుడ్డు పెట్టే బాతుగా చూశారని ఆరోపించారు. ప్రేమ పేరుతో తన డబ్బు, ఆస్తి అన్నింటిని ఉపయోగించుకున్నారని రవి గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో తన భార్య ఆర్తికి విడాకులు ఇవ్వడానికి గల కారణాలు, తమ మధ్య చోటుచేసుకున్న వివిధ అంశాలను ఆయన ప్రస్తావించారు. "కొన్నేళ్ళుగా వెన్నుపోటుకు గురవుతూ వచ్చాను. వారు ఇప్పుడు గునపంతో గుండెల్లో గుచ్చడం కూడా సంతోషంగా ఉంది. నా విడాకులకు గల కారణాలను నా బంధువులు, కుటుంబ సభ్యులు, నన్ను ప్రేమించే అభిమానులకు ఇప్పటికే వివరించాను' అని ప్రకటనలో పేర్కొన్నారు.

\-చెన్నై (ఆంధ్రజ్యోతి)

వివాదాస్పద పాటలో మార్పు



తమిళ నటుడు సంతానం హీరోగా నటించిన 'డెవిల్స్ డబుల్ నెక్స్ లెవల్' చిత్రంలోని 'శ్రీనివాసా గోవిందా' పాటలో మార్పులు చేసి, మళ్లీ సెన్సార్ బోర్డు నుంచి సర్టిఫికేట్ తీసుకుంటామని చిత్ర నిర్మాత హైకోర్టుకు తెలిపారు. ఈ చిత్రం శుక్రవారం విడుదలకానుంది. అయితే, ఈ చిత్రంలో 'శ్రీనివాసా గోవిందా' అనే పాట చరణాలు శ్రీవేంకటేశ్వర స్వామిని కించపరిచేలా ఉన్నాయంటూ విమర్శలు వచ్చాయి. ఈ పాటను తక్షణం తొలగించాలని, లేనిపక్షంలో రూ.100 కోట్ల పరువునష్టం చెల్లించాలంటూ హీరో సంతానంకు టీటీడీ పాలక మండలి సభ్యుడు భానుప్రకాశ్ లీగల్ నోటీసులు పంపించారు. అదేవిధంగా చెన్నైకి చెందిన బాలాజీ అనే వ్యక్తి ఈ చిత్ర సెన్సార్ సర్టిఫికేట్‌ను రద్దు చేయాలని, విడుదలను అడ్డుకోవాలని కోరుతూ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. గురువారం ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.



ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై సర్కారు నిర్లక్ష్యం

» కేంద్ర మంత్రి బండి సంజయ్

హైదరాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలుపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య పూరిత ధోరణితో లక్షల మంది పేద విద్యార్థుల భవితవ్యం ప్రమాదంలో పడిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దాదాపు రూ.8,000 కోట్లకు పెరిగిపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణం చెల్లించాలంటూ గురువారం సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో సంక్షోభంలో చిక్కుకున్న ప్రైవేటు కాలేజీలు అప్పులతో మూత పడుతున్నాయని గుర్తు చేశారు. కోర్సులు పూర్తిచేసిన పేద విద్యార్థులు సర్టిఫికెట్లు పొందక.. ఉద్యోగాలకు దరఖాస్తు చేయలేక.. ఉన్నత విద్యనభ్యసించలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ఇకనైనా తక్షణం బకాయిలు చెల్లించకపోతే, తదుపరి పరిణామాలకు ప్రభుత్వానిదే బాధ్యత అని పేర్కొన్నారు.

హైదరాబాద్ మెట్రో రైలు చార్జీల పెంపు

» కనిష్ఠంగా రూ.2, గరిష్ఠంగా రూ.16..
» కొత్త ధరలు మే 17 నుంచి అమలులోకి
» మెట్రో చార్జీలను పెంచడం ఇదే తొలిసారి
» ఎఫ్ఎఫ్‌సీ సిఫారసుల ప్రకారమే ధరల సవరణ: ఎల్ అండ్ టీ



దూరం (కిమీల్లో)	కొత్త చార్జీ (రూ.ల్లో)
0-2	12
2-4	18
4-6	30
6-9	40
9-12	50
12-15	55
15-18	60
18-21	66
21-24	70
24 పైన	75

హైదరాబాద్ సిటీ, మే 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మెట్రో రైలు టికెట్ చార్జీలను పెంచారు. ఫేర్ ఫిక్సేషన్ కమిటీ (ఎఫ్ఎఫ్‌సీ) సిఫారసుల ప్రకారం కనిష్ఠంగా రూ.2, గరిష్ఠంగా రూ.16 వరకు చార్జీలు పెంచామని ఎల్ అండ్ టీ సంస్థ గురువారం తెలిపింది. పెరిగిన చార్జీలు శనివారం(మే 17) నుంచి అమలులోకి వస్తాయని పేర్కొంది. మెట్రో రైలు అందుబాటులోకి వచ్చాక టికెట్ ధరలను పెంచడం ఇదే తొలిసారి. కరోనా అప్పుడు మెట్రో ఆదాయం భారీగా పడిపోయింది. ఆ తర్వాత మహాలక్ష్మి పథకం పేరిట రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పనతో మెట్రో ఆదాయంపై ప్రభావం చూపెడుతోంది. రోజుకు రూ. కోటికి పైగా నష్టాలతో మెట్రో నడుపుతున్నామని అధికారులు చాలాకాలంగా చెబుతున్నారు. అయితే, టికెట్ ధరల సవరణపై ఎల్అండ్‌టీ, మెట్రో, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు కేంద్రం 2022 సెప్టెంబరు 5న ఫేర్ ఫిక్సేషన్ కమిటీ (ఎఫ్ఎఫ్‌సీ)ని నియమించింది. హైకోర్టు మాజీ జడ్జి సారథ్యంలో ఏర్పాటైన ఆ కమిటీ హైదరాబాద్‌లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి 2023 జనవరి 25న కేంద్రానికి నివేదిక సమర్పించింది. అదే నెలలో రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం మొదలవ్వడంతో చార్జీల పెంపు అంశం మరుగున పడింది. చార్జీల పెంపునకు ఎల్ అండ్ టీ, మెట్రో అధికారులు ఏడాదిన్నరగా ప్రయత్నిస్తున్నా ప్రభుత్వం ఆ ప్రతిపాదనను పక్కనపెడుతూ వస్తోంది. చివరికి, నాటి ఎఫ్ఎఫ్‌సీ కమిటీ సిఫారసుల మేరకే ఇప్పుడు చార్జీలను సవరించారు. మెట్రో రైలు టికెట్ ధరల పెంపును లెఫ్ట్ పార్టీల నేతలు, ప్రయాణికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. టికెట్ ధరల పెంపు సామాన్య, మధ్య తరగతి ప్రజలకు భారమని ప్రోగ్రెసివ్ యూత్ ఫర్ లీగ్ (పీవైఎల్) రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ ప్రదీప్, డీవైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎండీ జావిద్ పేర్కొన్నారు.

వన్‌టైం చాన్స్' పరీక్షలపై ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల నిర్లక్ష్యం

» సమ్మర్ వెకేషన్ సాకు చెబుతున్న కాలేజీలు
» పరీక్షల నిర్వహణకు జేఎన్‌టీయూ టైం టేబుల్
» ఈ నెల 21 - జూన్ 19 వరకూ పరీక్షల నిర్వహణ
» 4,900 మందికి పైగా అభ్యర్థుల దరఖాస్తు

హైదరాబాద్ సిటీ, మే 15 (ఆంధ్రజ్యోతి): బీటెక్.. బీఈ, ఎంటెక్.. ఎంఈ, బీఫార్మసీ, ఎంఫార్మసీ, మేనేజ్‌మెంట్ కోర్సులు పూర్తయినా బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు మిగిలి పోయిన విద్యార్థుల్లో 'వన్ టైం చాన్స్'కు అర్హులైన వారికి స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు జేఎన్‌టీయూ పరీక్షల విభాగం టైం టేబుల్ విడుదల చేసింది. ఈ నెల 21 నుంచి వచ్చే నెల 19 వరకూ నెల రోజులు పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల తొమ్మిదో తేదీతో గడువు ముగిసింది. వన్‌టైం చాన్స్ కోసం మొత్తం 4,900 మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, సుమారు 21 వేల సబ్జెక్టు (పేపర్) పరీక్షలు రాయాల్సి ఉంటుంది. 'వన్‌టైం చాన్స్'కు అర్హులైన విద్యార్థులకు పరీక్షల టైం టేబుల్ సమాచారం అందించాలని వర్సిటీ అనుబంధ ప్రైవేటు ఇంజినీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ కాలేజీల ప్రిన్సిపాళ్లకు జేఎన్‌టీయూ పరీక్షల విభాగం డైరెక్టర్ లేఖ రాశారు. ఆ సమాచారాన్ని విద్యార్థులకు చేరవేయడంలో పలు ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలు.. సమ్మర్ వెకేషన్ సాకుతో ఎప్పుడు పరీక్షలు నిర్వహిస్తారన్న సమాచారం ఇవ్వకుండా తమను ఇబ్బంది పెడుతున్నాయన్న విద్యార్థులు.. జేఎన్‌టీయూ పరీక్షల విభాగం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఒక్కో సబ్జెక్టుకు రూ.400 ఫీజు వసూలు చేసిన జేఎన్‌టీయూ పరీక్షల విభాగం నుంచైనా తమ ఫోన్ నంబర్లకు ఎస్ఎంఎస్‌ల రూపంలో గానీ, వాట్సాప్ మెసేజ్‌ల రూపంలో గానీ సమాచారం ఇవ్వకపోవడం తీవ్ర ఆక్షేపణీయం అని విద్యార్థులు పేర్కొన్నారు.

అప్పుల బాధతో రైతు కూలి ఆత్మహత్య

చిన్నశంకరంపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ భరించలేక ఓ రైతు గురువారం ఆత్మహత్య పాల్పడ్డాడు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని శాలిపేట గ్రామానికి చెందిన మాలే సత్యనారాయణ(41) కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అప్పుల భారం అధికం కావడంతో మనస్తాపానికి గురై తన వ్యవసాయ పొలం వద్దే చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య పాల్పడ్డాడు.

ఆడబిడ్డలను అవమానిస్తున్న రేవంత్ సర్కార్

» బీఆర్ఎస్ మహిళా నేతలు సునీత, స్రవంతి
» రేవంత్‌పై చర్య తీసుకోవాలని సోనియాగాంధీకి లేఖ

హైదరాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెలంగాణ ఆడబిడ్డలను అవమానిస్తోందని బీఆర్ఎస్ నేతలు గొంగిడి సునీత, పాల్వాయి స్రవంతి ఆరోపించారు. సంప్రదాయ పద్ధతుల్లేని అందాల పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన అభ్యర్థులకు తెలంగాణ ఆడబిడ్డలతో ఎలా కాళ్లు కడిగించారని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో వారిద్దరూ గురువారం మీడియాతో మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాలోని ఇద్దరు మహిళా మంత్రులతో అందాల పోటీ అభ్యర్థుల కాళ్లు కడిగిస్తే, రాష్ట్ర ప్రభుత్వానికి పేరొచ్చేదని వ్యాఖ్యానించారు. సరస్వతీ నదీ పుష్కరాల్లో సీఎం దంపతుల కటౌట్ కింద అమ్మవారి ఫొటో ఏర్పాటు చేశారని, రేవంత్ రెడ్డికి ఎందుకంత అహంకారమని నిలదీశారు. ఇదిలా ఉంటే, ఆత్మ గౌరవంతో సాధించుకున్న తెలంగాణ ఆడబిడ్డలతో విదేశీ సుందరీమణుల కాళ్లు కడిగించిన రేవంత్‌రెడ్డి.. వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసినందుకు రాష్ట్ర మహిళలకు క్షమాపణ చెప్పాలని, లేకుంటే ఆయనపై చర్య తీసుకోవాలని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్ పర్సన్ సోనియాగాంధీకి లేఖ రాసిన బీఆర్ఎస్ మహిళా నేతలు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, సునీతా లక్ష్మారెడ్డి, కోవాలక్ష్మి లేఖ రాశారు. కాగా, బీఆర్ఎస్ఎల్పీ విప్ కె.పి.వివేకానంద మీడియాతో మాట్లాడుతూ.. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ప్రజలతోపాటు కోర్టులనూ తప్పుదారి పట్టిస్తోందని ఆరోపించారు. గత ప్రభుత్వంపై ఇప్పటికే పదికి పైగా విచారణలు చేపట్టినా ఏమీ రుజువు చేయలేదన్నారు. ఇప్పుడు ధరణి ఫోరెన్సిక్ ఆడిట్ విచారణ అంటూ ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

తుర్కియే సంస్థతో మనూ వర్సిటీ ఎంఓయూ రద్దు

హైదరాబాద్ సిటీ, మే 15 (ఆంధ్రజ్యోతి): ఇండియా పాకిస్థాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్థాన్‌కు మద్దతుగా నిలిచిన తుర్కియేపై దేశంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ(మనూ) యూనివర్సిటీ ఆ దేశంలోని యూనస్ ఎమ్రే ఇనిస్టిట్యూట్‌తో తుర్కియే భాషను బోధించేందుకు చేసుకున్న ఐదేళ్ల ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. ఒప్పందంలో భాగంగా వర్సిటీ నియమించుకున్న తుర్కియే అధ్యాపకుడిని వర్సిటీ అధికారులు స్వదేశానికి పంపారు. తాజా పరిణామాల నేపథ్యంలో యూనస్ ఎమ్రే ఇనిస్టిట్యూట్‌తో కుదిరిన ఎంవోయూను రద్దు చేసుకున్నట్లు అధికారులు ప్రకటించారు.

కుమారుడితో కలిసి నిజాంసాగర్‌లో దూకిన తల్లి

» ఆర్థిక ఇబ్బందులతోనే ఆత్మహత్య
» 20 రోజుల క్రితమే భర్త బలవన్మరణం
» అనాథగా మారిన 12 ఏళ్ల కూతురు

నిజాంసాగర్/ కల్హేర్, మే 15 (ఆంధ్రజ్యోతి): భర్త బలవన్మరణం, ఆర్థిక ఇబ్బందులతో దిక్కుతోచని స్థితిలోపడిపోయిన ఆమె, తన ఎనిమిదేళ్ల కుమారుడితో కలిసి నిజాంసాగర్ ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకుంది. సంగారెడ్డి జిల్లా నిజాంపేట్ మండలం మునిగేపల్లి గ్రామానికి చెందిన దార ప్రమీల (30) వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తోంది. ఈమెకు కుమారుడు అక్షయ్ (8), కూతురు నిహారిక ఉన్నారు. ప్రమీల భర్త సాయిలు 20 రోజుల క్రితమే అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటిపెద్ద చనిపోవడంతో కుటుంబం గడవడమే కష్టంగా మారింది. ఓ వైపు ఆర్థిక ఇబ్బందులు, మరోవైపు భర్త మరణంతో ప్రమీల మనోవేదనకు గురైంది. గురువారం ఇంట్లోంచి కొడుకు అక్షయ్‌ని వెంటబెట్టుకొని బయలు దేరింది. కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్టు వద్దకు వచ్చి నీళ్లలోకి దూకింది. మధ్యాహ్నం చేపలు పట్టేవారికి మృతదేహాలు కనిపించడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. వారొచ్చి మృతదేహాలను బయటకు తీయించి పోస్టుమార్టం కోసం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమీల కుమార్తె నిహారిక అంతకుముందే అమ్మమ్మ ఇంటికి వెళ్లడంతో ప్రాణాలతో బయటపడినట్లయిందని గ్రామస్థులు చెప్పారు. ఇటీవల తండ్రి, తాజాగా తల్లి ఆత్మహత్యతో 12 ఏళ్ల నిహారిక అనాథగా మారింది.

మహారాష్ట్ర టౌన్ ప్లానింగ్ అధికారి ఇంట్లో

నగల గుట్ట, కరెన్సీ కట్టలు!

» రూ.23.25 కోట్ల విలువైన స్వర్ణ, వజ్రాభరణాల స్వాధీనం
» రూ. 9.04 కోట్ల నగదు కూడా
» హైదరాబాద్, ముంబైతో పాటు 13 ప్రాంతాల్లో ఈడీ సోదాలు
» 2016లో ఓ లంచం కేసులో అరెస్టు అయిన వైఎస్ రెడ్డి
» ఆయన స్వస్థలం కర్నూలు జిల్లా?


ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్న నగలు, నగదు కట్టలు

హైదరాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని వాసయి విరార్ మున్సిపల్ కార్పొరేషన్ (వీవీఎంసీ) టౌన్ ప్లానింగ్ డిప్యూటీ డైరెక్టర్ వైఎస్ రెడ్డికి చెందిన నివాసాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు కళ్లు చెదిరే స్వర్ణ, వజ్రాభరణాలు, భారీ మొత్తంలో నగదును స్వాధీనం చేసుకున్నారు. ముంబై, హైదరాబాద్, ఏపీలోని కర్నూలుతో పాటు 13 చోట్ల వైఎస్ రెడ్డికి చెందిన నివాసాల్లో జరిగిన సోదాల్లో రూ.9.04 కోట్ల నగదు, రూ.23.25 కోట్ల బంగారు, వజ్రాభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మహారాష్ట్రలోని మిరబయందర్ పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులు ఆధారంగా దర్యాప్తు ప్రారంభించిన ఈడీ అధికారులు.. సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, డంపింగ్‌యార్డు కోసం కేటాయించిన స్థలాల్లో అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చి కోట్లాది రూపాయలు సంపాదించినట్లు గుర్తించారు. ఈ క్రమంలో కొన్నాళ్లుగా వైఎస్ రెడ్డికి చెందిన బంధువులు, సన్నిహితులపై నిఘాపెట్టారు. ఈ క్రమంలో తాజాగా ఈడీ దాడులు నిర్వహించి స్వర్ణ, వజ్రాభరణాలు, భారీ మొత్తంలో నగదును స్వాధీనం చేసుకున్నారు. వివిఎంసీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్థలంలో 41 భవనాలు అక్రమంగా నిర్మించారని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఈ భవనాలను కూల్చివేయాలని ముంబై హైకోర్టు గతేడాది ఆదేశాలు ఇచ్చింది. హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో బిల్డర్లు సవాలు చేశారు. అయితే, సుప్రీంకోర్టు వీరికి ఎలాంటి ఊరట ఇవ్వకుండా పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. ఈ క్రమంలో ఈ ఏడాది ఫిబ్రవరి 20న వివిఎంసీ అధికారులు 41 అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. 2009 నుంచి ప్రారంభమైన ఈ అక్రమ నిర్మాణాలు సీతారాం గుప్తా, అరుణ్‌గుప్తా ఆధ్వర్యంలో జరిగాయని, నాటి వివిఎంసీ అధికారులు వీరికి సహకరించారని ఈడీ విచారణలో వెల్లడైంది. కాగా, వైఎస్ రెడ్డి కర్నూలు జిల్లాకు చెందిన వ్యక్తి అయినట్లు సమాచారం. ఆయన హైదరాబాద్‌లో ఎక్కువగా ఆస్తులను కూడబెట్టినట్లు ఈడీ అధికారుల విచారణలో వెల్లడైంది.

మెదడు చికిత్సల్లో సరికొత్త విప్లవం

» మెదడు క్యాన్సర్ కణితులకు గామానైఫ్‌తో చెక్
» సర్జరీ లేకుండానే వైద్య ప్రక్రియ.. కిమ్స్ ఆస్పత్రిలో ప్రారంభం
» సీఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు వెల్లడి



గామానైఫ్ సెంటర్ ప్రారంభోత్సవంలో కిమ్స్ సీఎండీ బొల్లినేని భాస్కరరావు, సీనియర్ న్యూరోసర్జన్ డాక్టర్ మానస్ పాణిగ్రాహి తదితరులు

హైదరాబాద్ సిటీ, మే 15(ఆంధ్రజ్యోతి): మెదడులో ఏర్పడే క్యాన్సర్ కణితులకు శస్త్రచికిత్స లేకుండా చికిత్స చేసే గామా నైఫ్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. దీనికి సంబంధించి గామా నైఫ్ సెంటర్‌ను గురువారం కిమ్స్ ఆస్పత్రిలో ప్రారంభించారు. శస్త్రచికిత్స అవసరాన్ని దాదాపుగా తప్పించడంతో పాటు వేగంగా కోలుకునే పద్ధతిని రోగులకు అందిస్తున్నామని కిమ్స్ సీఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు తెలిపారు. ఈ ప్రక్రియలో మిల్లీ మీటర్లు, అంతకంటే తక్కువ ప్రదేశాన్ని కూడా గుర్తించి, మెదడులోపల ఉన్న భాగాలకు చికిత్స చేసేందుకు రేడియేషన్ కిరణాలను ఇందులో పంపుతారని సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ మానస్ పాణిగ్రాహి వివరించారు. ఇందులో అసలు రక్తం కారదని, నొప్పి కూడా ఉండదన్నారు. వయసు, ఆరోగ్యం కారణంగాను, కణితి ఉన్న ప్రదేశం వల్ల శస్త్రచికిత్స చేయలేనివారికి ఇది మరింత ప్రయోజనకరమని న్యూరో ఆంకాలజీ, న్యూరోసర్జరీ కేసుల్లో గామా నైఫ్ కీలకమైన మార్పులు చోటు చేసుకుంటాయన్నారు. 30 నిమిషాల నుంచి 2 గంటల లోపల ప్రక్రియ పూర్తవుతుందన్నారు. చికిత్స అనంతరం 24 నుంచి 48 గంటల్లోనే 90 శాతం రోగులు తమ పనులు చేసుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు దీరేంద్ర ప్రసాద్, చంద్రశేఖర్ నాయుడు, సంబిత్ శేష, జోసఫ్ పాల్గొన్నారు.

తిరిగొస్తాం.. సాయం చేయండి

» ఎడారిలో తల్లిబిడ్డల వీసా గోడు

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి, మే 15: ఉపాధి కోసం పొట్ట చేత పట్టుకుని దుబాయ్‌కి వెళ్లిన వలస జీవుల కష్టాలు తీరడం లేదు. ఏజెంట్ చేతిలో మోసపోయి స్వదేశానికి తిరిగిరాకపోవడం, ప్రమాదాల్లో గాయపడటం, మరణించడం వంటి ఎన్నో విషాదాలు నేటికి చోటు చేసుకుంటూనే ఉన్నాయి. తాజాగా వీసా నియమ నిబంధనలు తెలియకుండా తన నెల రోజుల పసికందుతో ఒక తెలుగు మాతృమూర్తి దుబాయ్‌లో ఇరుక్కుని సాయం కోసం ఎదురుచూస్తోంది. హైద్రాబాద్‌లోని రాజేంద్ర నగర్ కు చెందిన రాఘల సుధారాణి సౌదీ అరేబియాలో నర్సుగా పని చేస్తుండగా ఆమె భర్త కుటుంబం భారత్‌లో ఉంటున్నారు. కొద్ది కాలం క్రితం స్వదేశానికి వెళ్లి తిరిగి వచ్చిన ఆమె గర్భం దాల్చింది. జూన్‌లో ప్రసవించాల్సి ఉంది. వీసా పరమైన సమస్యలను ముందుగా ఊహించిన సుధారాణి తాను ప్రసవ సమయానికి స్వదేశానికి వెళ్ళడానికి ప్రయత్నించింది. కానీ ఈ సమయంలో ప్రయాణం చేయడం ప్రమాదకరమని వైద్యులు అనుమతి నిరాకరించడంతో సుధారాణి అక్కడే బిడ్డకు జన్మించింది. పాపకు సౌదీ అరేబియా ప్రభుత్వం జారీ చేసిన జనన ధ్రువీకరణ పత్రం, భారతీయ ఎంబసీ జారీ చేసిన పాస్‌పోర్టును తీసుకుని స్వదేశానికి బయలుదేరింది. కానీ రియాద్ విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ తనిఖీలో సుధారాణి వీసాలో బిడ్డ పేరు లేకపోవడంతో అధికారులు ప్రయాణానికి అనుమతించలేదు. పరిస్థితిని తెలుసుకున్న ఓ మలయాళీ సుధారాణిని భారతీయ కాన్సులేటుకు చేర్చాడు. కాన్సులేటు సిబ్బంది వెంటనే విషయాన్ని సౌదీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పుట్టిన బిడ్డ పేరును ఇఖామా(వీసా)లో చేర్చాల్సి ఉంటుందని, ఆ తర్వాత మాత్రమే శిశువు తన తల్లితో కలిసి స్వదేశానికి పంపడానికి అనుమతిస్తామని వారు తెలిపారు. తల్లిబిడ్డలకు తెలుగు ప్రవాసీ సంఘం అధ్యక్షుడు మల్లేషన్ విశ్వనాథం తన ఇంట్లో ఆశ్రయం కల్పించారు. వీసా ప్రక్రియ పూర్తి కావాల్సి వచ్చిందని ఒకటి, రెండు రోజుల్లో వారిని స్వదేశానికి పంపిస్తామని మల్లేషన్ తెలిపారు.

వడదెబ్బతో నలుగురి మృత్యువాత

» మృతుల్లో ముగ్గురు ఖమ్మం జిల్లా వారే..

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. వడదెబ్బతో గురువారం నలుగురు మృత్యువాత పడ్డారు. మృతుల్లో ముగ్గురు ఖమ్మం జిల్లా వారే. ఖమ్మం శుక్రవారిపేట కాలనీలోని కూరగాయల వ్యాపారి ఎస్కే రఫీ బాబు (44), మామిళ్లగూడేనికి వెళ్లే దారిలో బ్రిడ్జి పక్కన ఓ గుర్తు తెలియని వృద్ధుడు, తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లిలో వృద్ధురాలు ఇండ్ల రాజమ్మ (58) వడదెబ్బతో అస్వస్థతకు గురై మరణించారు. జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం వనపర్తిలో ఉపాధి కూలీ ఎర్ర సుధాకర్ (54)కు పని ప్రదేశంలో ఎండదెబ్బ తగిలి కుప్పకూలాడు. ప్రాథమిక చికిత్స అందించేలోపే ప్రాణాలు కోల్పోయాడు. హైదరాబాద్ సహా జిల్లాల్లో అక్కడక్కడ కురిసిన వానలతో కొన్నిచోట్ల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవడంతో రైతులు కన్నీరుమున్నీరయ్యారు. హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో తెల్లవారు జామున భారీ వర్షం కురిసింది. గోల్కొండలో అత్యధికంగా 3 సెంమీ వర్షపాతం నమోదైంది. సంగారెడ్డి జిల్లాలో ఈదురు గాలులతో కురిసిన వర్షంతో సంగారెడ్డి, హత్నూర, చౌటకూర్ మండలాల్లో కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడిసి రైతులకు నష్టం వాటిల్లింది. కొండాపూర్ కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పరిశీలించారు. జిన్నారంలో కొనుగోలు కేంద్రంతోపాటు రోడ్లపై ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. జోగిపేట మార్కెట్ యార్డులో వర్షానికి వడ్లు కొట్టుకుపోయాయి. మెదక్ జిల్లా రేగోడు, అల్లాదుర్గం, పాపన్నపేట, చిలప్‌చెడ్, వెల్దుర్తి తదితర మండలాల్లో తెల్లవారు జామునే భారీ వర్షం పడింది. ఆయా ప్రాంతాల్లోనూ రైతులు ధాన్యాన్ని కాపాడుకునేందుకు ఇబ్బందులు పడ్డారు.

ఆర్టీసీ సీసీఎస్‌లో 15 రోజుల్లోగా రూ.1,029 కోట్లు జమ చేయాలి

» యాజమాన్యానికి సంఘం నోటీసు

హైదరాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల వేతనాల నుంచి వసూలు చేసిన సొమ్ము రూ.1,029 కోట్లు ఆర్టీసీ ఉద్యోగుల క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ (సీసీఎస్) ఖాతాలో జమ చేయనందుకు ముగ్గురు ఉన్నతాధికారులకు ఆర్టీసీ ఉద్యోగుల సంఘం నోటీసులు పంపింది. రాష్ట్ర రవాణాశాఖ ప్రత్యేక కార్యదర్శి వికాస్ రాజు, ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్, ఆర్టీసీ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ విజయ పుష్పలకు ఆ నోటీసులు అందజేసింది. ఉద్యోగుల కష్టార్జితం సంస్థ ఇతర అవసరాలకు వాడటం నిబంధనలకు పూర్తి విరుద్ధమని స్పష్టం చేసింది. 15 రోజుల్లో రూ.1,029 కోట్లు సీసీఎస్‌లో జమ చేయకుంటే న్యాయపరమైన చర్యలు తప్పవని తేల్చి చెప్పింది.

శాస్త్రీయంగా నీటి కేటాయింపులు చేయాలి

» కృష్ణా ట్రైబ్యునల్ ఎదుట తెలంగాణ వాదనలు

హైదరాబాద్, మే 15(ఆంధ్రజ్యోతి): పంటలకు నీటి కేటాయింపుల్లో శాస్త్రీయ విధానాన్ని పాటించాల్సిన అవసరం ఉందని, కృష్ణా బేసిన్ అవతలి ప్రాంతాల్లో వరి పంటలకు నీరిచ్చే బదులుగా కరవు పీడిత ప్రాంతాల్లో అరుతడి పంటలకు నీటిని కేటాయించడానికి ప్రాధాన్యం ఇవ్వాలని కృష్ణా ట్రైబ్యునల్-2ను తెలంగాణ కోరింది. న్యూఢిల్లీలోని జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ ముందు తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ వాదించారు. ఏపీలోని రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(సీఆర్‌డీఏ) ప్రాంతం పరిధిలో కృష్ణా డెల్టా సిస్టమ్(కేడీఎస్)తో పాటు నాగార్జునసాగర్ కుడి కాలువ ప్రాంతాలు వస్తున్నాయని, ఈ నేపథ్యంలో ఇక్కడ నీటి అవసరాలు తగ్గాయని, ఆ నీటిని బేసిన్‌లోని ప్రాజెక్టులకు కేటాయించాలని కోరారు.

స్పోర్ట్స్

వరంగల్ ● శుక్రవారం 16 మే 2025

గాయత్రి జోడీ పరాజయం

థాయ్ ఓపెన్‌లో ముగిసిన భారత పోరు

బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్ 500 టోర్నమెంట్‌లో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. గురువారం జరిగిన రెండో రౌండ్ పోటీల్లో గాయత్రి గోపీచంద్ జోడీ సహా ఉన్నతి హుడా, మాళవిక బన్సోడ్, ఆకర్షి కశ్యప్ నిష్క్రమించారు. డబుల్స్ రెండో రౌండ్‌లో గాయత్రి-ట్రీసా జాలీ జోడీ 20-22, 14-21తో రుయి-సయాక (జపాన్) జంట చేతిలో ఓడింది. తరుణ్ మన్నేపల్లి 14-21, 16-21తో ఆంటోన్సెన్ (డెన్మార్క్) చేతిలో ఓడాడు. ఉన్నతి 14-21, 11-21తో చోచువాంగ్ (థాయ్‌లాండ్) చేతిలో పరాజయం పాలైంది. మాళవిక 12-21, 16-21తో ఇంటనాన్ (థాయ్‌లాండ్) చేతిలో, ఆకర్షి 9-21, 14-21తో థాయ్ సోత్‌పా కటేథాంగ్ (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి పాలయ్యారు.

రన్నరప్ నిహాల్



అల్ ఐన్ (యూఏఈ): టాప్ సీడ్ గ్రాండ్‌మాస్టర్ నిహాల్ సరీన్ ఆసియా వ్యక్తిగత ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్‌లో రెండో స్థానంలో నిలిచాడు. గురువారం జరిగిన చివరి రౌండ్‌లో భారత జీఎం నిహాల్ ఇరాన్‌కు చెందిన బర్దియాను చిత్తు చేశాడు. తద్వారా సరీన్ వరుసగా నాలుగో విజయం నమోదు చేశాడు. బర్దియా, నిహాల్ చెరో ఏడు పాయింట్లతో సమంగా నిలిచినా..మెరుగైన టై బ్రేకర్ స్కోరుతో బర్దియా విజేతగా నిలిచాడు. ఈ టోర్నీలో ప్రదర్శనతో.. న్యూఢిల్లీలో జరిగే వరల్డ్ చెస్ కప్ బెర్త్‌ను నిహాల్ ఖరారు చేసుకున్నాడు.

తెలంగాణ 12, ఆంధ్రకు 18వ స్థానం

పట్నా: ఖేలో ఇండియా యూత్ గేమ్స్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. పన్నెండు రోజులుగా బిహార్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో మహారాష్ట్ర 58 స్వర్ణాలు సహా మొత్తం 158 పతకాలతో వరుసగా మూడోసారి ఓవరాల్ చాంపియన్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. తెలంగాణ 9 స్వర్ణాలు సహా 23 పతకాలతో 12వ స్థానం, ఆంధ్ర 3 స్వర్ణాలు సహా 24 పతకాలతో 18వ స్థానంతో సరిపెట్టుకున్నాయి. హరియాణా 117 పతకాలతో ద్వితీయ స్థానం, రాజస్థాన్ 60 పతకాలతో తృతీయ స్థానాన్ని సాధించాయి.

ఇంగ్లండ్ క్రికెట్ సలహాదారు సౌథీ



లండన్: భారత్‌తో ఐదు టెస్టుల సిరీస్‌ను పురస్కరించుకుని న్యూజిలాండ్ మాజీ పేసర్ టిమ్ సౌథీని ఇంగ్లండ్ జట్టు ప్రత్యేక నైపుణ్యాల సలహాదారుగా నియమించుకుంది. ఈమేరకు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు గురువారం ప్రకటించింది. లీడ్స్‌లో జూన్ 20నుంచి జరిగే తొలి టెస్టుతో ఇంగ్లండ్ పర్యటనను భారత్ ప్రారంభించనుంది.



రేసులో ఎవరెవరు?

సీఎస్‌కే, రాజస్థాన్, సన్‌రైజర్స్ మినహా మిగిలిన ఏడు జట్లు కూడా సాంకేతికంగా ఐపీఎల్ ప్లేఆఫ్స్ రేసులో ఉన్నాయి. కానీ టాప్-4కు మెరుగైన అవకాశాలున్నాయి. ప్రస్తుతం పట్టికలో గుజరాత్, బెంగళూరు టాప్-2లో ఉండగా.. వీరికి మరో విజయం చాలు. ఒకవేళ మిగిలిన మూడు మ్యాచ్‌లను గెలిస్తే కచ్చితంగా టాప్-2లో ముగిస్తారు. అలాగే మూడో స్థానంలో ఉన్న పంజాబ్ కూడా ఓ విజయం దూరంలోనే ఉంది. 14 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉన్న ముంబై జట్టు డీసీ, పంజాబ్‌లపై కచ్చితంగా నెగ్గాల్సి ఉంటుంది. ఢిల్లీ క్యాపిటల్స్ మిగిలిన మూడింటిని గెలిచాక కూడా ఇతర ఫలితాల కోసం చూడాల్సిందే. ఇక ఎల్ఎస్‌జీ, కేకేఆర్ అన్ని మ్యాచ్‌లను గెలిచినా వారి ఖాతాలో 16, 15 పాయింట్లు మాత్రమే ఉంటాయి కాబట్టి ఆశలు వదులుకోవాల్సిందే.

ప్లేఆఫ్స్‌కు సఫారీలు దూరం

బీసీసీఐ-సీఎస్ఏ మధ్య చర్చలు విఫలం

డబ్ల్యూటీసీ ఫైనల్‌కు పెద్దపీట

న్యూఢిల్లీ: రేపటి నుంచి ఐపీఎల్ పునఃప్రారంభం కానుంది. అయితే మారిన షెడ్యూల్‌తో ప్లేఆఫ్స్ రేసులో ఉన్న ముంబై, గుజరాత్, పంజాబ్, ఢిల్లీ, బెంగళూరు జట్లపై గట్టి దెబ్బే పడనుంది. ఎందుకంటే ఈ టీమ్స్‌లో ఉన్న దక్షిణాఫ్రికా ఆటగాళ్లు లీగ్ దశకే పరిమితమై ప్లేఆఫ్స్‌కు దూరం కాబోతున్నారు. భారత్-పాకిస్థాన్ యుద్ధం కారణంగా లీగ్‌ను ఈనెల 9న వాయిదా వేయగా తిరిగి 17 నుంచి ఆరంభించనున్న విషయం తెలిసిందే. అయితే జూన్ 11 నుంచి ఆసీస్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య డబ్ల్యూటీసీ ఫైనల్ జరుగుతుంది. ప్రస్తుతం లీగ్‌లో ఆడుతున్న సఫారీ ప్లేయర్లలో ఎనిమిది మందికి ఈ ఫైనల్ జట్టులోనూ చోటు లభించింది. అంతేకాకుండా వీరిలో ఏడుగురు ప్లేఆఫ్స్ రేసులో ఉన్న జట్లతోనే ఉండడం గమనార్హం. గతంలో అనుకున్న షెడ్యూల్ ప్రకారం మే 25 వరకు మాత్రమే క్రికెట్ సౌతాఫ్రికా (సీఎస్ఏ) తమ ఆటగాళ్లకు ఎన్‌ఓసీ ఇచ్చింది. కానీ ఐపీఎల్ ఫైనల్ జూన్ 3కి మారడంతో ఇబ్బంది ఏర్పడింది. దీంతో వారి ఎన్‌ఓసీ పొడిగింపు కోసం బీసీసీఐ ప్రయత్నాలు చేసినా సీఎస్ఏ తోసిపుచ్చింది. ఈ నెల 26 వరకల్లా డబ్ల్యూటీసీ ఫైనల్ కోసం ఆటగాళ్లు తిరిగి రావాలని సఫారీ జట్టు కోచ్ షుక్రి కాన్రాడ్ ఇదివరకే స్పష్టం చేశాడు. అయితే మిగతా సౌతాఫ్రికా ఆటగాళ్లకు ఎలాంటి ఇబ్బంది లేదు. మరోవైపు ఈ పరిణామాలు ముంబై ఇండియన్స్‌పై గట్టి ప్రభావం చూపనుంది. ఈ టీమ్‌లో కీలకంగా ఉన్న రికెల్టన్, బోష్ (దక్షిణాఫ్రికా)లతో పాటు ఇంగ్లండ్ ప్లేయర్ విల్ జాక్స్ కూడా విండీస్‌తో సిరీస్ కోసం వెళ్లనున్నాడు. అలాగే హాజెల్‌వుడ్ గాయంతో దూరం కానున్నాడని వార్తలు వెలువడినా త్వరలోనే తను ఆర్‌సీబీతో కలువనున్నట్టు సమాచారం. కాగా, ఎన్‌గిడి, రూథర్‌ఫోర్డ్ (విండీస్) కూడా లీగ్ దశ అయ్యాక వెనుదిరగనున్నారు. ఇదిలావుండగా ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్ ఉన్నప్పటికీ ఐపీఎల్‌లో ఆడే వెస్టిండీస్ ఆటగాళ్లు మాత్రం పూర్తిగా అందుబాటులో ఉంటారని బీసీసీఐ తెలిపింది.



ప్లేఆఫ్స్‌కు దూరమయ్యే సఫారీలు వీరే..

రబాడ (గుజరాత్), మార్‌క్రమ్ (లఖ్‌నవూ), జాన్సెన్ (పంజాబ్), స్టబ్స్ (ఢిల్లీ), ఎన్‌గిడి (బెంగళూరు), ముల్డర్ (సన్‌రైజర్స్), రికెల్టన్, బోష్ (ముంబై).

బట్లర్ స్థానంలో కుశాల్





జేమిసన్

ప్లేఆఫ్స్ రేసులో అందరికంటే ముందున్న గుజరాత్ టైటాన్స్‌కు స్టార్ ప్లేయర్ బట్లర్ దూరం కానున్నాడు. విండీస్‌తో సిరీస్ ఉండడంతో తను ఇంగ్లండ్ జట్టులో చేరనున్నాడు. దీంతో ఆ జట్టు చివరి లీగ్ మ్యాచ్ నుంచే దూరం కానుండగా.. అతడి స్థానంలో కుశాల్ మెండిస్‌ను తీసుకున్నారు. అలాగే పంజాబ్ పేసర్ ఫెర్గూసన్ స్థానంలో కైల్ జేమిసన్ ఆడనున్నాడు. ఇక లఖ్‌నవూ పేసర్ మయాంక్ గాయంతో సీజన్‌కు దూరమవడంతో విలియమ్ ఓరూర్కీని తీసుకున్నారు. కేకేఆర్ నుంచి ఆల్‌రౌండర్ మొయిన్ అలీతో పాటు పావెల్ (విండీస్), సీఎస్‌కే నుంచి సామ్ కర్రాన్, ఓవర్టన్ కూడా భారత్‌కు రావడం లేదు.

షఫాలీకి చోటు

అరుంధతి, శ్రీచరణి ఎంపిక

ఇంగ్లండ్‌లో భారత మహిళల టూర్





హర్మన్‌ప్రీత్, మంధాన

న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌లో ఆ జట్టుతో పరిమిత ఓవర్ల సిరీస్‌లో తలపడే భారత మహిళా జట్లను గురువారం ప్రకటించారు. ఈ పర్యటనలో భాగంగా భారత్-ఇంగ్లండ్ జట్లు ఐదు టీ20లు, మూడు వన్డేలలో తలపడనున్నాయి. వచ్చే నెల 28న ట్రెంట్‌బ్రిడ్జ్‌లో జరిగే మొదటి టీ20తో భారత్ పర్యటన ప్రారంభమవుతుంది. ఇక.రెండు జట్లకు హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా, స్మృతీ మంధాన వైస్-కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. ఇక ఏడు మాసాల విరామం తర్వాత ఓపెనర్ షఫాలీ వర్మకు జాతీయ జట్టులో చోటు దక్కింది. ఫామ్ కోల్పోయిన షఫాలీ గతేడాది అక్టోబరు తర్వాత బెర్త్ టీమిండియాలో దక్కించుకోలేకపోయింది. కాగా రెండు జట్లలో తెలుగు క్రికెటర్లు అరుంధతి రెడ్డి, శ్రీచరణి ఎంపికయ్యారు. ఇటీవల శ్రీలంకలో జరిగిన ముక్కోణపు వన్డే టోర్నీ గెలిచిన భారత జట్టుకు అరుంధతి, శ్రీచరణి ప్రాతినిధ్యం వహించిన విషయం తెలిసిందే.

ఇంగ్లండ్‌తో సిరీస్ షెడ్యూల్

జూన్ 28	తొలి టీ20, ట్రెంట్‌బ్రిడ్జ్
జూలై 1	రెండో టీ20, బ్రిస్టల్
జూలై 4	మూడో టీ20, కెన్నింగ్టన్ ఓవల్
జూలై 9	నాలుగో టీ20, ఓల్డ్‌ట్రాఫర్డ్
జూలై 12	ఐదో టీ20, ఎడ్జ్‌బాస్టన్
జూలై 16	మొదటి వన్డే, సౌతాంప్టన్
జూలై 19	రెండో వన్డే, లార్డ్స్
జూలై 22	మూడో వన్డే, చెస్టర్ లీ స్ట్రీట్.



మేం క్లోజ్‌ఫ్రెండ్స్ కాదు..

అర్షద్‌తో స్నేహంపై నీరజ్ చోప్రా

దోహా: పాకిస్థాన్‌కు చెందిన జావెలిన్ త్రోయర్ అర్షద్ నదీమ్‌తో తన స్నేహంపై భారత స్టార్ నీరజ్ చోప్రా వివరణ ఇచ్చాడు. అతడు తనకు ఎప్పుడూ సన్నిహిత మిత్రుడు కాదన్నాడు. బెంగళూరులో ఈనెల 24న తన పేరిట నిర్వహించాల్సిన జావెలిన్ త్రో పోటీకి అర్షద్ నదీమ్‌ను చోప్రా ఆహ్వానించాడు. అయితే పహల్గామ్ దాడి నేపథ్యంలో ఈ పోటీ రద్దయింది. అర్షద్‌ను భారత్‌కు ఆహ్వానించిన నీరజ్‌పై నెటిజన్లు విమర్శల దాడి చేశారు. 'నదీమ్‌తో నాకేమీ బలమైన బంధం లేదు. సన్నిహిత మిత్రత్వం అసలే లేదు. ప్రస్తుతం రెండు దేశాల మధ్య ఉన్న ఉద్రిక్త వాతావరణం దరిమిలా మా ఇద్దరి మధ్య బంధం గతంలో మాదిరిగా అసలే ఉండబోదు' అన్నాడు.

భారీగా పెరిగిన డబ్ల్యూటీసీ ప్రైజ్‌మనీ



విజేతకు రూ.30.78 కోట్లు

భారత్ ఖాతాలో రూ.12.31 కోట్లు

దుబాయ్: వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ప్రైజ్‌మనీని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) భారీగా పెంచింది. గత రెండు సీజన్ల వరకు ఇది కేవలం రూ.32.48 కోట్లు మాత్రమే ఉండగా.. తాజా 2023-25 డబ్ల్యూటీసీ సైకిల్‌లో ఈ మొత్తం రూ.49.27 కోట్లకు పెరగడం విశేషం. జూన్ 11 నుంచి లార్డ్స్‌లో దక్షిణాఫ్రికా-ఆస్ట్రేలియా జట్ల మధ్య ఫైనల్ జరగనుంది. ఇందులో గెలిచిన జట్టుకు రూ.30.78 కోట్ల ప్రైజ్‌మనీ దక్కనుంది. అదే గత రెండు పర్యాయాలు విజేతలకు రూ.13.67 కోట్ల చొప్పున మాత్రమే అందాయి. అలాగే ఈసారి రన్నరప్‌గా నిలిచిన జట్టుకే రూ.18.46 కోట్లు ఇవ్వనున్నారు. మూడో స్థానంలో నిలిచిన టీమిండియాకు రూ.12.31 కోట్లు దక్కుతాయి. అలాగే వరుసగా న్యూజిలాండ్‌కు రూ.10.26 కోట్లు, ఇంగ్లండ్‌కు రూ.8.2 కోట్లు, శ్రీలంకకు రూ.7.18 కోట్లు, బంగ్లాదేశ్‌కు రూ.6.15 కోట్లు, వెస్టిండీస్‌కు రూ.5.13 కోట్లు, పాకిస్థాన్‌కు రూ.4.10 కోట్లు అందనున్నాయి.



శ్రీహరి 86వ గ్రాండ్‌మాస్టర్

చెన్నై: తమిళనాడుకు చెందిన ఎల్. ఆర్.శ్రీహరి గ్రాండ్‌మాస్టర్ హోదా పొందిన 86వ భారత్ ఆటగాడిగా నిలిచాడు. గత ఏడాది మేలో జరిగిన దుబాయ్ ఓపెన్‌లో 2500 ఎలో రేటింగ్ సాధించిన 19 ఏళ్ల శ్రీహరి..అంతకుముందు బుడాపెస్ట్ టోర్నీలో తొలి జీఎం నార్మ్, తర్వాత ఖతార్ మాస్టర్స్ చాంపియన్‌షిప్‌లో రెండో జీఎం నార్మ్ సొంతం చేసుకున్నాడు. ఇక.ప్రస్తుతం అబుధాబిలో జరుగుతున్న ఆసియా వ్యక్తిగత చెస్ టోర్నమెంట్‌లో అతడు తుది జీఎం నార్మ్ సాధించాడు. దాంతో శ్రీహరికి ప్రతిష్ఠాత్మక గ్రాండ్‌మాస్టర్ టైటిల్ లభించింది.

బిజినెస్



ప్రపంచ టాప్-50 బ్రాండ్లలో టీసీఎస్

రూ. 4.90 లక్షల కోట్లకు కంపెనీ బ్రాండ్ విలువ

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎయిర్‌టెల్, ఇన్ఫీకీ చోటు

న్యూఢిల్లీ: దేశీయ ఐటీ సేవల దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్).. ప్రపంచంలోని అత్యంత విలువైన 50 కంపెనీల్లో ఒకటిగా నిలిచింది. 5,730 కోట్ల డాలర్ల (దాదాపు రూ.4.90 లక్షల కోట్లు) బ్రాండ్ విలువతో 45వ స్థానాన్ని దక్కించుకుంది. బ్రాండ్ల విలువను మదింపు చేసే లండన్ కంపెనీ కాంటార్.. ఈ ఏడాదికి గాను ప్రపంచంలోని టాప్-100 బ్రాండ్ల జాబితాను గురువారం విడుదల చేసింది. గత ఏడాదితో పోలిస్తే టీసీఎస్ బ్రాండ్ విలువ 28 శాతం పెరిగిందని కాంటార్ తెలిపింది.

ఈ జాబితాలో భారత్‌కు చెందిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్ సైతం చోటు సాధించాయి. 4,495 కోట్ల డాలర్ల (రూ.3.84 లక్షల కోట్లు) బ్రాండ్ వాల్యూతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 56వ స్థానంలో నిలిచింది. ఎయిర్‌టెల్ 3,709 కోట్ల డాలర్ల (రూ.3.17 లక్షల కోట్లు) విలువతో 66వ స్థానంలో ఉంది. 3,309 కోట్ల డాలర్ల (రూ.2.83 లక్షల కోట్లు) బ్రాండ్ విలువతో ఇన్ఫోసిస్ 73వ స్థానంలో నిలిచింది.

వరల్డ్ నం.1 బ్రాండ్ యాపిల్

ఐఫోన్ల తయారీ దిగ్గజం యాపిల్ ప్రపంచంలోనే అత్యంత విలువైన బ్రాండ్‌గా తన అగ్రస్థానాన్ని కొనసాగించింది. కాంటార్ నివేదిక ప్రకారం.. యాపిల్ బ్రాండ్ విలువ 1.3 లక్షల కోట్ల డాలర్లు. అంటే, మన కరెన్సీలో రూ.1.11 కోట్ల కోట్లు. గుగూల్ (94,413.7 కోట్ల డాలర్లు), మైక్రోసాఫ్ట్ (94,413 కోట్ల డాలర్లు) వరుసగా 2, 3వ అత్యంత విలువైన బ్రాండ్లుగా నిలిచాయి. అమెజాన్, ఎన్‌విడియా 4, 5వ స్థానాల్లో ఉన్నాయి.

ఎన్‌సీసీ లాభం రూ. 254 కోట్లు

ఒక్కో షేరుకు 110% డివిడెండ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎన్‌సీసీ లిమిటెడ్ 2024-25 ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ.6,189.36 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.253.82 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. మొత్తం ఆర్థిక సంవత్సరానికి కంపెనీ రూ.22,354.91 కోట్ల ఆదాయంపై రూ.819.88 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.2.20 (110 శాతం) డివిడెండ్‌ను కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. గడచిన ఆర్థిక సంవత్సరంలో కొత్తగా రూ.32,888 కోట్ల విలువైన ఆర్డర్లను చేజిక్కించుకోవటంతో ఆర్డర్ బుక్ రూ.71,568 కోట్లకు చేరుకుందని ఎన్‌సీసీ వెల్లడించింది.

- స్మింగ్ మెటావర్స్ లిమిటెడ్.. మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను రూ.407.36 కోట్ల ఆదాయంపై రూ.35.25 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2023-24తో పోల్చితే ఆదాయం (రూ.151.21 కోట్లు) 169.40 శాతం వృద్ధి చెందగా లాభం (రూ.10.82 కోట్లు) ఏకంగా 225.79 శాతం పెరిగింది. కాగా బ్లాక్‌చెయిన్ వాలిడేషన్ నోడ్స్ కోసం క్లౌడ్ డేటా సెంటర్లలో 5 కోట్ల డాలర్ల వరకు పెట్టుబడులు పెట్టనున్నట్టు కంపెనీ తెలిపింది.
- ఫిన్‌టెక్ సంస్థ జాగిల్.. మెష్ పేమెంట్స్‌తో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా మెష్ పేమెంట్స్ తన అంతర్జాతీయ కస్టమర్లకు జాగిల్‌కు చెందిన ప్రీపెయిడ్ కార్డులు, ఫారెక్స్ కార్డులు, క్రెడిట్ కార్డుల వంటి స్పెండ్ మేనేజ్‌మెంట్ సేవలను అందించనుంది. మెష్ పేమెంట్స్‌కు అంతర్జాతీయ ట్రావెల్, స్పెండ్ సొల్యూషన్స్ సేవల్లో మంచి పేరుంది. ఇప్పటికే ఈ కంపెనీ అమెరికా, యూరప్, లాటిన్ అమెరికాల్లోని భారత ఎంఎన్‌సీలకు సేవలందిస్తోంది.

మళ్లీ 25,000 పైకి నిఫ్టీ

సెన్సెక్స్ 1,200 పాయింట్లు అప్.. 82,500 ఎగువన ముగిసిన సూచీ



7 నెలల గరిష్ఠ స్థాయికి మార్కెట్

2 రోజుల్లో రూ.9 లక్షల కోట్ల వృద్ధి

ముంబై: భారత స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం మధ్యాహ్నం వరకు లాభనష్టాల మధ్య ఊగిసలాడినప్పటికీ, మదుపరులు ఒక్కసారిగా కొనుగోళ్లు పెంచడంతో భారీగా లాభపడ్డాయి. సెన్సెక్స్ 1,200.18 పాయింట్ల (1.48 శాతం) వృద్ధితో ఏడు నెలల గరిష్ఠ స్థాయి 82,530.74 వద్దకు చేరింది. నిఫ్టీ సైతం 395.20 పాయింట్లు (1.60 శాతం) పెరిగి 25,062.10 వద్దకు ఎగబాకింది. సూచీ మళ్లీ 25,000 పైకి చేరడం 7 నెలల (2024 అక్టోబరు 15) తర్వాత మళ్లీ ఇదే మొదటిసారి. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే దాదాపు అన్ని వస్తువులపై భారత్ సుంకాలను సున్నాకు తగ్గించనుందంటూ డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. దాంతో భారత్-అమెరికా మధ్య త్వరలోనే వాణిజ్య ఒప్పందం కుదరవచ్చన్న అంచనాలతో మార్కెట్లో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. సూచీలు లాభపడటం వరుసగా ఇది రెండో రోజు. ఈ రెండ్రోజుల్లో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.9.08 లక్షల కోట్ల పెరుగుదలతో రూ.440.19 లక్షల కోట్లకు (5.14 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.

- బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు 0.94 శాతం వరకు వృద్ధి చెందగా.. రంగాల వారీ సూచీలన్నీ పాజిటివ్‌గా ముగిశాయి. రియల్టీ, ఆటో, సర్వీసెస్, ఇండస్ట్రియల్స్, మెటల్, కన్స్యూమర్ డిస్‌క్రెషనరీ, కమోడిటీస్ సూచీలు 1.87 శాతం వరకు పెరిగాయి.
- విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) రూ.5,393 కోట్ల నికర కొనుగోళ్లు జరపగా.. దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు (డీఐఐ) నికరంగా రూ.1,668 కోట్ల షేర్లను విక్రయించారు.
- ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 22 పైసలు క్షీణించి రూ.85.54 వద్ద ముగిసింది. దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడం రూపీపై ఒత్తిడి పెంచింది.
- అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ ముడి చమురు పీపా ధర ఒక దశలో 3.65 శాతం తగ్గి 63.68 డాలర్లకు దిగివచ్చింది.
- ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1,800 తగ్గి రూ.95,050కి దిగిరాగా.. వెండి సైతం వరుసగా నాలుగో రోజూ తగ్గుముఖం పట్టింది. కిలో వెండి రూ.1,000 తగ్గి రూ.97,000కు జారుకుంది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 0.53 శాతం తగ్గి 3,160 డాలర్లకు జారుకోగా.. సిల్వర్ 32.29 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

5 నెలల గరిష్ఠానికి వాణిజ్య లోటు

ఏప్రిల్‌లో రూ.2.26 లక్షల కోట్లు

ఎగుమతుల్లో 9 శాతం వృద్ధి

19 శాతం ఎగబాకిన దిగుమతులు

న్యూఢిల్లీ: భారత విదేశీ వాణిజ్య లోటు 5 నెలల గరిష్ఠ స్థాయికి పెరిగింది. గత నెలలో 2,642 కోట్ల డాలర్లకు (రూ.2.26 లక్షల కోట్లు) చేరింది. ట్రంప్ సుంకాల పెంపు నిర్ణయం అంతర్జాతీయ వాణిజ్యం, వస్తు సరఫరాను తలకిందులు చేయడం ఇందుకు ప్రధాన కారణం. ఈ ఫిబ్రవరిలో వాణిజ్య లోటు మూడేళ్ల కనిష్ఠ స్థాయి 1,405 కోట్ల డాలర్లకు తగ్గగా.. మార్చిలో 2,154 కోట్ల డాలర్లకు పెరిగింది. ఏప్రిల్‌లో మరింత ఎగబాకింది. గత నెలలో భారత వస్తు ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన 9.03 శాతం వృద్ధితో ఆరు నెలల గరిష్ఠ స్థాయి 3,849 కోట్ల డాలర్లకు (రూ.3.29 లక్షల కోట్లు) పెరిగాయి. కానీ, అదే సమయంలో దిగుమతులు కూడా 19.12% పెరిగి 6,491 కోట్ల డాలర్లకు (రూ.5.55 లక్షల కోట్లు) ఎగబాకాయి. దాంతో వాణిజ్య లోటు (ఎగుమతుల ఆదాయం, దిగుమతుల వ్యయం మధ్య అంతరం) 2,642 కోట్ల డాలర్లుగా నమోదైంది. ముడిచమురు, ఎరువుల డిమాండ్ ఎగబాకడం దిగుమతుల పెరుగుదలకు కారణమయ్యాయి.

సేవల్లో రూ.1.52 లక్షల కోట్ల మిగులు వాణిజ్యం: గత నెలలో సేవల ఎగుమతులు 3,531 కోట్ల డాలర్లు (రూ.3.02 లక్షల కోట్లు)గా, దిగుమతులు 1,754 కోట్ల డాలర్లు (రూ.1.50 లక్షల కోట్లు)గా నమోదయ్యాయి. దాంతో వాణిజ్య మిగులు 1,777 కోట్ల డాలర్లకు (రూ.1.52 లక్షల కోట్లు) పెరిగింది.

కాలుష్యరహితంగా సిమెంట్ ఉత్పత్తి

2060 నాటికే 'నెట్ జీరో' స్థాయికి.. అంబుజా సిమెంట్స్ ఎండీ అజయ్ కపూర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పర్యావరణానికి హాని కలగని రీతిలో సిమెంట్ ఉత్పత్తి చేయడంలో భారత సిమెంట్ పరిశ్రమ ప్రపంచంలో అగ్రస్థానంలో ఉందని అదానీ గ్రూప్ కంపెనీ అంబుజా సిమెంట్ ఎండీ, గ్రీన్ సిమెంటెక్, 2025 సదస్సు ఛైర్మన్ అజయ్ కపూర్ చెప్పారు. ఈ విషయంలో అమెరికా, యూరప్ దేశాలు కూడా మనకు సాటి రావన్నారు. గ్రీన్ సిమెంటెక్-2025 సదస్సు సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ విషయం వెల్లడించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం 2070 కంటే పదేళ్ల ముందే భారత సిమెంట్ పరిశ్రమ జీరో కాలుష్య (నెట్ జీరో) స్థాయికి చేరుకుంటుందన్నారు. ఉత్పత్తిలో వెలువడే వేడిని సైతం ఇంధనంగా మార్చుకోవడం ద్వారా సిమెంట్ కంపెనీలు తమ ఇంధన అవసరాల్లో 40% తీర్చుకుంటున్న విషయాన్ని గుర్తు చేశారు. పరిశ్రమ తీసుకున్న చర్యలతో ప్రస్తుతం ఒక టన్ను సిమెంట్ ఉత్పత్తితో వెలువడే కార్బన్ డయాక్సైడ్‌ను 800 కిలోలకు పరిమితం చేసినట్టు సాగర్ సిమెంట్స్ జేఎండీ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

ఎస్‌బీఐ కార్డ్, అపోలో ఫార్మసీ నుంచి కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అపోలో ఫార్మసీని నిర్వహిస్తున్న అపోలో హెల్త్ కంపెనీతో కలిసి కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డును తీసుకువచ్చినట్లు ఎస్‌బీఐ కార్డ్ ప్రకటించింది ఆరోగ్యం, వెల్‌నెస్‌పై దృష్టి పెట్టే విధంగా అపోలో ఎస్‌బీఐ కార్డ్ సెలెక్ట్ పేరుతో దీన్ని తీసుకువచ్చినట్లు ఎస్‌బీఐ కార్డ్ తెలిపింది అపోలో ఎస్‌బీఐ కార్డ్ సెలెక్ట్ వినియోగదారులు.. అపోలో 24/7 యాప్, అపోలో ఫార్మసీ స్టోర్ల ద్వారా ఔషధాల కొనుగోలు, హెల్త్ చెకప్ ప్యాకేజీలు, రక్త పరీక్షలు సహా ఇతరత్రా కొనుగోళ్లపై రివార్డు పాయింట్లు అందుకుంటారని పేర్కొంది. అంతేకాకుండా యాప్‌తో పాటు ఎంపిక చేసిన ఫార్మసీ స్టోర్లలో కొనుగోళ్లపై 25 శాతం వరకు క్యాష్‌బ్యాక్‌ను ఆఫర్ చేస్తున్నట్లు ఎస్‌బీఐ కార్డ్ తెలిపింది.

విశాఖలో ఐటీసీ కొత్త స్టార్ హోటల్

రూ.328 కోట్ల పెట్టుబడి. 2029 నాటికి పూర్తి

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో సొంత స్టార్ హోటల్ నిర్మాణానికి ఐటీసీ హోటల్స్ సిద్ధమైంది. రూ.328 కోట్ల పెట్టుబడితో 200 రూమ్స్‌తో నిర్మించే ఈ హోటల్‌ను 2029 నాటికి పూర్తి చేయనుంది. ఐటీసీ హోటల్స్ ఇప్పటికే వైజాగ్‌లో 'వెల్‌కం దేవీ గ్రాండ్ బే, ఫార్చ్యూన్ ఇన్ శ్రీకన్య' పేరుతో రెండు స్టార్ హోటల్స్‌ను తన అనుబంధ సంస్థల ద్వారా లీజు పద్ధతిలో నిర్వహిస్తోంది. ఇందులో 'వెల్‌కం దేవీ గ్రాండ్ బే' హోటల్‌లో 104 రూమ్స్, 'ఫార్చ్యూన్ ఇన్ శ్రీకన్య' హోటల్‌లో 68 రూమ్స్ ఉన్నాయి. కాగా మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో కంపెనీ రూ.1,060.62 కోట్ల ఆదాయంపై రూ.257.85 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది.

ఐకేఎఫ్ ఫైనాన్స్ రూ.1,465 కోట్ల సమీకరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఐకేఎఫ్ ఫైనాన్స్ ఈక్విటీ షేర్ల జారీ ద్వారా రూ.1,465 కోట్లు సమీకరించింది. నార్వెస్ట్ వెంచర్ పార్ట్‌నర్స్‌తో పాటు మోతీలాల్ ఓస్వాల్ ఆల్టర్నేట్ నుంచి ఈ పెట్టుబడులు సమీకరించినట్టు కంపెనీ తెలిపింది. ఇందులో 10 కోట్ల డాలర్లకుపైగా (సుమారు రూ.855 కోట్లు) పెట్టుబడులు నార్వెస్ట్ నుంచి సమకూరాయి. మోతీలాల్ ఓస్వాల్ ఆల్టర్నేట్ ఇప్పటికే ఉన్న వాటాలకు తోడు అదనంగా మరిన్ని వాటాలు కొనుగోలు చేసింది. ఐకేఎఫ్ ఫైనాన్స్. వాహన, ఎంఎస్ఎంఈ, గృహ రుణాలు అందిస్తోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



16వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	525
వరంగల్	512	గోదావరి	515
చిత్తూరు	603	విశాఖపట్నం	520
		డజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	124
వరంగల్	120	గుంటూరు	122
కరీంనగర్	120	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	110
కర్నూలు	120	నెల్లూరు	115
విశాఖపట్నం	121	అనంతపురం	115
గోదావరి	124		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	93,930 ▼	86,100 ▼	1,08,000 ▼
విజయవాడ	95,500 ▼	90,000 ▼	96,200 ▼
విశాఖపట్నం	95,940 ▼	86,100 ▼	1,08,000 ▼
రాజమండ్రి	93,930 ▼	86,100 ▼	98,400 ▼
ప్రొద్దుటూరు	94,100 ▼	86,570 ▼	97,100 ▼
ముంబై	92,365 ▼	84,606 ▼	94,572 ▼



యాదగిరిగుట్ట ఆలయ ప్రాంగణంలో కోలాటం ఆడుతున్న ప్రపంచ సుందరీమణులు



యాదాద్రి ఆలయంలో అఖండ దీపం వద్ద అందగత్తెలు

యాదగిరీశుడి సేవలో

అందాల భామలు

సంప్రదాయబద్ధంగా స్వామి వారి దర్శనానికి.. ఆలయ ప్రాంగణంలో కోలాటం ఆడిన అందగత్తెలు

- మిస్ వరల్డ్ పోటీదారుల మనసు దోచిన చేనేత, ఇక్కత్
- చీరల తయారీని చూసి అబ్బురపడిన అందాల భామలు



పోచంపల్లిలోని యాంపీ థియేటర్‌లో అందాల భామల ఫ్యాషన్ షో

యాదాద్రి, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలైన యాదగిరిగుట్ట, భూదాన్‌పోచంపల్లిలో మిస్ వరల్డ్ పోటీదారులు సందడి చేశారు. గురువారం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రాన్ని ప్రపంచ సుందరీమణులు సందర్శించారు. కరేబియన్ గ్రూప్‌కు చెందిన తొమ్మిది దేశాల భామలు యాదగిరిగుట్టలో స్వామివారికి పూజలు నిర్వహించగా, ప్రపంచ పర్యాటక కేంద్రం భూదాన్‌పోచంపల్లిలో 25 దేశాలకు చెందిన ఆఫ్రికన్ అందగత్తెలు సందడి చేశారు. సుందరాంగులు తలలో మల్లెపూలు పెట్టుకుని.. లంగా వోణీలు, చీరలు ధరించి వచ్చారు. సాయంత్రం 5 గంటలకు బ్యాటరీ వాహనాల్లో ఆలయ ప్రాంగణంలోకి వెళ్లారు. 5.48 గంటలకు ఆలయ మాడవీధుల్లోకి చేరుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అధికారులు వారికి స్వాగతం పలికారు. అన్నామాచర్య ట్రస్ట్ కళాకారుల నృత్య ప్రదర్శన, కోలాటం మధ్యలో అందాల భామలు నడుచుకుంటూ వెళ్లారు. బంగారు తాపడం ఉన్న గోపురాన్ని చూసి మంత్రముగ్ధులయ్యారు. స్వర్ణ ధ్వజ స్తంభం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. తూర్పు రాజగోపురం నుంచి త్రితల రాజగోపురం ద్వారా ఆలయంలోకి ప్రవేశించారు. క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామి గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. పంచనరసింహ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ముఖ మండపంలో వేద పండితులతో ఆశీర్వచనం పొందారు. ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి స్వామివారి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం అతిథి గృహానికి వెళ్లారు. అక్కడే కాసేపు సేదతీరిన తర్వాత 7.15 గంటలకు హైదరాబాద్ బయలుదేరారు. ప్రపంచ సుందరీమణులు 2.15 గంటల పాటు ఆలయంలో ఉన్నారు. వీరి రాకతో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు భక్తులకు స్వామి వారి దర్శనాలను నిలిపివేశారు.

ఆలయ విశిష్టతను వివరించిన అధికారులు

కొండపైకి చేరుకున్న అందగత్తెలకు వైటీడీఏ వైస్ చైర్మన్ జి.కిషన్‌రావు ఆలయ విశిష్టతను వివరించారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సతీసమేతంగా, రెవెన్యూ అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి అధికారులతో కలిసి అఖండ దీపారాధన వరకు స్వాగతం పలికారు. అందాల భామలు పశ్చిమ, ఉత్తర తిరువీధుల నుంచి వస్తుండగా కళాకారులతో కలిసి రెండు నిమిషాల పాటు కోలాటం, నృత్యం చేశారు.

ఫ్యాషన్ షో అదుర్స్..

ప్రపంచ అందగత్తెలే అసూయపడేలా భారతీయ నారీమణుల ఇక్కత్ చీరల ఫ్యాషన్ షో అద్భుతంగా సాగింది. సంప్రదాయం ఉట్టిపడేలా ధరించిన చేనేత, ఇక్కత్ వస్త్రాలతో షో చేసిన యువతీ యువకులు యాంపీ థియేటర్‌లో జోష్ నింపారు. షో జరుగుతున్నంత సేపు అందాల భామలు కళ్లార్పకుండా చూస్తూ చప్పట్లు, కేరింతలతో ప్రోత్సహించారు.

మనసు దోచిన చేనేత, ఇక్కత్



ఇక్కత్ చీరలకు ప్రసిద్ధి గాంచిన భూదాన్‌పోచంపల్లి ప్రపంచ సుందరీమణుల మనసు దోచుకుంది. తెలంగాణలోని చేనేత రంగాన్ని ప్రభుత్వం విశ్వవ్యాప్తం చేసేందుకు తీసుకుంటున్న చర్యల్లో బాగంగా మిస్ వరల్డ్ పోటీదారులను గురువారం పోచంపల్లికి తీసుకెళ్లింది. ఆఫ్రికాలోని 25 దేశాలకు చెందిన పోటీదారులు పోచంపల్లిలో చీరల తయారీ, డిజైన్, అద్దకం, ఇక్కత్ వస్త్రాలను చూసి అబ్బురపడ్డారు. మిస్‌వరల్డ్ పోటీల సందర్భంగా చేనేత, ఇక్కత్ వస్త్రాలపై దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం పోచంపల్లిలో ఫ్యాషన్ షో నిర్వహించింది. చేనేత వస్త్రాల తయారీ విధానాన్ని పరిశీలించిన ప్రపంచ అందగత్తెలు మైమరచిపోయారు. రంజు వాయిద్యం, నాదస్వరం, కోలాటాలతో పలికిన స్వాగతంతో సంబరపడిపోయారు. చేనేతల కళాత్మక వస్త్రాలు సుందరీమణులను ఆకట్టుకున్నాయి. నుదుటిన బొట్టు పెట్టి, పూలమాలలు అందిస్తూ సుందరాంగులకు ఆత్మీయ స్వాగతం పలికారు. పోచంపల్లి చేనేత టూరిజం పార్కు ప్రవేశ ద్వారం వద్ద ఫొటోలకు పోజులిస్తూ 'తెలంగాణ జరూర్ ఆనా' అంటూ నినాదాలు చేశారు. ఇక్కత్ చీరల తయారీని చూసి ఆశ్చర్యచకితులయ్యారు. చేనేత టూరిజంపార్కులో కళాకారులు ప్రదర్శించిన రంజు, కిన్నెర వాయిద్యాలు మంత్రముగ్ధులను చేశాయి. కొందరు భామలు రంజు వాయించగా, మరికొందరు సంగీతానికి తగ్గట్లుగా నాట్యం చేశారు. మెహందీ స్టాల్ వద్ద గోరింటాకు డిజైన్లు వేయించుకున్నారు. యాంపీ థియేటర్‌లో పోచంపల్లి ప్రస్థానం, చేనేతపై వీడియోను వీక్షించారు.



హెరిటేజ్ వాక్ లోపాలపై ఆరా!

- రామప్ప ఘటనను సర్కారు సీరియస్
- సుందరీమణుల కాళ్లు తుడిచారా.. నీళ్లు ఇచ్చారా?
- వేయి స్తంభాల గుడిలో ఏర్పాట్లపైనా ఆరా

వరంగల్, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ సుందరీమణుల ఓరుగల్లు టూర్ వివాదాస్పదం కావటంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. రామప్పలో అసలు ఏం జరిగింది? అనే దానిపై ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా నివేదికలు తెప్పించుకుంటోంది. వరంగల్ వెయ్యి స్తంభాల గుడితో పాటు ములుగు జిల్లా రామప్పలో సుందరీమణులు కాళ్లు కడుక్కునేందుకు రాగి తాంబాలాలు, చెంబులను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో రామప్పలో అందాలభామలు కాళ్లపై కొందరు వలీంటర్లు నీళ్లు పోయగా, వారిలో ఒకరు ఓ అందాల భామ కాళ్లను తెల్లని వస్త్రంతో తుడిచినట్టుగా వీడియోల్లో రికార్డయింది. విదేశీ వనితల వద్ద ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం. రామప్పలో అసలేం జరిగింది? అందాల భామల కాళ్లకు నీళ్లు ఇవ్వాలని లేదా కాళ్లను వస్త్రంతో తుడవాలని ఎవరైనా ఆదేశించారా? లేదంటే అనుకోకుండా జరిగిందా?అనే కోణంలో విచారణ జరుపుతున్నట్టు సమాచా రం. రామప్పలో కార్యక్రమాన్ని ఏ అధికారి సమన్వయం చేసుకుంటున్నారు? ఆ సమయంలో ఆ అధికారి ఎక్కడికెళ్లారు?అనే కోణంలోనూ ఆరా తీస్తున్నారు. పత్రికలతోపాటు సోషల్ మీడియాలో ఈ ఘటన వైరల్ కావటంతో ఉన్నతాధికారులు దిద్దుబాటు చర్యలకు దిగుతున్నట్టు తెలిసింది.

వేయిస్తంభాల గుడిలో ఏర్పాట్లపై..

హనుమకొండలోని వేయిస్తంభాల గుడిలో ఏర్పాట్లు అసంతృప్తిగా ఉన్నాయనే ప్రచారం జరిగింది. ఆలయం ఆవరణలో చీకటి వాతావరణం ఉండటం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయకుండా సాదాసీదాగా నిర్వహించటంపై ఉన్నతాధికారులు ఆగ్రహంగా ఉన్నట్లు తెలిసింది. మీడియాకు అనుమతిచ్చేందుకు అడ్డగోలు నిబంధనలు పెట్టిన అధికారులు.. ప్రజాప్రతినిధుల అనుచరులను అనుమతించడం ఏంటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. షెడ్యూల్ ప్రకారం రాత్రి 9గంటలకే హరిత కాకతీయ నుంచి హైదరాబాద్‌కు పంపించాల్సిన సుందరీమణులను సుమారు రాత్రి 11గంటల వరకు ఇక్కడే ఉంచడంపైనా ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నట్టు తెలిసింది. ఒకరిద్దరు అధికారులు, ప్రజాప్రతినిధుల అతి ప్రవర్తనతో ఆశించిన స్థాయిలో హరితలో సుందరీమణులకు అతిథ్యం అందలేదని చర్చ జరుగుతోంది. ఈ ఘటనలపై నిఘా వర్గాలు సమాచారాన్ని సేకరించి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిసింది.

నేడు పిల్లలమర్రికి సుందరీమణులు

హైదరాబాద్/మహబూబ్‌నగర్/శంకర్‌పల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన అందగత్తెలు శుక్రవారం పాలమూరు సమీపంలోని 750 ఏళ్ల చరిత్ర కలిగిన పిల్లలమర్రిని సందర్శించనున్నారు. మూడున్నర ఎకరాల్లో విస్తరించిన ఈ మహావృక్షం ప్రపంచ గుర్తింపు పొందింది. మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు వివిధ దేశాల నుంచి వచ్చిన వారిలో 22 మంది మహబూబ్‌నగర్‌లో పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి 3 ప్రత్యేక బస్సుల్లో సాయంత్రం 5 గంటలకు పిల్లలమర్రికి చేరుకుంటారు. 2 గంటల పాటు అక్కడ గడపనున్నారు. ముందుగా 16వ శతాబ్దం నాటి రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయానికి వెళ్తారు. అనంతరం అక్కడే ఉన్న మ్యూజియాన్ని సందర్శిస్తారు. మ్యూజియంలో తెలంగాణ చరిత్ర-సంస్కృతి ఆనవాళ్లు, హిందూ, బౌద్ధ, జైన మతాలకు సంబంధించిన శిల్పాలను సందర్శించనున్నారు. తర్వాత మహావృక్షం వద్దకు చేరుకుంటారు. ఇక్కడ ఫొటో షూట్ ఏర్పాటు చేస్తున్నారు. సాయంత్రం 7 గంటలకు తిరుగుప్రయాణం అవుతారు. 1300 మంది పోలీసులతో మూడంచెల బందోబస్తును ఏర్పాటు చేశారు. వారం రోజులుగా జిల్లా కలెక్టర్ విజయేందిరబోయి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎకో పార్కుకు అందాల భామలు..

రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం ప్రొద్దుటూరుకు శుక్రవారం మరికొందరు ప్రపంచ అందగత్తెలు రానున్నారు. ఎక్స్‌పీరియం ఎకో ఫ్రెండ్లీ పార్కులో సందడి చేయనున్నారు. పార్కులోని ప్రకృతి అందాలను తిలకించనున్నారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 7గంటల వరకు పార్కులో గడపనున్నారు. ఈ సందర్భంగా పార్కులోని వివిధ జాతుల మొక్కలు, వృక్షాల విశిష్టతలను నిర్వాహకులు వారికి వివరించనున్నారు. కాగా, మిస్‌వరల్డ్ పోటీదారులు ఆదివారం సచివాలయానికి వెళ్లనున్నారు. సాయంత్రం 5.30నుంచి 7.30వరకు అక్కడే ఉంటారు. సచివాలయంపై ప్రదర్శించే 3డీ ప్రొజెక్షన్ మ్యాపింగ్‌లో తెలంగాణ చరిత్ర, అభివృద్ధిని వీక్షిస్తారు.

టీపీసీసీ కార్యవర్గంలో బహుజనులకు పెద్దపీట!

నెలాఖరుకు రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణపై స్పష్టత

న్యూఢిల్లీ/హైదరాబాద్, మే 15(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ నూతన కార్యవర్గం ఏర్పాటు, రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ అంశాల్లో కాంగ్రెస్ పార్టీలో కదలిక వచ్చినట్టు తెలిసింది. ఆ పార్టీకి చెందిన అత్యంత విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం.. ఏ క్షణంలోనైనా టీపీసీసీ నూతన కార్యవర్గాన్ని అధిష్ఠానం ప్రకటించే అవకాశం ఉంది. నలుగురు కార్యనిర్వాహక అధ్యక్షులు, 35 మంది ఉపాధ్యక్షులు, 75 మంది ప్రధాన కార్యదర్శులు, 10 మంది సీనియర్లతో సలహా కమిటీ, 20 మందితో రాజకీయ వ్యవహారాల కమిటీ.. మొత్తంగా టీపీసీసీ జంబో కార్యవర్గం ఏర్పడనుంది. ఇందులో 70 శాతం పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీలకే దక్కనున్నాయని ఆ వర్గాలు తెలిపాయి. టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ పార్టీ అధ్యక్షుడు ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ఇందుకు సంబంధించిన తుది కసరత్తును పూర్తి చేసినట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. అలాగే, పార్టీలోని సీనియర్ల కోసం ఈ సారి కొత్తగా సలహాదారుల కమిటీని నియమిస్తున్నారు. మరోపక్క, రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపై ఈ నెలాఖరుకు స్పష్టత రానుందని పార్టీ వర్గాలు తెలిపాయి.

సునీతారావుపై పార్టీ నాయకత్వం సీరియస్

పార్టీ కోసం పని చేసిన వారికి నామినేటెడ్ పోస్టులు ఇవ్వడం లేదంటూ మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు నిరసన వ్యక్తం చేయడాన్ని పార్టీ రాష్ట్ర నాయకత్వం సీరియస్‌గా తీసుకుంది. దీనిపై ఒకటి, రెండు రోజుల్లో పార్టీ క్రమశిక్షణ చర్యల కమిటీ భేటీ కానుందని.. పార్టీ నాయకత్వంపై ఆమె చేసిన వ్యాఖ్యలు, ఆమెపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి షోకాజ్ నోటీసు జారీ చేయనుందని గాంధీ భవన్ వర్గాలు తెలిపాయి.

18 ప్రాజెక్టులు @ 6.32 లక్షల ఎకరాలు

- ప్రాధాన్య ప్రాజెక్టులకే నిధులివ్వాలని నిర్ణయం
- వాటి పూర్తికి 7,647 కోట్లు కావాలని అంచనా
- తక్కువ వ్యయంతో ఎక్కువ ఆయకట్టు లక్ష్యం

హైదరాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): తక్కువ వ్యయంతో ఎక్కువ ఆయకట్టు సాధించాలనే లక్ష్యంతో 18 ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వీటిని రూ.7,647.09 కోట్ల వ్యయంతో పూర్తి చేసి 6,32,652 ఎకరాలకు సాగునీరు అందించాలని సంకల్పించింది. నిధుల లభ్యత తక్కువగా ఉండడంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తక్కువ వ్యయంతో పూర్తయ్యే ప్రాజెక్టులపై దృష్టి పెట్టింది. అప్పటి నుంచి రూ.12,855 కోట్లు విడుదల చేయగా అందులో ప్రాధాన్య ప్రాజెక్టులకు రూ.3,377 కోట్లు మాత్రమే అందాయి. ప్రాధాన్యం లేని జాబితాలోని ప్రాజెక్టులకు ఏకంగా రూ.9,478 కోట్లు లభించాయి. దాంతో నిర్దేశించుకున్న లక్ష్యం నెరవేరలేదు. ఈ దఫా ప్రాధాన్య ప్రాజెక్టులకు నిధులు దక్కేలా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖకు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ప్రాధాన్య ప్రాజెక్టులకే నిధులు ఇస్తామని తేల్చిచెప్పారు. దాంతో ఈ ప్రాజెక్టుల పూర్తిపై ఆశలు చిగురిస్తున్నాయి. 18 ప్రాజెక్టులను క్యాటగిరీ-ఏ, బీగా విభజించారు. క్యాటగిరీ-ఏలో ఆరు ప్రాజెక్టులు ఉన్నాయి. వీటికి రూ.240.66 కోట్లు వెచ్చిస్తే 47,882 ఎకరాలకు సాగునీరు అందించడానికి అవకాశం ఉంటుందని గుర్తించారు. క్యాటగిరీ-బీలో 12 ప్రాజెక్టులను చేర్చారు. వీటికి రూ.7406.43 కోట్లు వెచ్చిస్తే 5,84,770 ఎకరాలు కొత్తగా సాగులోకి వస్తాయని లెక్క వేశారు. క్యాటగిరీ-ఏలోని ప్రాజెక్టులను 2026 మార్చి 31కల్లా పూర్తి చేసి, 47,882 ఎకరాలను సాగులోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. శ్రీరాంసాగర్ రెండో దశ కింద 3,97,949 ఎకరాలకు గాను 3,81,129 ఎకరాలు సాగులోకి వచ్చాయి. మిగతా 16,820 ఎకరాలను ఈ ఏడాది డిసెంబరు 31కల్లా సాగులోకి తేవాలని లక్ష్యం నిర్దేశించింది. ఇంకా నీల్వాయి, పాలెంవాగు, మత్తడివాగు ప్రాజెక్టులు, సదర్‌మట్ బ్యారేజీ, పిప్రి ఎత్తిపోతల పథకం కింద మిగిలిన భూములకు కూడా సాగునీరు అందించాలని నిర్ణయించింది. రానున్న మూడేళ్లలో పూర్తయ్యే ప్రాజెక్టులను క్యాటగిరీ-బీలో చేర్చారు. 2026 మార్చి 31కల్లా పూర్తయ్యే వాటిని కాంపోనెంట్-ఏలో, 2027 మార్చి 31కల్లా పూర్తయ్యే వాటిని కాంపోనెంట్-బీలో పెట్టారు. వీటిలో గోదావరి బేసిన్ పరిధిలోని చిన్న కాళేశ్వరం, మొడికుంట వాగు, లోయర్ పెన్‌గంగా (చనాకా కొరాటా), శ్రీపాద ఎల్లంపల్లి తొలి దశ, దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాల పరిధిలోని ఆయకట్టు ఉంది. కృష్ణా బేసిన్ పరిధిలో కోయిల్‌సాగర్, రాజీవ్ బీమా ఎత్తిపోతల పథకం, జవహర్ నెట్టెంపాడు, కల్వకుర్తి, డిండి ఎత్తిపోతలు, ఎస్‌ఎల్‌బీసీ పథకం ఉన్నాయి.

అధికారం పోయాక ఆత్మగౌరవం గుర్తొచ్చిందా?

- కలెక్టర్‌తో కాళ్లు మొక్కించుకున్న దురహంకారం మీదే: మంత్రి సీతక్క

ములుగు, మే 15 (ఆంధ్రజ్యోతి): అధికారం పోయాక బీఆర్‌ఎస్ నాయకులకు ఆత్మగౌరవం గుర్తుకు వచ్చిందా? అని మంత్రి ధనసరి సీతక్క గురువారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రపంచ సుందరి పోటీల్లో భాగంగా బుధవారం జరిగిన హెరిటేజ్ వాక్ సక్సెస్ కావడంతో బీఆర్‌ఎస్ నాయకులు కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రానికి ఇవాంక ట్రంప్ వచ్చినప్పుడు తోకపట్టుకుని తిరిగిన నాయకులు ఎలాంటి సంప్రదాయాలను పాటించారో అందరికి తెలుసని పేర్కొన్నారు. గుడిలోకి వెళ్లే ముందు కాళ్లు కడుక్కొని వెళ్లడం మన సంప్రదాయమని, అందులో భాగంగానే ఈవెంట్ మేనేజ్‌మెంట్ అమ్మాయిల కాళ్లకు నీళ్లు పోసిందని, అది పట్టుకుని తెలంగాణ ప్రభుత్వాన్ని బద్నాం చేస్తారా? అని ప్రశ్నించారు. కవిత కాళ్ల దగ్గర కలెక్టర్‌ను కూర్చోపెట్టుకోవడం, కేసీఆర్ కలెక్టర్‌తో కాళ్లు మొక్కించుకోవడం మీ దురహంకారానికి నిదర్శనం కాదా? అని మండిపడ్డారు. ఈ మధ్య సబితా ఇంద్రారెడ్డి ములుగు జిల్లా మీద పడి అబద్ధాలు చెబుతున్నారని, ఆమె మంత్రిగా ఉన్నప్పుడు ఏం మానవత్వం చూపిందో తెలుసని అన్నారు. అబద్ధాలకు అంబాసిడర్‌గా మారొద్దని సబితకు హితవు పలికారు. కోడిగుడ్డు మీద ఈకలు పీకే ప్రయత్నాలు మానుకోవాలని బీఆర్‌ఎస్‌కు మంత్రి సూచించారు.

కేసీఆర్ కాళ్లు ఐఏఎస్ కడిగినప్పుడేమైంది మీ పరువు

'కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఒక ఐఏఎస్ ఆయన కాళ్లు కడిగినప్పుడు, కవిత కాళ్ల దగ్గర కలెక్టర్ కూర్చున్నప్పుడు మీ పరువేమైంది' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి ప్రశ్నించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని అధికారులతో కాళ్లు మొక్కించుకున్న నీచ చరిత్ర కేసీఆర్‌దని చెప్పారు. వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డితో కలిసి ఆయన గురువారం అసెంబ్లీ హాల్‌లో మీడియాతో మాట్లాడుతూ మిస్ వరల్డ్ పోటీలతో తెలంగాణ ఖ్యాతి విరాజిల్లనుందని అన్నారు. అందుకే కేటీఆర్, హరీశ్ అక్కసు వెళ్లగక్కుతున్నారని, మహిళలను అవమానించేలా మాట్లాడుతున్నారని మండి పడ్డారు.

దాడి చేస్తే బ్రహ్మోస్ ప్రయోగిస్తాం

- మే 17న ట్యాంక్‌బండ్‌లో తిరంగా ర్యాలీ
- రామప్ప గుడిలో విదేశీ వనితల కాళ్లు కడిగిస్తారా?
- తెలంగాణ ఆడపడుచులకు ఇంతటి అవమానమా?: కిషన్‌రెడ్డి



హైదరాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ ఇక మీదట భారత్‌పై దాడి చేస్తే తమ ప్రభుత్వం క్యాండిల్స్ వెలిగిస్తూ ఊరుకోదని, బ్రహ్మోస్ ప్రయోగిస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. యూపీఏ హయాంలో ఉగ్రవాద కార్యకలాపాలు అనేకంగా జరిగేవని, సంతాపాలు ప్రకటించి మర్చిపోతుండేవారని విమర్శించారు. గత పదేళ్లుగా మోదీ నాయకత్వంలో భారత సైన్యం పాకిస్థాన్ ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసి, ఐఎస్ఐ నెట్‌వర్క్‌ను అంతం చేసిందని వెల్లడించారు. మే 17న హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌లో నిర్వహించే తిరంగా ర్యాలీలో ప్రతి ఒక్కరూ రాజకీయాలకు అతీతంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. దేశ రక్షణ కోసం పోరాడుతున్న భారత సైనికులకు మద్దతుగా నిలిచేందుకు, వారి త్యాగాలకు అభినందనగా ఈ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. రామప్ప దేవాలయంలో విదేశీ వనితల కాళ్లు తెలంగాణ ఆడపడుచులతో కడిగించారంటూ కిషన్‌రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. ఈ ఘటన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అహంకారానికి నిదర్శనమని దుయ్యబట్టారు. భారతీయులను విదేశీయుల ముందు మోకరిల్లేలా చేయడమే కాంగ్రెస్ సంస్కృతి అని విమర్శించారు. ఇందుకుగానూ సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి తెలంగాణ మహిళా సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

ధాన్యం తరుగుతో రూ.2,860 కోట్ల దోపిడీ: ఏలేటి

హైదరాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): 'మిల్లర్ల దోపిడీ ప్రభుత్వానికి తెలిసే జరుగుతుందా..? లేక ప్రభుత్వం కళ్లు గప్పి ఈ తతంగం నడుస్తుందా..?" అని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. చాలా చోట్ల మిల్లర్లు అధిక తరుగుతో ధాన్యం తీసుకుంటూ రైతులను దోచుకుంటున్నారని మండిపడ్డారు. 40 కిలోల బస్తాలో 4 కిలోలు తరుగు తీస్తున్నారని ఆరోపించారు. 13 లక్షల టన్నుల ధాన్యానికి రూ.2,860 కోట్ల ముడుపులు కూడగట్టారని, రెండు సీజన్లలో రూ.6వేల కోట్ల మోసం జరిగిందని విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. అకాల వర్షాలు, వడ్ల కొనుగోలులో తీవ్ర జాప్యం, గన్నీబాగులు, టార్పాలిన్ లేని పరిస్థితుల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అన్నదాతలకు ఇవ్వాల్సిన రూ.760కోట్ల బోనస్ ఇవ్వలేదని మండిపడ్డారు. గతంలో సీఎంఆర్ ఇవ్వని మిల్లర్లపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. టెండర్లు తీసుకున్న కాంట్రాక్టర్లు తప్పుకున్నా, వారిపై కేసులు పెట్టని అంశాన్ని ప్రస్తావించారు. ఈ తతంగంపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

చిన్నారి వేదవల్లి కుటుంబానికి సాయం

- సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.7 లక్షలు అందజేత
- బ్లడ్ క్యాన్సర్‌తో పోరాడి చనిపోయిన పాప



వేదవల్లి తండ్రికి చెక్ అందిస్తున్న సీఎం ఓఎస్డీ శ్రీనివాసులు

హైదరాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): బ్లడ్ క్యాన్సర్‌తో పోరాడి చనిపోయిన చిన్నారి వేదవల్లి కుటుంబానికి సర్కారు అండగా నిలిచింది. సీఎం ఆదేశాలతో సీఎంఆర్ఎఫ్ కింద ఆ కుటుంబానికి అధికారులు రూ.7 లక్షలు అందించారు. హైదరాబాద్ ఎల్‌బీ నగర్‌లో నివాసం ఉండే రఘు, మంజుల దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్దపాప వేదవల్లి(5)కి 2022లో తీవ్ర జ్వరం రావడంతో ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షల అనంతరం ఆమెకు బ్లడ్ క్యాన్సర్(అనాప్లాస్టిక్ లార్జ్ సెల్ లింఫోమా) అని తేలింది. రెండేళ్ల పాటు తల్లిదండ్రులు ఆసుపత్రుల చుట్టూ తిప్పారు. పాపను రక్షించుకునేందుకు రూ.లక్షలు వెచ్చించారు. చికిత్స వ్యయం నానాటికీ భారమవడంతో 2024లో సీఎం రేవంత్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన సీఎం.. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో వేదవల్లి చికిత్సకు అవసరమైన రూ.8 లక్షలను ఎల్‌వోసీ కింద మంజూరు చేశారు. చికిత్స అందించినప్పటికీ ఫలితం దక్కలేదు. అప్పటికే వ్యాధి తీవ్రత పెరగడంతో గతేడాది చివరలో వేదవల్లి మరణించింది. పాప తండ్రి ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగి కావడం, చిన్నారి చికిత్స కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేయడంతో రేవంత్ చలించారు. ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు చిన్నారి చికిత్స కోసం గతంలో చేసిన వ్యయానికి సంబంధించి మరో రూ.7 లక్షలను సీఎంఆర్ఎఫ్ నుంచి విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు మంజూరైన రూ.7లక్షల చెక్కును వేదవల్లి తండ్రి రఘుకు గురువారం సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు సచివాలయంలో అందజేశారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోదండరాం

తుమ్మిడిహెట్టి నిర్మాణం చేపట్టాలి

- కాళేశ్వరం బ్యారేజీలను అవినీతి స్మారకంగా వదిలేయాలి
- మేడిగడ్డ పునరుద్ధరణ/మరమ్మతులు దండగే
- తెలంగాణ జల సాధన సమితి రౌండ్‌టేబుల్ తీర్మానం

హైదరాబాద్, పంజాగుట్ట, మే 15(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం బ్యారేజీలను అవినీతి స్మారకంగా వదిలేయాలని, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులు/పునరుద్ధరణకు పెట్టే ప్రతి పైసా దండగేనని, వీటి స్థానంలో తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం చేపట్టాలని తెలంగాణ జల సాధన సమితి డిమాండ్ చేసింది. గురువారం సమితి ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమితి కన్వీనర్ నైనాల గోవర్ధన్ మాట్లాడుతూ ప్రాణహితను రీ డి జైనింగ్ చేసి, గ్రావిటీతో నీళ్లిచ్చే ప్రాజెక్టు కాదని, 100 కిలోమీటర్ల దిగువన కాళేశ్వరం బ్యారేజీలు కట్టడం ఉద్దేశపూర్వకమైన కుంభకోణమని తెలిపారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను ఇసుకపై కట్టారని, రాక్ బెడ్‌మీద కడితే నిలబడేవని, ఇసుక పునాదులపై కట్టే బ్యారేజీల్లో 2 టీఎంసీల కంటే ఎక్కువ నీరు నిల్వ చేయడం ఏ మాత్రం శ్రేయస్కరం కాదని నీటిపారుదలరంగ నిపుణులు పి.జి.శాస్త్రి అన్నారు. కాళేశ్వరం బ్యారేజీలపై ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఇచ్చినా కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణంలో అక్రమాలకు పాల్పడిన వారిని ఎందుకు శిక్షించడం లేదని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ ప్రశ్నించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులకు డబ్బు వృథా చేయకుండా తుమ్మిడిహెట్టిని నిర్మించాలని ఎమ్మెల్సీ కోదండరాం డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రజల ఆస్తులకు ధర్మకర్తగా లేడని, దోపిడిదారుగా ఉన్నారని కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ మండిపడ్డారు. కార్యక్రమంలో ప్రాణహిత పరిరక్షణ వేదిక కన్వీనర్ కె.వి.ప్రతాప్, మాజీ ఇంజనీర్ విఠల్‌రావు పాల్గొన్నారు.

ఫైళ్ల క్లియరెన్స్‌కు మంత్రులు మామూలుగా డబ్బులు తీసుకుంటారు

» నేను మాత్రం కాలేజీ భవనం కట్టాలని కోరా: సురేఖ



గిర్మాజిపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): తమ వద్దకు వచ్చే వివిధ కంపెనీల ఫైళ్లను క్లియర్ చేసేందుకు మంత్రులు మామూలుగా డబ్బులు తీసుకుంటారంటూ మంత్రి కొండా సురేఖ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వరంగల్‌లోని కృష్ణ కాలనీ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో రూ.5 కోట్ల సీఎస్ఆర్ నిధులతో అరబిందో ఫార్మా ఫౌండేషన్ నిర్మించిన నూతన భవనం శంకుస్థాపన కార్యక్రమంలో గురువారం ఆమె మాట్లాడారు. "ఎంతో మంది బాలికలకు ఉన్నత విద్య అందిస్తున్న కాలేజీ తరగతి గదులు వర్షాకాలంలో జలమయమవుతున్నాయి. విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. పాతది కూలగొట్టి, కొత్త భవనం కట్టాలని కలెక్టర్ కూడా నా దృష్టికి తెచ్చారు. ఇందుకు రూ.4.5 కోట్లు ఎక్కడి నుంచి తేవాలో దారీతెన్నూ తెలియలేదు. మరి నేను అటవీ శాఖ మంత్రిగా ఉన్నాను కాబట్టి.. నా దగ్గరకు కొన్ని కంపెనీల ఫైళ్లు క్లియరెన్స్ కోసం వస్తాయి. మామూలుగా అలాంటి ఫైళ్లు వచ్చినప్పుడు మంత్రులు డబ్బులు తీసుకుని క్లియర్ చేస్తారు. అప్పుడు వాళ్లతో నేను అన్నా.. మాకు ఒక్క నయాపైసా ఇవ్వాల్సిన అవసరం లేదు. మీరు సమాజ సేవ చేయండి. మా స్కూల్ ఒకటి డెవలప్ చేయండి. మీ పేరు గుర్తుండి పోతుందని చెప్పా. అప్పుడు మా చేతుల్లో లేదు.. పై వాళ్లతో మాట్లాడతామని అరబిందో ఫార్మాకు చెందిన సదానంద రెడ్డి చెప్పారు. చివరకు సీఎస్ఆర్ నిధులు రూ.4.5 కోట్లతో కాలేజీ భవనం కడతామని చెప్పినప్పుడు నాకు సంతోషం కలిగింది" అని మంత్రి సురేఖ వ్యాఖ్యానించారు. ఆ నిధులతో గ్రౌండ్, రెండంతస్థులతో 15 తరగతి గదులు, ఆడిటోరియం తరహాలో పెద్ద హాల్, 60 అధునాతన టాయిలెట్లు, నూతన ఫర్నిచర్ విద్యార్థినులకు అందుబాటులోకి రానుందని తెలిపారు.

కర్ణాటక తరహా లైసెన్స్‌డ్ సర్వేయర్లు

» తొలిదశలో 5 వేల మంది నియామకం: పొంగులేటి

హైదరాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూ లావాదేవీలను పారదర్శకంగా నిర్వహించడానికి వీలుగా గ్రామ స్థాయిలో లైసెన్స్ సర్వేయర్ల వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కర్ణాటకలో విజయవంతమైన లైసెన్స్‌డ్ సర్వేయర్ విధానాన్ని తెలంగాణలోనూ అమలు చేయడానికి కార్యాచరణ రూపొందిస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొలిదశలో 5 వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తున్నామని, ఇందుకోసం ఈ నెల 17 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు. అర్హులకు సర్వే అకాడమీలో 50 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కర్ణాటకలో అమలవుతున్న లైసెన్స్‌డ్ సర్వేయర్ విధానంపై ఇటీవల సర్వే విభాగానికి సంబంధించిన ఇద్దరు ఉన్నతాధికారులు అధ్యయనం చేసి నివేదిక ఇచ్చారని పేర్కొన్నారు.

ప్రకృతి విధ్వంసానికి సీఎందే బాధ్యత: కేటీఆర్

హైదరాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో ప్రకృతి విధ్వంసం, రూ.10 వేల కోట్ల అవినీతికి సీఎం రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై గురువారం విచారణ సందర్భంగా అధికారులపై సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. రేవంత్ రెడ్డి మూర్ఖత్వంతో అధికారులు జైలు శిక్ష అనుభవించే పరిస్థితి నెలకొందన్నారు. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో రేవంత్‌రెడ్డి తప్పులను ఒప్పుకుని, అక్కడ బుల్డోజర్లతో ధ్వంసం చేసిన అడవులను పునరుద్ధరించాలని, లేదంటే ఆయనకూ కోర్టు శిక్షలు తప్పవన్నారు.

చెట్లు నరకడంలో ఆంతర్యమేంటి!?

(మొదటిపేజీ తరువాయి)

పునరుద్ధరిస్తారో లేదో చెప్పాలని నిలదీసింది. లేకపోతే, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సహా బాధ్యులైన అధికారులందరూ అక్కడే తాత్కాలికంగా నిర్మించే జైలుకు వెళతారని పునరుద్ఘాటించింది. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిలో రాష్ట్ర ప్రభుత్వం చెట్లు కొట్టేసిన అంశాన్ని ఏప్రిల్ 3న సుప్రీంకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించిన విషయం తెలిసిందే. దీనిని భారత ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలో జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం గురువారం మరోసారి విచారించింది. తొలుత.. తెలంగాణ ప్రభుత్వం తరఫున అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. సుప్రీంకోర్టు గత ఆదేశాలను అనుసరించి కంచె గచ్చిబౌలిలో పనులన్నీ ఆపేశామని, వైల్డ్ లైఫ్ సంరక్షణ చర్యలు కొనసాగిస్తున్నామని చెప్పారు. సీఈసీ నివేదిక బుధవారం రాత్రే తమకు అందిందని, దానికి బదులిచ్చేందుకు సమయం కావాలని విజ్ఞప్తి చేశారు.



పునరుద్ధరిస్తారా!? జైలుకు పంపుతారా!?

బుల్డోజర్లతో చదును చేసిన శాటిలైట్ ఫొటోలను సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ (సీఈసీ)కి ఫారెస్ట్ సర్వీస్ ఆఫ్ ఇండియా సమర్పించిందని, అక్కడ కేవలం రెండు రాత్రుల్లోనే 104 ఎకరాలకుపైగా చదును చేశారని అమికస్ క్యూరీ పరమేశ్వర్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అందులో 60 శాతం మోస్తరు, దట్టమైన అటవీ ప్రాంతం ఉన్నట్టు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. దీంతో, చెట్ల నరికివేతకు పర్యావరణ అనుమతులు తీసుకున్నారా? అని సీజేఐ బీఆర్ గవాయి ప్రశ్నించారు. చెట్ల ఎత్తు ఆధారంగా సెల్ఫ్ సర్టిఫికెట్ తీసుకున్నామని సింఘ్వీ బదులిచ్చారు. సెల్ఫ్ సర్టిఫికెట్ కాదని, ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్ (ఈసీ) తీసుకున్నారా? అని సీజేఐ మరోసారి ప్రశ్నించారు. కేవలం 50 హెక్టార్లకుపైగా ఉంటేనే ఈసీ క్లియరెన్స్ తీసుకోవాల్సి ఉంటుందని సింఘ్వీ తెలిపారు. అయితే, "అక్కడ అటవీ ప్రాంతంలోని చెట్లను నరికేసినట్లు ప్రాథమికంగా కనిపిస్తోంది. కంచ గచ్చిబౌలిలో పర్యావరణాన్ని పునరుద్ధరించకపోతే జైలుకు వెళ్లాల్సిందే. ఈ అంశంలో అధికారులను సమర్థించే ప్రయత్నం చేయకండి. చెట్ల నరికివేతలో ప్రధాన కార్యదర్శి సహా ఇతర అధికారుల ప్రమేయం ఉందని తెలుస్తోంది. లాంగ్ వీకెండ్‌ను ఆసరాగా చేసుకుని.. న్యాయస్థానాలకు సెలవు రోజులని తెలిసి అంత పెద్ద మొత్తంలో చెట్లను నరికేస్తారా? డజన్ల కొద్దీ బుల్డోజర్లు తీసుకొచ్చి విధ్వంసం చేస్తారా? వారాంతంలో చెట్లు నరకడంలో ఆంతర్యం ఏమిటి? సుస్థిర అభివృద్ధికి మేమేమీ వ్యతిరేకం కాదు. మిస్టర్ సింఘ్వీ.. మీరసలు బుల్డోజర్ల ఫొటోలు చూశారా? ఇది పూర్తిగా ముందస్తు ప్రణాళికతోనే జరిగినట్టు కనిపిస్తోంది. కోర్టు ధిక్కరణ నుంచి అధికారులను కాపాడుకోవాలని చూడొద్దు. ప్రభుత్వం ముందు రెండు అవకాశాలు మాత్రమే ఉన్నాయి. అడవిని పునరుద్ధరిస్తారో? లేదా అక్కడే నిర్మించే తాత్కాలిక జైలుకు సీఎస్ సహా అధికారులను పంపుతారో నిర్ణయించుకోండి" అని సీజేఐ మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు.

మొక్కలు నాటుతున్నాం: సింఘ్వీ

ఇప్పటికే అడవి పునరుద్ధరణ చర్యలు తీసుకున్నామని, అందులో భాగంగా మొక్కలు నాటుతున్నామని ధర్మాసనానికి అభిషేక్ మను సింఘ్వీ తెలిపారు. ఈ మేరకు ఫొటోలతో కూడిన పూర్తి నివేదికను కోర్టుకు అందజేస్తామని వివరించారు. అయితే, చెట్లు నరికేసిన స్థలంలోనే మొక్కలు నాటుతున్నారా? అని సీజేఐ ప్రశ్నించారు. అయితే, అక్కడ కాకుండా మరోచోట మొక్కలు నాటుతున్నారని ప్రతివాదులు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీనికి సింఘ్వీ అభ్యంతరం తెలిపారు. అయితే, వాదనల్లోకి వెళ్లేందుకు కోర్టు నిరాకరించింది. అక్కడ అడవిని పునరుద్ధరిస్తున్నారా? లేదా? అనేదే తమకు ముఖ్యమని స్పష్టం చేసింది. సింఘ్వీ తన వాదనలు కొనసాగిస్తూ.. ఆ స్థలంలో ఎలాంటి అభివృద్ధి చేయాలనే అంశంపై సుమారు ఏడాదిగా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందని తెలిపారు. అంతేతప్ప ఇది కేవలం వారాంతంలో తీసుకున్న నిర్ణయమేమీ కాదని స్పష్టం చేశారు. అయితే, చెట్ల నరికివేతను సోమవారం ఎందుకు ప్రారంభించలేదని సీజేఐ ప్రశ్నించారు. దాంతో, తమ తదుపరి నివేదికలో అన్నింటికీ స్పష్టతనిస్తామని సింఘ్వీ బదులిచ్చారు. కాగా, సీఈసీ నివేదికకు కౌంటర్ దాఖలు చేయడానికి ఎంత సమయం కావాలని సీజేఐ ప్రశ్నించగా.. జూలై వరకు సమయం ఇవ్వాలని సింఘ్వీ కోరారు. దీనికి సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి అభ్యంతరం తెలిపారు.

అలాంటి ప్రణాళికేదీ లేదు: నిరంజన్ రెడ్డి

అడవి పునరుద్ధరణకు ప్రభుత్వం వద్ద ప్రణాళికేదీ లేదని ఇంప్లీడ్ పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు రాబోయే వర్షాకాలం సరైనదని, హైదరాబాద్‌లో మాన్ సూన్ సీజన్ జూన్ 10 నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఐటీ నిర్మాణాల కోసం ఆలోచన చేస్తోందని, కానీ, పునరుద్ధరణ చర్యలేమీ తీసుకోవడం లేదని తెలిపారు. ఇప్పుడు ఉద్దేశపూర్వకంగానే జూలై వరకు వాయిదా కోరుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా, ప్రభుత్వం ఇటీవల సమర్పించిన నివేదికలోని అంశాలను ప్రస్తావించేందుకు సింఘ్వీ ప్రయత్నించగా, సీజేఐ అడ్డుకున్నారు. చెట్ల నరికివేత ప్రదేశంలో జింకలు, నెమళ్లు స్పష్టంగా ఉన్నాయని, మళ్లీ దానిని కప్పిపుచ్చుకునే ప్రయత్నాలు ఎందుకని ప్రశ్నించారు.

3 పాఠశాలలను కూల్చివేశారు: వరుణ్ ఠాకూర్

కంచ గచ్చిబౌలి భూముల్లో చెట్ల నరికివేత సమయంలో విజిల్ బ్లోయర్లు, విద్యార్థులపై కేసులు నమోదు చేశారని సీనియర్ న్యాయవాది వరుణ్ ఠాకూర్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. సుమారు 200 మంది విద్యార్థులపై క్రిమినల్ కేసులు పెట్టారని, ప్రస్తుతం పరీక్షలు జరుగుతున్నాయని, పరీక్షలు రాయాల్సిన కొందరు విద్యార్థులు జైళ్లలో ఉన్నారని తెలిపారు. విద్యార్థులపై కేసులు కొట్టేసేలా ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. విద్యా సంవత్సరం మధ్యలోనే మూడు పాఠశాలలను కూల్చివేశారని చెప్పారు. దీనిపై సీజేఐ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. "ఈ కేసును గతంలోనూ (సీజేఐ కాకముందు) నేనే విచారించాను. ఇప్పటి వరకూ స్కూళ్ల కూల్చివేత ఆరోపణలు రాలేదు. అక్కడికి వెళ్లి పరిశీలించిన అనేక కమిటీలు కూడా తమ నివేదికల్లో ఈ అంశాన్ని ప్రస్తావించలేదు" అని వ్యాఖ్యానించారు. తాము కూడా మొదటిసారిగా ఈ ఆరోపణలు వింటున్నామని సింఘ్వీ తెలిపారు. అయితే, సుమోటో కేసుతో కలిపి దీనిని (ఐఏ) విచారించడం కుదరదని, కావాలంటే, మరో పిటిషన్ దాఖలు చేసుకోవాలని సీజేఐ సూచించారు. కాగా, ఓ స్వచ్ఛంద సంస్థ తరఫున మోహిత్ రావు వాదనలు వినిపిస్తూ.. అక్కడ జరిగిన విధ్వంసానికి సంబంధించి తాము స్పష్టమైన ఫొటోలతో కూడిన ఆధారాలు సమర్పించామని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దాంతో, అన్ని పిటిషన్లను సుమోటోతో కలపవద్దని సీజేఐ తెలిపారు. తమ పిటిషన్ మొదటి నుంచీ ఉన్నదేనని, మరోసారి ధర్మాసనం దృష్టికి తీసుకొస్తున్నానని మోహిత్ రావు స్పష్టం చేశారు. తమ పిటిషన్‌లో బుల్డోజర్లతో చదును, అడవిని నిర్మూలించే, జంతువులు, పక్షులు అక్కడ నివాసం ఉండే ఆధారాలతో కూడిన చిత్రాలు జత చేశామని తెలిపారు. దీనిపై ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాధానం రాలేదన్నారు. దాంతో, రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్ పిటిషన్‌లోనే అన్నిటినీ పొందుపరిచామని సింఘ్వీ బదులిచ్చారు. అలాగయితే.. ఆ కాపీని మోహిత్ రావుకు అందజేయాలని సీజేఐ ఆదేశించారు. తదుపరి విచారణను జూలై 23కు వాయిదా వేశారు.

అటవీ ప్రాంతంగా కంచ గచ్చబౌలి భూములు

» నిర్వహణను అటవీ శాఖకు అప్పగించాలి

» సుప్రీం కోర్టుకు సీఈసీ తుది నివేదిక

హైదరాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చబౌలి భూములను అటవీ ప్రాంతంగా ప్రకటించాలని కేంద్ర సాధికార కమిటీ (సీఈసీ) సిఫారసు చేసింది. ఆ భూముల నిర్వహణను అటవీ శాఖకు అప్పగించాలని కోరింది. అలాగే, అక్కడున్న జీవ వైవిధ్యం దృష్ట్యా ఆ భూములను వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972 కిందకు తెచ్చే అంశాన్ని కూడా పరిశీలించాలని సూచించింది. కంచ గచ్చిబౌలి భూములకు సంబంధించి సీఈసీ ఏప్రిల్‌లో మధ్యంతర నివేదిక ఇచ్చిన విషయ తెలిసిందే. తాజాగా తుది నివేదికను సుప్రీం కోర్టుకు తాజాగా సమర్పించింది. ఇందులో అనేక కీలకమైన సిఫారసులు చేసింది. "ఆ ప్రాంతంలో కొట్టేసిన చెట్ల స్థానంలో మళ్లీ మొక్కలు నాటి దట్టమైన పచ్చదనం పెంపొందించేలా చేయాలి. వచ్చే వర్షాకాలంలోనే ఈ పని చేపట్టాలి. భూసార, జల సంరక్షణ కార్యక్రమాలను కూడా చేపట్టాలి. అక్కడి జల వనరులన్నింటినీ వెట్ ల్యాండ్స్ సంరక్షణ, నిర్వహణ నిబంధనలు-2017 ప్రకారం సంరక్షించాలి. జీహెచ్ఎంసీ ఆ ప్రాంతంలో సరైన మురుగునీటి శుద్ధి ప్లాంట్లను వచ్చే ఏడాది కాలంలో ఏర్పాటు చేయాలి" అని సూచించింది. ఇక, రాష్ట్రంలోని అటవీ భూములను గుర్తించడానికి నిపుణుల కమిటీని రాష్ట్ర ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించాలని, ఆ కమిటీలో క్షేత్రస్థాయి అటవీ అధికారులు, వన్యప్రాణి నిపుణులు, జీవావరణవేత్తలు, ఐటీ, రిమోట్ సెన్సింగ్ నిపుణులు, సర్వే ఏజెన్సీలు ఉండాలని పేర్కొంది. కోర్టు ఆదేశాల ప్రకారం అటవీ ప్రాంతాల్లా ఉన్నవాటిని ఈ కమిటీ గుర్తించాలని, ప్రైవేటు భూముల కంటే ప్రభుత్వ భూములను అటవీ ప్రాంతాలుగా గుర్తించే విషయంలో కమిటీ మరింత కఠినంగా ఉండాలని సిఫారసు చేసింది. రాజ్యాంగంలోని 48ఏ, 21 ప్రకరణల ప్రకారం ప్రభుత్వంపై సదరు బాధ్యత ఉంటుందని తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లో అటవీ భూముల్లాంటివి ఎక్కువగానే ఉంటాయని, పట్టణ ప్రాంతాల్లో అక్కడక్కడా మాత్రమే ఉంటాయని, డీమ్డ్ ఫారెస్ట్‌గా ఏ భూమిని గుర్తించాలన్న విషయంపై నిపుణుల కమిటీ ఈ వైవిధ్యాన్ని దృష్టిలో పెట్టుకోవాలని తెలిపింది. వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం ఉన్నతస్థాయి కమిటీని వేయాలని సిఫారసు చేసింది. ఇందులో పీసీసీఎఫ్, సీసీఎల్ఏ, న్యాయ నిపుణులు, పర్యావరణవేత్తలు ఉండాలని సూచించింది. ప్రభుత్వ, సంస్థలకు చెందిన భూములను అటవీ ప్రాంతాలుగా గుర్తించేందుకు ఎలాంటి పద్ధతి అనుసరించాలన్న దానిపై ఈ కమిటీ పని చేయాలని సిఫారసు చేసింది. అలాగే, సుప్రీం కోర్టు ఆదేశాలను కూడా నెరవేర్చేలా ఈ కమిటీ పర్యవేక్షించాలని సూచించింది. సీఈసీ సూచనల మేరకు కంచ గచ్చబౌలిలో తొలగించిన చెట్ల పరిమాణాన్ని నిర్ధారించేందుకు ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియాకు అయిన రూ.14.52 లక్షల ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం భరించాలని, ఆ మొత్తాన్ని ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియాకు చెల్లించాలని సూచించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.